# సమన్వయ భాగవతం

తెలుగు అనువాదం : డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు



# సమన్వయ భాగవతం

## మూలము : వ్యాస భాగవతం

తెలుగు అనువాదం : డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు

# సమన్వయ భాగవతం

(భక్తి - నారద సమాగమము)

ప్రథమ ముద్రణ : మార్గశిరమాసం, దత్తజయంతి, 2001

డి.టి.పి. మరియు ఎడిటింగ్ : శ్రీమతి లక్కరాజు లక్ష్మిగోపాల్

శ్రీమతి కాటూరి తేజశ్రీ

శ్రీమతి రాజ్యలక్ష్మి

# సమన్వయ భాగవతం - ఒక పరిచయము

వేదాలను క్రోడీకరించి పురాణేతిహాసాలు రచించి, ఉపనిషత్తులను, స్మృతులను, గీతలను వర్గీకరణము చేసి మహాభారతాన్ని రచించిన వ్యాసుడు సరస్వతీనదీ తీరంలో కూర్చుని తాను చేసిన అంతటి బృహత్కార్యానికి సంతసించక యేదో లోటుందని తీవ్రంగా దుఃఖించుచుండెను. అది వ్యక్తిగత దుఃఖము కాదు, సామూహిక చింతన. ఇంత వ్రాసినా మానవజాతికి కావల్సిన శాంతిని యివ్వలేకపోయా ననే వ్యథ అది.

ఆ సమయంలో దేవర్షి నారదుడు అక్కడికి వచ్చి వ్యాసుని బాధను స్వయంగా విని, దాన్ని అర్థము చేసికొని అతనికి అశాంతిపోయే మార్గమును వుపదేశించాడు. ఆ మార్గమే జగద్గురుచరిత్ర(లేక చేతనత్వవిద్య)ను రచించి దాన్ని ప్రపంచమునకు అందజేయుట. ఆ మార్గము మూడువిధాలుగ అందించబడినది.

## *1. గోకర్ణుడు ధుంధుకారికి చెప్పిన భాగవతము*

ఆత్మలేనటువంటి పంచకోశములు ప్రేతములే. పంచప్రేతములకు వశమైన చేతనత్వమే ధుంధుకారి. అందుచేత భాగవతం మొదట యీ పంచప్రేతాల నుండి విముక్తిని కలిగిస్తుంది. అనగా ప్రేతయోనిని దాటిస్తుంది.

## *2. పరీక్షిన్మహారాజుకు శుకమహర్షి చెప్పిన భాగవతము*

కాలసర్పము ప్రతివొక్కరిని కాటువేస్తుంది. మృత్యువు తప్పదని తెల్సిన వ్యక్తి, మృత్యువు తర్వాత కూడ తన వునికి కచ్చితంగా వుంటుంది అని తెలిస్తే; ఆ జీవితంయొక్క కాలపరిమాణము జాగ్రదావస్థకంటే అనేకరెట్లు యెక్కువని తెలుసుకుంటాడు. అప్పుడు యీ భౌతికజగత్తులో సాధించినది మృత్యుసమయంలో యేమి వుపయోగపడదు అని తెలుసుకుని మృత్యురహస్యము తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు.

## *3. సనకాదులు, నారదునికి చెప్పిన భాగవతము :*

మృత్యుభయము పోయిన వ్యక్తి, నారదుని వలె జీవిస్తూ దేశకాల పరిస్థితులలో జ్ఞాన, వైరాగ్యములు క్షీణించుట గమనిస్తాడు. తిరిగి మళ్ళీ మానవ జీవితంలో లక్ష్యంకొఱకు నిరంతరము శ్రమించట మనేది (భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు) యెలా నాటాలో తెలుసుకుంటాడు. ఏనాటి సమాజంలోనైనా యీరకము వ్యక్తులు తారసపడతారు.

***<u>1. ధుంధుకారి</u>*** : శరీరానికి లొంగి జీవించేవాడు ( సాధారణ మానవులు యెక్కువ శాతం యీ కోవకు చెందుతారు).

***<u>2. పరీక్షిత్తు</u>*** : మృత్యువుని తెలుసుకుని, మృత్యువుని దాటి జీవించేవాడు (యోగులు, మహాత్ములు యీ కోవకు చెందుతారు)

***<u>3. నారదుడు</u>*** : దైవీప్రణాళిక తెలిసి, దేవతలనికూడ దైవీప్రణాళికకు అనుగుణ్యంగ శాసించేవాడు (జగద్గురు పరంపర).

ఇవీ ఇందులో స్థూలంగా చర్చించబడిన విషయాలు.

వేదాలను క్రోడీకరించి, పురాణేతిహాసాలను రచించి ఉపనిషత్తులను వ్యాఖ్యానించడమేగాక. సకల వేద, శాస్త్ర, పురాణేతిహాసాలకు, ధర్మానికి ప్రమాణమైన మహాభారతమును రచించాడు. అయినా యెక్కడో అశాంతి, తీరని వ్యధ! ఆయన సరస్వతీనది ఒడ్డున కూర్చుని తాను చేసిన బృహత్కార్యాన్ని ఒక్కసారి సింహావలోకనం చేసుకున్నాడు. ఇంతటి మహత్తరమైన జ్ఞానాన్ని ప్రపంచానికి అందించినా యేదో తీరని అశాంతి, లోటు వుందని తీవ్రంగా దుఃఖించాడు.

ఆ సమయంలోనారదమహర్షి అక్కడికి వచ్చి వ్యాసుడి బాధను అర్థము చేసికుని, తరుణోపాయం సూచించాడు. కలియుగంలో మానవులు భక్తిహీనులు, శక్తిహీనులు, క్రియాహీనులు. వీరికి వేద, శాస్త్ర, పురాణేతిహాసాలు శాస్త్రములు చదివే తీరిక, ఓపిక వుండవు. అటువంటివారు తరించేందుకుగాను 'శ్రీమద్భాగవత రచన' అది శ్రీకృష్ణుని చరిత్ర, జగద్గురుచరిత్ర కనుక ఆయన లీలలు, మధురభక్తి, ప్రేమల సమన్వయ స్వరూపంగా వ్రాసినట్లయితే అది నీకు ఆనందాన్ని, మానవాళికి తరుణోపాయాన్ని యిస్తుంది కనుక తక్షణమే దానిని రచించమని ఆదేశిస్తాడు నారదముని. శ్రీమద్భాగవతం మూడురకాలైన చేతనత్వాలలో అద్భుతమైన మార్పులను తీసుకొస్తుంది.

***<u>1. గోకర్ణుడు ధుంధుకారికి చెప్పిన భాగవతం</u>*** : పూర్వకాలంలో ఆత్మదేవుడు, ధుంధులి అను దంపతు లుండేవారు. వారికి సంతానము లేదు. అందువల్ల విచారక్రాంతుడైన ఆత్మదేవుడు ఒక సాధువుని ఆశ్రయించి తన కోర్కెను తెలుపగా, ఆయన ఒక పండును ప్రసాదిస్తూ 'నీ భార్యకు యీ పండు తినిపింపుము, సత్పుత్రుడు వుదయించు' ననెను. అంతట పరమానందభరితుడైన ఆత్మదేవుడు ఆ ఫలమును తినమని తన భార్య కివ్వగా, దుష్టబుద్ధికల ఆమె ఆ పండును తాను తినక ఆవుకి తినిపించెను. కానీ తాను తిన్నట్లు నటించెను. ఆ సమయంలో ధుంధులి చెల్లెలు గర్భవతి. నవమాసములు నిండాక తన సోదరి సహకారంతో ఆమెకు పుట్టిన బిడ్డను తన బిడ్డగా భర్తకి చూపించెను. ఆత్మదేవుడు వానికి ధుంధుకారి అని పేరుపెట్టెను. కొద్దికాలము తర్వాత గోవు సర్వాంగసుందరుడైన బాలుని ప్రసవించెను. ఆత్మదేవుడు ఆవు చెవులనుండి పుట్టిన ఆ బాలునికి గోకర్ణుడని పేరుపెట్టెను. యుక్తవయస్కుడగునప్పటికి గోకర్ణుడు సకలశాస్త్రపారంగతు డవ్వగా, ధుంధుకారి మాత్రం వేశ్యాలోలు డయ్యెను. అది చూసి ఆత్మదేవుడు దుఃఖితుడై, గోకర్ణుని సలహాపై తీర్థయాత్రలకు వెళ్ళెను. కాలక్రమంలో ధుంధుకారిని వేశ్యలు (ఇంద్రియములు) చంపి, అతని ధనమును (ఆత్మజ్ఞానమును) అపహరించిరి. చెడుకర్మలను ఆచరించిన ధుంధుకారి ప్రేతమయ్యెను.

ప్రేతాత్మ అయిన తమ్మునికి నిష్కృతి కలిగించుటకు గోకర్ణుడు సూర్యుని ఆదేశాలమేరకు భాగవత సప్తాహము చేసెను. ధుంధుకారి 7 కణుపులున్న వెదురులో వుండి భాగవతమును వినగా, రోజుకొక కణుపు చొప్పున వెదురు పగిలిపోయి పాపవిమోచనము కలిగెను.

ఆత్మలేని పంచకోశములే ప్రేతములు. పంచకోశములకు వశమైన చేతనత్వమే ధుంధుకారి. అందుచేత భాగవతం మొదట యీ ప్రేతములనుండి విముక్తి కలిగిస్తుంది.

*2. పరీక్షిన్మహారాజుకు శుకమహర్షి చెప్పిన భాగవతము* : కురుక్షేత్ర సంగ్రామమైపోయాక అశ్వత్థామ ఉపపాండవులని హతమార్చిన తరువాత దాని తీవ్రపరిణామాలు వూహించుకుని, ఆతడు ఆత్మరక్షణార్థమై వ్యాసమహర్షి ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. కుమారుల మరణము, ద్రౌపది దుఃఖము చూసిన తర్వాత అర్జునుడు గురుకుమారుని చంపుతానని ప్రతిజ్ఞ చేసి బయలుదేరగా, శ్రీకృష్ణుడు అతనిని అనుసరించి వ్యాసమహర్షి ఆశ్రమానికి చేరుకుంటాడు.

శ్రీకృష్ణార్జునుల ఆగమనం చూసిన అశ్వత్థామ మరణభయంతో ముందుగానే అపాండవమస్తు అంటూ బ్రహ్మాస్త్ర ప్రయోగం చేస్తాడు. దీని పర్యవసానాన్ని వూహించి కృష్ణుడు పాండవులని రక్షిస్తూనే అంగుష్ఠమాత్ర దేహుడై ఉత్తరగర్భంలోకి ప్రవేశించి అక్కడ బ్రహ్మాస్త్ర జ్వాలల్లో అల్లాడిపోతున్న గర్భస్థశిశువుకు ప్రాణరక్షణ చేస్తాడు. బిడ్డ జన్మించిన క్షణంనుండి ప్రతివారి ముఖంలోకి తనను రక్షించిన మహాత్ముని దివ్యదర్శనం కొఱకు తేరిపార చూస్తుండేవాడు. శ్రీకృష్ణుని చూస్తూనే చిరునవ్వులు చిందిస్తాడు. అతడే పాండువంశానికి మిగిలిన వంశోద్ధారకుడు -పరీక్షిత్తు.

పరీక్షిత్తు పెరిగి పెద్దవాడై ధర్మాన్ని నాలుగుపాదాలమీద నడుపుతూ కలిప్రవేశాన్ని సుమారు 36 సంవత్సరాలు ఆపుతాడు. దేశాన్ని సుభిక్షంగా పరిపాలించి ప్రజలను కన్నబిడ్డలుగా చూసే ఆయన ఒకరోజు వేటకు వెళతాడు. అక్కడ పిపాసపీడితుడై శమీకమహర్షి ఆశ్రమంలోకి ప్రవేశించి, ధ్యానమగ్నుడై యున్న మునిని మంచినీళ్ళిమ్మని అడుగగా ఆయన ప్రత్యుత్తరమీయలేదు. దానికి కోపించిన పరీక్షిత్తు, మహర్షి మెడలో చనిపోయిన పామును వేసివెళ్ళిపోతాడు. ఈ విషయమును మునికుమారుడు విని తన తండ్రి మెడలో చనిపోయిన పామును వేసినవ్యక్తి వారంరోజులలో తక్షకుని కాటుకు గురై మరణించుగాక! అని శపిస్తాడు. విషయమెరిగిన శమీకుడు కుమారుడు చేసిన తప్పిదానికి వ్యధాభరితచిత్తుడై శాపాన్ని వెనక్కి తీసుకోలేని పరిస్థితులలో పరీక్షిత్తుయొక్క ధర్మపరిపాలనా దక్షత, అసమానప్రతిభను తలచుకుని ముందుజాగ్రత్తగా పరీక్షిత్తుకి శాపవృత్తాంతాన్ని తెలియజేస్తాడు.

అపుడు సుఖసంతోషాలతో ప్రజారంజకంగా తన రాజ్యాన్ని పరిపాలన సాగిస్తున్న పరీక్షిన్మహారాజు శాపవృత్తాంతము వింటూనే రాజ్యాన్ని బంధు, మిత్ర పరిజనులను వదలి సర్వసంగపరిత్యాగియై గంగానదీతీరానికి వెళ్ళి మోక్షప్రదమైన శ్రీమద్భాగవత సప్తాహశ్రవణం చేయసంకల్పిస్తాడు.

గోదోహన కాలంకంటే యెక్కువసేపు ఒకచోట వుండని శుకమహర్షి ఆ విషయము తెల్సిన వెంటనే పరీక్షిత్తుకు భాగవత సప్తాహశ్రవణం చేయటానికి గంగానదీ తీరానికి వస్తాడు.

మరణం తెలిసి, ఇంక నన్ను కాలసర్పం కాటువేయబోతున్నది, మృత్యువు తర్వాతకూడ నా వునికి తథ్యము కాబట్టి దానికి కావల్సిన భవిష్యప్రణాళిక భాగవత సప్తాహ శ్రవణం వల్ల మాత్రమే సాధ్యమని రాజు ఒక నిర్ణయానికి వస్తాడు. ఈ విపత్తునుండి విముక్తి పొందాలంటే అమృతపానమే తరుణోపాయం. అమృతపానం దేవతలకు మాత్రమే సాధ్యము. కానీ శ్రీమద్భాగవతామృతమును ఆర్తి, ప్రేమ వున్న ప్రతీవ్యక్తి పొందవచ్చు. అది వారిలో ముసురుకునివున్న అజ్ఞానతిమిరాలను పారద్రోలి, జ్ఞానజ్యోతిని వెలిగిస్తుంది. దేవతలకు కూడ యిది సాధ్యం కాదు.

అటువంటి మానసికస్థితిలో వున్న మహరాజుకు జీవన్ముక్తుడైన శుకమహర్షి కథాశ్రవణం చేయించడంవల్ల చెప్పినవారు, విన్నవారు ఒక నిర్ణీత లక్ష్యంతో చేయడంవలన లక్ష్యశుద్ధి యేర్పడి ఫలితం కనిపించింది. భౌతికజగత్తులోనే

రాజ్యాలుకాని, భోగభాగ్యాలుగాని, సంపదలుగాని మరణసమయంలో తమ ప్రభావాన్ని చూపలేవు. నిస్సంగస్థితిలో భాగవత చింతన 7 క్షణాలు చేసినా, 7 యుగాల ప్రభావం కలిగివుంటుందనే నిత్యసత్యాన్ని గుర్తించినవారుసైతం అన్ని పనులు మానివేసి మృత్యురహస్యం తెలుసుకోకపోవడం ఎంతో శోచనీయమైన విషయము. నేను, నాది అన్న బంధవిముక్తికి గురుదేవులు శ్రీరామశర్మఆచార్య ఒక ధర్మసూత్రాన్ని యిచ్చారు. అదే అస్వాద, అపరిగ్రహవ్రతములు.

***3. సనకాదులు నారదునికి చెప్పిన భాగవతం*** : మృత్యుభయము తొలగిన వ్యక్తి నారదుని వలె జీవిస్తున్నప్పుడు దేశకాల పరిస్థితులలో మనుష్యులలో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు క్షీణించినట్లు గమనించారు. మృత్యువుని దాటినవారు మానవజాతిలో తిరిగి ఆధ్యాత్మిక జ్యోతుల్ని వెలిగించడానికి అనేకానేక పూజ, ఉపాసన కార్యక్రమాలు ప్రవేశపెట్టి నిరంతరము శ్రమిస్తూనేవుంటారు. నారదునికి చతుర్ముఖబ్రహ్మ భాగవతం ఉపదేశము చేసినప్పటికి, భాగవత సప్తాహ విధివిధానాలను సనకాదులు యెంతో ప్రతీపూర్వకంగా ఆయనకు వినిపిస్తారు. ఈ భాగవత సప్తాహం మానవుణ్ణి 4 రకాల చేతనత్వస్థితులు పొందగలిగేలా చేస్తుంది.

భాగవతమును భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర, ఆషాఢ, శ్రావణ మాసాలలో నిర్వహించినచో అత్యంత ఫలదాయకంగా వుంటుంది. భాగవత కథాశ్రవణానికి బంధుమిత్రులను ఆహ్వానించాలి. ఈ కార్యక్రమాన్ని పుణ్యతీర్థాలలో కాని, దేవాలయాల్లోగాని, స్వగృహంలోగాని చేసుకోవాలి. ముందుగా అందమైన మండపాన్ని యేర్పరచి జగద్గురు ప్రతిమను స్థాపించి, షోడశోపచారపూజ చేయాలి. అలాగే శ్రీమద్భాగవత గ్రంథానికికూడ పంచోపచారపూజ చేయాలి. సూర్యోదయ సుముహుర్తంలో కథాశ్రవణము ప్రారంభించాలి. వీలైతే ఉపవాసదీక్షలో వుండాలి.

## “ సమన్వయభాగవతం ”

ఈ గ్రంథానికి ఆ పేరుపెట్టడంలో ఔచిత్యాన్ని గమనిద్దాము. సూర్యుడి 7 కిరణాలలో యేదో ఒక కిరణము కొంతకాలంపాటు అనగా సుమారు 2,160 సంవత్సరాలు చురుకుగా పనిచేస్తూ ప్రపంచ సంఘటనలను, జాతుల జీవితవిధానమును శాసిస్తూవుంటుంది. సూర్యకిరణవిజ్ఞానము - జ్యోతిర్విద్య తెల్సినవారు ఏ కాలంలో ఏ కిరణము యే పనిచేస్తున్నదో గ్రహించగలరు. విషవద్బిందువు ప్రస్తుతం కుంభరాశిలో, పూర్వాభాద్రనక్షత్రంలో వున్నది. దీని ప్రభావంవల్ల సూర్యునియొక్క 7వ కిరణ మయిన వ్యవస్థ మిగతా ఆఋ కిరణాలతో సమన్వయ స్వరూపంగా రూపుదిద్దుకుంటుంది.

మీనరాశి లక్షణమైన భక్తి, దాని పుత్రులైన జ్ఞానవైరాగ్యాలు క్షీణదశలో వున్నవి. కనుక వ్యవస్థీకృతమైన జీవితవిధానం మానవజాతికి అందించాలనే వుద్దేశ్యంతో యీ సమన్వయ భాగవతం అందించబడుతోంది. ఇందులో మూడురకాల చేతనత్వస్థితులను, వాటిని సమన్వయం చేసే నాల్గవ చేతనత్వస్థితిని చర్చించారు.

***1. కృష్ణం వన్దే పృథాసుతం*** : ఈ పృథ్వీ యావత్తు ఒక విశ్వవిద్యాలయం. ఇందులో భౌతికశరీరంవల్ల పొందిన సంబంధబాంధవ్యాలు, పేరుప్రతిష్ఠలు, భోగభాగ్యాలు ఆఖరికి రాజ్యాలతో సహా అన్నీ యేనాటికైనా సమసిపోయేవే. కనుక వాటికోసం యుద్ధాలు, రక్తపాతాలు యెందుకు?

సాత్వికంగా ధర్మమార్గంలో బ్రతుకుతానుగాని యీ హింసాయుతమైన జీవితవిధానం నాకక్కర్లేదు అనే మానసికస్థితి - అర్జునస్థితి. ఈ స్థితిలో వున్నవారికి ప్రతినిధి ధుంధుకారి. ఇంద్రియలోలుడై, ఆసురీసంపత్తితో నిండిన యీ ధుంధుకారి ప్రేతరూపానికి సప్తాహ పారాయణతో విముక్తి కల్గించినవాడు గోకర్ణుడు. ధుంధుకారి చంచలాత్మకమైన మనస్సుకు ప్రతీక.

***2. కృష్ణం ద్వైపాయనం వన్దే:*** నిత్యజీవితంలో యెదురయ్యే సమస్యలకి భీషణప్రతిజ్ఞలు చేయకుండా ధర్మసూక్ష్మం తెలుసుకుని యేది వుచితమో, యేది అనుచితమో నిర్ణయించుకుని, చేయవల్సిన పనిని తక్షణమే ఆచరణలో పెట్టేవాడు ద్వైపాయనుడు. భీష్ముడిలా కాక తల్లి సత్యవతిదేవి మాటప్రకారం ధర్మాన్ని అనుసరించి వంశమును నిలబెట్టాడు. ఈయన నిశ్చయాత్మకమైన బుద్ధికి ప్రతీక. తాను అవినాశీ ఆత్మనని, జ్ఞానము సాధించడానికి తన జీవితకాలంలోనే ప్రయత్నించాలి అనుకొనే పరీక్షిత్తు లాంటివారికి పుట్టుకతోనే జ్ఞానమే స్వరూపంగా కలవాడైన శ్రీశుకుడు గురువుగా లభిస్తాడు. ఈ స్థితిలో కూడ వ్యక్తి ఇంద్రియాల చంచలత్వానికి లొంగిన సందర్భాలు వుంటాయి.

***3. కృష్ణం వన్దే వ్రజప్రియం*** : విశ్వప్రణాళికకు సంపూర్ణంగా తన జీవితాన్ని మలచుకున్న చేతనత్వం కృష్ణ చేతనత్వము. ఇంద్రియాలకి అధిపతి.

***4. కృష్ణం నారాయణం వన్దే*** : విశ్వప్రణాళిక తానైన చేతనత్వం - నారాయణ చేతనత్వము. ఈ నాల్గవ చేతనత్వస్థితిని చేరటమే మానవజాతికి యివ్వబడిన పాఠ్యాంశము. భగవత్ సంకల్పరూపమే యీ సృష్టి. భగవదంశయైన మానవుడిలోని సంకల్పశక్తిని పెంపొందించేదే చేతనత్వవిజ్ఞానం. ఈ శక్తిద్వారా పై చేతనత్వస్థాయిలను యేవిధంగా ఒక వ్యక్తి సాధించగలడో విశదీకరించే ఒక అపూర్వ ప్రయత్నంగా సమన్వయ భాగవతమును డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు మానవజాతికి తమ ప్రవచనంగా అందించారు.

ఈ పుస్తకము మూడురకాల స్థితులలో వున్న వ్యక్తులలో వున్న సామాన్య లక్షణమైన భక్తిగురించి విస్తృతమైన వ్యాఖ్యలను మనస్తత్త్వశాస్త్రరీత్యా పాఠకులకు అందిస్తున్నది.

భక్తినే ఆధునికపదజాలంలో కోరిక అన్నారు. కోరికయొక్క పుట్టుక, దాని క్షీణతలను ఆధునికవిజ్ఞానశాస్త్రరీత్యా విశ్లేషించడమేకాక ఎటువంటి దుస్సాధ్యమైన కోరికనైనా తీర్చుకోగల్గు అతి సులభమైన సూత్రమును పొందుపఱచటమైనది. భాగవతంలోని జ్ఞానవిజ్ఞానములు; సోమరులు, బాధ్యతగా పనిచేయనివారికి నిరుపయోగము. మానవులలో లోపించుచున్న భక్తిశ్రద్ధలను తిరిగి క్రియాన్వితము చేయుటకు శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః' అంటాడు. ఆయన మానవులలో ఘంటాపదంగా ఒక ఆశ్వాసనను కలిగించాడు. యుగయుగాలుగా గురుపరంపర, అవతారపరంపర మానవజాతిని వుద్ధరించుటకు సృజనాత్మకమైన నూతన ప్రణాళికలతో తమవంతు కృషిని చేస్తున్నది. సర్వవ్యాపియైన గురుని మార్గదర్శనంలో ముందుకు పయనించి జీవితాలను ధన్యము చేసుకోవాలని ఆశిస్తూ.....

**ఇట్లు**

**శ్రీమతి లక్కరాజు లక్ష్మిగోపాల్**

**శ్రీమతి లక్కరాజు రాజ్యలక్ష్మి**

# శ్రీమద్భాగవత మాహాత్మ్యము

ఓం నమో భగవతే వాసుదేవాయ

కృష్ణం నారాయణం వన్దే కృష్ణం వన్దే వ్రజప్రియం ।

కృష్ణం ద్వైపాయనం వన్దే కృష్ణం వన్దే పృథాసుతం ॥

భావము : నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణదేవునికి నమస్కారము. వ్రజప్రియుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయనస్వరూపుడైన శ్రీకృష్ణభగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.

## అథ ప్రథమోఽధ్యాయః

### దేవర్షి నారదుడు భక్తిని కలుసుకొనుట

సచ్చిదానన్దరూపాయ విశ్వోత్పత్త్యాది హేతవే ।

తాపత్రయవినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః ॥ (శ్లో॥ 1)

భావము : సత్, చిత్, ఆనంద స్వరూపము, విశ్వంయొక్క వుత్పత్తి, స్థితి, వినాశనానికి కారణమైన మఱియు ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆదిభౌతికమైన మూడురకాల తాపములను నాశనము చేసే ఆ శ్రీకృష్ణభగవానునికి మేము నమస్కరించుచున్నాము.

యం ప్రవ్రజన్తమనుపేతమపేతకృత్యం

ద్వైపాయనో విరహకాతర ఆజుహావ ।

పుత్రేతి తన్మయతయా తరవోఽభినేదు

స్తం సర్వభూతహృదయం మునిమానతోఽస్మి ॥ (శ్లో॥ 2)

భావము : ఎప్పుడైతే శుకదేవుడు యజ్ఞోపవీత సంస్కారంకూడ అవకుండా మఱియు లౌకిక, వైదిక కర్మానుష్ఠానాలు చేసే అవసరము రాకుండా ఒంటరిగా సన్యాసం తీసుకోవడానికి యింటినుండి వెడలుచున్నాడో; అది చూసిన ఆయన తండ్రి వ్యాసభగవానుడు విరహంతో పుత్రా, నీవెక్కడికి వెడుతున్నావని బాధతో అడిగాడు. అప్పుడు వృక్షములు తన్మయంచెందినవై శ్రీశుకభగవానుల తరఫునుండి అవి జవాబునిచ్చాయి. అలాంటి సర్వభూత హృదయస్వరూపుడైన శ్రీశుకదేవమహర్షికి మేము నమస్కరిస్తున్నాము.

నైమిషే సూతమాసీనమభివాద్య మహామతిమ్ ।

కథామృతరసాస్వాదకుశలః శౌనకోఽబ్రవీత్ ॥ (శ్లో॥ 3)

భావము : ఒకసారి భగవత్ కథామృతరసాస్వాదన చేయుటలో కుశలురైన శౌనకముని నైమిశారణ్యక్షేత్రంలో మహామతి సూతునకు నమస్కరించి యిలా అడిగారు.

**శౌనక ఉవాచ : శౌనకుడు చెప్పెను**

అజ్ఞానధ్వాన్తవిధ్వంసకోటిసూర్యసమప్రభ ।

సూతాఖ్యాహి కథాసారం మమ కర్ణరసాయనమ్ ॥ (శ్లో॥ 4)

భావము : హే సూతమహాశయా! నీయొక్క జ్ఞానము అజ్ఞానాంధకారమును నశింపజేయు కోటిసూర్యులకు సమానము. మీరు మా చెవులకు అమృతోపమయమైన సారగర్భితమైన కథను వినిపించండి.

భక్తిజ్ఞానవిరాగాప్తో వివేకో వర్ధతే మహాన్ ।

మాయామోహనిరాసశ్చ వైష్ణవైః క్రియతే కథమ్ ॥ (శ్లో॥ 5)

భావము : భక్తి జ్ఞాన వైరాగ్యాలు పొందినప్పుడు వచ్చే మహావివేకంయొక్క వృద్ధి యెలా జరుగుతుంది? మఱియు వైష్ణవులు మాయామోహం నుండి ఏవిధంగా బయటపడతారు?

ఇహ ఘోరే కలౌ ప్రాయో జీవశ్చాసురతాం గతః ।

క్లేశాక్రాన్తస్య తస్యైవ శోధనే కిం పరాయణమ్ ॥ (శ్లో॥ 6)

భావము : ఈ ఘోరకలియుగంలో జీవులు అసురీ స్వభావం కలవారు. వివిధ క్లేశాలతో ఆక్రాంతులైన ఆ జీవులను పరిశుద్ధులనుచేయడానికి సర్వశ్రేష్ఠ వుపాయం ఏది?

శ్రేయసాం యద్భవేచ్ఛ్రేయః పావనానాం చ పావనమ్ ।

కృష్ణప్రాప్తికరం శశ్వత్సాధనం తద్వదాధునా ॥ (శ్లో॥ 7)

భావము : సూతమహాశయా! అన్నింటికంటే కళ్యాణకరమైనది, పవిత్రము చేయువాటన్నింటిలోకి పవిత్రమైనది, శ్రీకృష్ణప్రాప్తి యిచ్చేట్టి శాశ్వత సాధన నీనాడు మీరు మాకు చెప్పండి.

చిన్తామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసమ్పదామ్ ।

ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుణ్ఠమ్ యోగిదుర్లభమ్ ॥ (శ్లో॥ 8)

భావము : చింతామణి కేవలం లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము అధికాధికమైన స్వర్గీయ సంపత్తుల నిస్తుంది. కానీ గురుదేవులు ప్రసన్నులైతే యోగులకుకూడ దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం యిస్తారు.

**సూత ఉవాచ : సూతుడు ఇలా అన్నాడు**

ప్రీతిః శౌనక చిత్తేతే హ్యతో వచ్మి విచార్యచ ।

సర్వసిద్ధాన్తనిష్పన్నం సంసారభయనాశనమ్ ॥ (శ్లో॥ 9)

భావము ః హే శౌనకా! నీ హృదయంలో భగవానునిమీద ప్రేమ వున్నది. అందువల్ల నేను బాగుగా ఆలోచించి, సంసార భయనాశనకారము, సర్వసిద్ధాంత నిష్పన్నము, నిష్కర్షము లేక సమస్త సిద్ధాంతసారమైన దానిని నీకు చెప్పుచున్నాను.

భక్త్యోఘవర్ధనం యచ్చ కృష్ణసన్తోషహేతుకమ్ ।

తదహం తేఽభిధాస్యామి సావధానతయా శృణు ॥ (శ్లో॥ 10)

భావము ః భక్తిప్రవాహమును పెంచేది, భగవాన్ శ్రీకృష్ణునికి సంతోషమును యిచ్చేది అయిన సాధనాన్ని నేను నీకు వినిపిస్తున్నాను, సావధానంగా వినుము.

కాలవ్యాలముఖగ్రాసత్రాసనిర్ణాశహేతవే ।

శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌ కీరేణ భాషితమ్ ॥ (శ్లో॥ 11)

భావము ః కాలసర్పముఖగ్రాసులైన కలియుగంలోని జీవుల కష్టాల నాశనంకొఱకు శ్రీమద్భాగవతశాస్త్రమును శుకుడు తెల్పినాడు.

ఏతస్మాదపరం కిఞ్చిన్మనః శుద్ధ్యై న విద్యతే ।

జన్మాన్తరే భవేత్పుణ్యం తదా భాగవతం లభేత్ ॥ (శ్లో॥ 12)

భావము ః మనశుద్ధికొఱకు యింతకంటే గొప్ప సాధన లేదు. అనేక జన్మపరంపరల పుణ్యోదయంవల్లనే భాగవతశాస్త్రం లభిస్తుంది.

పరీక్షితే కథాం వక్తుం సభాయాం సంస్థితే శుకే ।

సుధాకుమ్భం గృహీత్వైవ దేవాస్తత్ర సమాగమన్ ॥ (శ్లో॥ 13)

భావము ః రాజా! శ్రీశుకుడు- పరీక్షిత్తునకు యీ కథ తెల్పటానికి సభలో ఆసీనులై వున్నప్పుడు దేవతాగణములు అమృతభాండాన్ని తీసుకుని ఆయన దగ్గఱకు వచ్చారు.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।

ప్రకృతిం స్వామధిష్ఠాయ సమ్భవామ్యాత్మమాయయా ॥ (గీ॥ అ॥ 4, శ్లో॥ 6)

భావము ః నేను పుట్టుకలేనివాడను, నాశరహిత స్వరూపము కలవాడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను అయినప్పటికీ స్వకీయమగు ప్రకృతిని వశపఱచుకుని నా మాయాశక్తిచే పుట్టుచున్నాను.

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥ (గీ॥ అ॥ 9, శ్లో॥ 22)

భావము ః ఎవరు యితఱ భావములు లేనివారై నన్నుగూర్చి చింతించుచు యెడతెరపి ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నాయందే నిష్ఠకల్గియుండు అట్టివారియొక్క యోగక్షేమములను నేను వహించుచున్నాను.

సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।

అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ (గీ॥ అ॥ 18, శ్లో॥ 66)

భావము : సమస్త ధర్మములను విడిచిపెట్టి నన్నొక్కనిమాత్రము శరణుబొందుము. సమస్త పాపములనుండియు నిన్ను విముక్తునిగ జేసెదను.

శుకం నత్వావదన్ సర్వే స్వకార్యకుశలాః సురాః।

కథాసుధాం ప్రయచ్ఛస్వ గృహీత్వైవసుధామిమ్ ॥ (శ్లో॥ 14)

భావము : దేవతలు తమ కార్యములను చేయుటలో బహుకుశలురు. అందువల్ల యిక్కడ కూడ శుకదేవులకు నమస్కరించి యిలా అన్నారు. 'తమరు యీ అమృతమును తీసుకుని బదులుగా కథామృతాన్ని దానము చేయండి'.

ఏవం వినిమయేతే జాతే సుధారాజ్ఞా ప్రపీయతాం।

ప్రపాస్యామో వయం సర్వే శ్రీమద్భాగతామృతం ॥ (శ్లో॥ 15)

భావము : ఈవిధంగా వినిమయమైతే పరీక్షిన్మహారాజు అమృతాన్ని త్రాగుతారు. మేము (దేవతలం)శ్రమతో భాగవతరూపమైన అమృతాన్ని త్రాగుతాము.

క్వ సుధా క్వకథా లోకే క్వ కాచః క్వ మణిర్మహాన్।

బ్రహ్మరాతో విచార్యైవం తదా దేవాఞ్జహాస హ ॥ (శ్లో॥ 16)

భావము : ఈ ప్రపంచంలో గాజుముక్క యెక్కడ? బహుమూల్యమైన మణి యెక్కడ? అని ఆలోచించి శుకమహర్షి ' అమృతమెక్కడ? శ్రీమద్భాగవతమెక్కడ?' అని దేవతలని పరిహసించాడు.

అభక్తాంస్తాంశ్చ విజ్ఞాయ న దదౌ స కథామృతమ్।

శ్రీమద్భాగవతీ వార్తా సురాణామపి దుర్లభా ॥ (శ్లో॥ 17)

భావము : అంతేకాక శ్రీశుకమహర్షి దేవతలు భక్తిశూన్యులని తలచి శ్రీమద్భాగవత కథామృతాన్ని శ్రవణ దానమియ్యలేదు. భాగవత కథాశ్రవణం దేవతలకికూడ దుర్లభమే.

రాజ్ఞో మోక్షం తథా వీక్ష్య పురా ధాతాపి విస్మితః।

సత్యలోకే తులాం బద్ధ్వాతోలయత్సాధనన్యజః ॥ (శ్లో॥ 18)

భావము : పూర్వకాలంలో శ్రీమద్భాగవత శ్రవణం వల్ల పరీక్షిన్మహారాజుకు వచ్చిన ముక్తిని చూసి బ్రహ్మకూడ ఆశ్చర్యపడెను. ఆయన సత్యలోకమున ఒక తులాదండమును కట్టి భాగవతమును, మిగతా అన్ని సాధనలతో తూచాడు.

లఘూన్యన్యాని జాతాని గౌరవేణ ఇదం మహత్।

తదా ఋషిగణాః సర్వే విస్మయం పరమం యయుః ॥ (శ్లో॥ 19)

భావము : మిగతా అన్ని సాధనలు శ్రీమద్భాగవతంతో పోలిస్తే బరువులో తేలికని తెలుసుకున్నాడు. తన మాహాత్మ్యంవల్ల భాగవతం అన్నింటికంటే బరువైనదని తెలిసి ఋషు లందఱూ ఆశ్చర్యచకితులయ్యారు.

మేనిరే భగవద్రూపం శాస్త్రం భాగవతం కలౌ।

పఠనాచ్ఛ్రవణాత్సద్యో వైకుణ్ఠఫలదాయకమ్ ॥ (శ్లో॥ 20)

భావము : భగవత్స్వరూపమైన శాస్త్రమును కలియుగంలో చదివినా, విన్నా తక్షణమే మోక్షం లభిస్తుందని ఋషులందఱూ నిర్ణయించారు.

సప్తాహేన శృతం చైతత్సర్వథా ముక్తిదాయకమ్ ।

సనకాద్యైః పురా ప్రోక్తం నారదాయ దయాపరైః ॥ (శ్లో॥ 21)

భావము : సప్తాహవిధి ద్వారా శ్రవణం చేస్తే యిది నిశ్చయంగా భక్తిని ప్రసాదిస్తుంది. పూర్వకాలంలో దయామయులైన సనకాదులు దేవర్షినారదుడికి దీనిని వినిపించిరి.

యద్యపి బ్రహ్మసమ్బన్ధాచ్ఛ్రుతమేతత్సురర్షిణా ।

సప్తాహశ్రవణవిధిః కుమారైస్తస్య భాషితః ॥ (శ్లో॥ 22)

భావము : బ్రహ్మయొక్క ముఖకమలంనుండి దేవర్షినారదుడు దీనిని ముందుగా విన్నప్పటికి సప్తాహశ్రవణ విధివిధానమును మహర్షికి సనకాదులే తెల్పినారు.

**శౌనక ఉవాచ : శౌనకుడు అడిగాడు**

లోకవిగ్రహముక్తస్య నారదస్యాస్థిరస్య చ ।

విధిశ్రవే కుతః ప్రీతిః సంయోగః కుత్ర తైః సహ ॥ (శ్లో॥ 23)

భావము : సాంసారిక ప్రపంచంలో ముక్తులుగాను, నిరంతరము తిరుగుతూవుండే నారదమునికి సనకాదులతో యెక్కడ సంయోగము లభించింది. అంతేకాక విధివిధాన శ్రవణంకొఱకు ఆయనకు కోరిక యెందుకు కల్గినది?

**సూత ఉవాచ : సూతుడు అన్నాడు**

అత్ర తే కీర్తయిష్యామి భక్తియుక్తం కథానకమ్ ।

శుకేన మమ యత్ప్రోక్తం రహః శిష్యం విచార్య చ ॥ (శ్లో॥ 24)

భావము : సూతుడు చెప్పెను 'ఇప్పుడు నేను నీకు శ్రీశుకమహర్షి నన్ను తన అనన్య శిష్యుడిగా యెంచి యేకాంతంలో చెప్పిన ఆ భక్తిపూర్వకమైన కథానకమును వినిపించెదను'.

ఏకదా హి విశాలాయాం చత్వార ఋషయోఽమలాః ।

సత్సఙ్గార్థం సమాయాతా దదృశుస్తత్ర నారదమ్ ॥ (శ్లో॥ 25)

భావము : ఒకరోజు నిర్మలులైన ఆ నల్గురు ఋషులు సత్సంగంకొఱకు విశాలపురికి వచ్చిరి. అక్కడ వారు నారదుని చూసిరి.

**కుమారా ఊచుః : కుమారులు ఇలా అన్నారు.**

కథం బ్రహ్మన్దీనముఖః కుతశ్చిన్తాతురో భవాన్ ।

త్వరితం గమ్యతే కుత్ర కుతశ్చాగమనం తవ ॥ (శ్లో॥ 26)

భావము : సనకాదులు అడిగిరి. హేబ్రహ్మన్! నీ ముఖకమలం యెందుకు నీరసంగా వున్నది? మీరు యెందుకు చింతాతురులై వున్నారు. ఇంత తొందరగా యెక్కడికి వెడుతున్నారు? మఱియు మీరు యెక్కడినుండి వచ్చుచున్నారు? అని వివరము లడిగారు.

ఇదానీం శూన్యచిత్తోఽసి గతవిత్తో యథా జనః ।

తవేదం ముక్తసఙ్గస్య నోచితం వద కారణమ్ ॥ (శ్లో॥ 27)

భావము : ఇప్పుడు తమరు యావత్ ధనమును పోగొట్టుకున్న పురుషుని వలె వ్యాకులచిత్తులై కన్పించుచున్నారు. మీలాంటి ఆసక్తిరహిత పరుషులకిది వుచితంగాదు. దీనికి కారణము చెప్పండి.

**నారద ఉవాచ : నారదుడు చెప్పచున్నాడు**

అహం తు పృథివీం యాతో జ్ఞాత్వా సర్వోత్తమామితి ।

పుష్కరంచ ప్రయాగం చ కాశీం గోదావరీం తథా ॥ (శ్లో॥ 28)

భావము : నేను పృథ్వి సర్వోత్తమ లోక మని తెల్సి చూడటానికి వచ్చాను. ఇక్కడ పుష్కరం, ప్రయాగం, కాశీ, గోదావరి మఱియు

హరిక్షేత్రం కురుక్షేత్రం శ్రీరఙ్గం సేతుబన్ధనమ్ ।

ఏవమాదిషు తీర్థేషు భ్రమమాణ ఇతస్తతః ॥ (శ్లో॥ 29)

భావము : హరిద్వారం, కురుక్షేత్రం, శ్రీరంగం, సేతుబంధనం మొదలైన తీర్థాలలో తిరుగుతుంటిని.

నాపశ్యం కుత్రచిచ్ఛర్మ మనః సంతోషకారకమ్ ।

కలినాధర్మమిత్రేణ ధరేయం బాధితాధునాః ॥ (శ్లో॥ 30)

భావము : కానీ నాకు యెక్కడా మనస్సుకు సంతోషం యిచ్చే శాంతి లభ్యంకాలేదు. ఇప్పుడు అధర్మసహాయుడైన కలియుగం సమస్త పృథ్విని పీడించుచున్నాడు.

సత్యం నాస్తి తపః శౌచం దయా దానం న విద్యతే ।

ఉదరమ్భరిణో జీవా వరాకాః కూటభాషిణః ॥ (శ్లో॥ 31)

భావము : ఇప్పుడిక్కడ సత్యం లేదు, తపస్సు లేదు, దయ లేదు, దానం లేదు, జీవులందఱూ కడుపు నింపుకోవడానికే జీవిస్తున్నారు.

మన్దాః సుమన్దమతయో మన్దభాగ్యా హ్యుపద్రుతాః ।

పాఖణ్డనిరతాః సన్తో విరక్తాః సపరిగ్రహాః ॥ (శ్లో॥ 32)

భావము : వీరందరూ మందబుద్ధులూ, బద్ధకస్తులు, అసత్యభాషణులు, భాగ్యహీనులు ఉపద్రవగ్రస్తులైపోయారు. చూడటానికి సాధువు లైనవారు పాఖండులైపోయారు. విరక్తు లందఱు స్త్రీ, ధనము మొదలగునవన్నీ పరిగ్రహించడము మొదలెట్టారు.

తరుణీప్రభుతా గేహే శ్యాలకో బుద్ధిదాయకః ।

కన్యావిక్రయిణో లోభాద్దమ్పతీనాం చ కల్కనమ్ ॥ (శ్లో॥ 33)

భావము : ఇండ్లలో స్త్రీల రాజ్యం, సలహానిచ్చేది బావమఱుదులు, లోభంతో ప్రజలు కన్యను విక్రయిస్తున్నారు, దంపతుల్లో కలహాలు యీ భూమిమీదున్నాయి.

ఆశ్రమా యవనై రుద్ధాస్తీర్థాని సరితస్తథా।

దేవతాయతనాన్యత్ర దుష్టైర్నష్టాని భూరిశః ॥ (శ్లో॥ 34)

భావము : మహాత్ముల ఆశ్రమాలు, నదులు, తీర్థస్థలాలు యవనుల అధికారమైపోయాయి. ఆ దుష్టులు చాలా దేవాలయములను నష్టపఱిచెను.

న యోగీ నైవ సిద్ధో వా న జ్ఞానీ సత్క్రియో నరః।

కలిదావానలేనాద్య సాధనం భస్మతాం గతమ్ ॥ (శ్లో॥ 35)

భావము : ఈనాడిక్కడ యోగులు లేరు. సిద్ధులు లేరు. తపస్సు చేసేవారు లేరు. సత్కర్మలు చేసేవారు లేరు. కలిరూప మైన దావానలంలో కాలి భస్మమైపోయాయి.

అట్టశూలా జనపదాః శివశూలా ద్విజాయతః।

కామిన్యః కేశశూలిన్యః సమ్భవన్తి కలావిహ ॥ (శ్లో॥ 36)

భావము : ఈ కలియుగంలో దేశవాసు లందఱు బజారులో అన్నము అమ్ముకుంటున్నారు. బ్రాహ్మణులు డబ్బు తీసుకుని చదువుచెబుతున్నారు. స్త్రీలు వేశ్యావృత్తిలో జీవనం సాగిస్తున్నారు.

ఏవంపశ్యన్ కలేర్దోషాన్ పర్యటన్నవనీమహమ్।

యామునం తటమాపన్నో యత్ర లీలా హరేరభూత్ ॥ (శ్లో॥ 37)

భావము : ఈవిధంగా పృథ్వీమీద సంచరిస్తూ కలియుగదోషాలను చూస్తూ ; ఎక్కడైతే భగవంతుడైన శ్రీకృష్ణునియొక్క అనేక లీలలు సంఘటిల్లాయ్యో ఆ యమునానది దగ్గఱకు వచ్చాను.

తత్రాశ్చర్యం మయా దృష్టం శ్రూయతాం తన్మునీశ్వరాః।

ఏకా తు తరుణీ తత్ర నిషణ్ణా ఖిన్నమానసా ॥ (శ్లో॥ 38)

భావము : మునివర్యులారా! అక్కడ నేను పెద్ద ఆశ్చర్యకరమైన విషయాన్ని చూచితిని. ఒక యువతి ఖిన్నమనస్సురాలై అక్కడ కూర్చుని వున్నది.

వృద్ధౌ ద్వౌ పతితౌ పార్శ్వే నిఃశ్వసన్తావచేతనౌ।

శుశ్రూషన్తీ ప్రబోధన్తీ రుదతీ చ తయోః పురః ॥ (శ్లో॥ 39)

భావము : అక్కడ దగ్గిరలో యిద్దఱు పురుషులు అచేతనావస్థలో దీర్ఘశ్వాస తీసుకుంటూ పడియున్నారు. ఈ తరుణి వారికి సేవచేస్తోంది. ఒకసారి వారికి చేతనత్వం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నది. ఒక్కొక్కసారి వారిముందు యేడుస్తున్నది.

దశదిక్షు నిరీక్షన్తీ రక్షితారం నిజం వపుః।

వీజ్యమానా శతస్త్రీభిర్బోధ్యమానా ముహుర్ముహుః ॥ (శ్లో॥ 40)

భావము : ఆమె తన శరీరాన్ని రక్షించే పరమాత్మను దశదిశలలో చూస్తున్నది. ఆమె నలువైపులా వందలాది స్త్రీలు విసనకఱ్ఱలతో విసురుతూ ఆమెను పదేపదే సముదాయిస్తున్నారు.

దృష్ట్వా దురాద్గతః సోఽహం కౌతుకేన తదన్తికమ్ ।

మాం దృష్ట్వా చోత్థితా బాలా విహ్వలా చాబ్రవీద్వచః ॥ (శ్లో॥ 41)

భావము : దూరంనుండి యిదంతా చూస్తున్న నేను కుతూహలంతో దగ్గఱకు వెళ్ళాను. నన్ను చూసి ఆ యువతి లేచి నిలబడి యెంతో విహ్వలంగా యిలా చెప్పింది.

**బాల ఉవాచ : బాల చెప్పెను**

భో భోః సాధో క్షణం తిష్ఠ మచ్చిన్తామపి నాశయః ।

దర్శనం తవ లోకస్య సర్వథాఘహరం పరమ్ ॥ (శ్లో॥ 42)

భావము : మహాత్మా! తమరు ఒక్కక్షణం ఇక్కడ నిలచి నా చింతులను దూరం చేయండి. మీయొక్క దర్శనభాగ్యం సంసారంలో గల అన్ని పాపాలను యెల్లవేళలా నశింపజేయగలదు.

బహుధా తవ వాక్యేన దుఃఖశాన్తిర్భవిష్యతి ।

యదా భాగ్యం భవేద్భూరి భవతో దర్శనం తదా ॥ (శ్లో॥ 43)

భావము : మీ వచనములు నా దుఃఖమును చాలావఱకు శాంతింపజేస్తాయి. మనుష్యుని భాగ్యోదయం జరిగినప్పుడు మాత్రమే మీలాంటి పుణ్యాత్ముల దర్శనం లభిస్తుంది.

**నారద ఉవాచ : నారదుడు చెప్పచున్నాడు**

కాసి త్వం కావిమౌ చెమా నార్యః కాః పద్మలోచనాః ।

వద దేవి సవిస్తారం స్వస్య దుఃఖస్య కారణమ్ ॥ (శ్లో॥ 44)

భావము : అప్పుడు నేను ఆ స్త్రీని అడిగితిని. దేవీ! నీ వెవరివి? ఆ యిద్దఱి పురుషులకు, నీకు సంబంధము మధ్య గల సంబంధ యేమిటి? నీ దగ్గఱున్న యీ కమలనయనములు గల స్త్రీ లెవరు? నీవు నీ దుఃఖమునకు గల కారణమును వివరంగా చెప్పుము.

**బాల ఉవాచ : బాల చెప్పెను.**

అహం భక్తిరితి ఖ్యాతా ఇమౌ మే తనయౌ మితౌ ।

జ్ఞానవైరాగ్యనామానౌ కాలయోగేన జర్జరౌ ॥ (శ్లో॥ 45)

భావము : యువతి అన్నది. 'నా నామము భక్తి జ్ఞానవైరాగ్యము లనే పేరు గల వీరిరువురు నా పుత్రులు. సమయానికిఁముందే వీరిద్దఱు జర్జరులైనారు.

గఙ్గాద్యాః సరితశ్చేమా మత్సేవార్థం సమాగతాః ।

తథాపి న చ మే శ్రేయః సేవితాయాః సురైరపి ॥ (శ్లో॥ 46)

భావము : ఈ దేవతలు గంగాది. నదులు వీరందరూ నా సేవకొఱకే వచ్చినారు. ఈవిధంగా యిలా సాక్షాత్తు దేవతలతో నేను సేవింపబడుతున్నప్పటికి నాకు యేవిధమైన శాంతి లేదు.

ఇదానీం శ్రుణు మద్వార్తాం సచిత్తస్త్వం తపోధన ।

వార్తామే వితతాప్యస్తి తాం శ్రుత్వా సుఖమావహ ॥ (శ్లో॥ 47)

భావము ః ఓ తపోధనా! సావధానచిత్తులై తమరు నా వృత్తాంతమును వినుడు. నా కథ చాలా ప్రసిద్ధిచెందినదైనప్పటికి, దానిని మీరు విని నా బాధలను పోగొట్టి శాంతిని ప్రసాదించండి.

ఉత్పన్నా ద్రవిడే సాహం వృద్ధిం కర్ణాటకే గతా ।

క్వచిత్క్వచిన్మహారాష్ట్రే గుర్జరే జీర్ణతాం గతా ॥ (శ్లో॥ 48)

భావము ః నేను ద్రవిడదేశంలో పుట్టి, కర్ణాటకలో పెరిగి, మహారాష్ట్రలో అక్కడక్కడ సన్మానింపబడ్డాను. కానీ గుజరాత్‌లో నాకు ముసలితనము వచ్చింది.

తత్ర ఘోరకలేర్యోగాత్పాఖణ్డైః ఖణ్డితాఙ్గకా ।

దుర్బలాహం చిరం యాతా పుత్రాభ్యాం సహ మన్దతామ్ ॥ (శ్లో॥ 49)

భావము ః అక్కడ కలియుగ ప్రభావం వల్ల పాఖండు లందఱు నా అంగములను భంగం చేశారు. చాలాకాలంపాటు నేనిదే అవస్థలో వుండటంవల్ల నేనుకూడ నా పుత్రులతో పాటు దుర్బలనైతిని. నిస్తేజురాలనైతిని.

వృన్దావనం పునః ప్రాప్య నవీనేన సురూపిణీ ।

జాతాహం యువతీ సమ్యక్ప్రేష్ఠరూపా తు సామ్ప్రతమ్ ॥ (శ్లో॥ 50)

భావము ః ఇప్పుడు బృందావనా నికొచ్చిన దగ్గఱనుండి నేను మఱల పరమసుందరిని, సరూపవతిని, నవయువతిని అయ్యాను.

ఇమౌ తు శయితావత్ర సుతౌ మే క్లిశ్యతః శ్రమాత్ ।

ఇదం స్థానం పరిత్యజ్య విదేశం గమ్యతే మయా ॥ (శ్లో॥ 51)

భావము ః నాముందే అలసిపోయిన నా యిద్దఱు పుత్రులు దుఃఖితు లౌతున్నారు. అందుచేత నేనీ స్థానమును విడిచి వేఱొకచోటుకి వెళ్ళదలచాను.

జరఠత్వం సమాయాతౌ తేన దుఃఖేన దుఃఖితా ।

సాహం తు తరుణీ కస్మాత్సుతౌ వృద్ధావిమౌ కుతః ॥ (శ్లో॥ 52)

భావము ః వీరిరువురూ ముసలివారైపోయారు. నేను దీనికి యెంతో దుఃఖిస్తున్నాను. నేను యువతిగా, తరుణిగా వుండగానే యెందుచేత నా యిరువురు పుత్రులు ముసలివారయ్యారు?

త్రయాణాం సహచారిత్వాద్వైపరీత్యం కుతః స్థితమ్ ।

ఘటతే జరఠా మాతా తరుణౌ తనయావితి ॥ (శ్లో॥ 53)

భావము ః మేము ముగ్గురం ఎప్పుడూ కలిసివుండేవారము. అయినా ఈ వైపరిత్యమేమి? అసలేమి జరగవలె? సహజంగా తల్లిముసలిదై పుత్రులు తరుణవయస్కులుగా వుండవలె.

అతః శోచామి చాత్మానం విస్మయావిష్టమానసా ।

వదయోగనిధే ధీమన్కారణం చాత్ర కిం భవేత్ ॥ (శ్లో॥ 54)

భావము : దీనివల్లనే ఆశ్చర్యచకితమైన చిత్తంతో నాకు వచ్చిన యీ దురవస్థకు శోకిస్తున్నాను. మీరు పరమబుద్ధిమంతులు. యోగనిధులు. ఈ పరిస్థితికి కారణము యేమిటో దయచేసి తెలపండి.

**నారద ఉవాచ : నారదుడు చెప్పెను**

జ్ఞానేనాత్మని పశ్యామి సర్వమేతత్తవానఘే ।

న విషాదస్త్వయా కార్యో హరిః శం తే కరిష్యతి ॥ (శ్లో॥ 55)

భావము : సాధ్వీ! నా హృదయంలో జ్ఞానదృష్టితో నీకు వచ్చిన సంపూర్ణదుఃఖములకు కారణము చూస్తున్నాను. నువ్వు బాధపడకు. శ్రీహరి నీకు శుభమే చేస్తాడు.

**సూత ఉవాచ : సూతు డిలా చెప్పెను**

క్షణమాత్రేణ తజ్ఞాత్వా వాక్యమూచె మునీశ్వరః । (శ్లో॥ 56)

భావము : నారదముని ఒక్కక్షణం మౌనంగావుండి కారణము తెల్సుకుని ఆమెకు తెలిపెను.

**నారద ఉవాచ : నారదుడు పలికెను**

శృణుష్వావహితా బాలె యుగోఽయం దారుణః కలిః ।

తేన లుప్తః సదాచారో యోగమార్గస్తపాంసి చ ॥ (శ్లో॥ 57)

భావము : దేవీ! సావధానంగా వినుము. ఇది దారుణ కలియుగము. అందువలన ఈకాలంలో సదాచారము, యోగమార్గము, తపము లుప్తమైపోయినవి.

జనా అఘాసురాయన్తే శాఠ్యదుష్కర్మకారిణః ।

ఇహ సన్తో విషీదన్తి ప్రహృష్యన్తి హ్యసాధవః ॥

దత్తే ధైర్యం తు యో ధీమాన్ స ధీరః పణ్డితోఽథవా ॥ (శ్లో॥ 58)

భావము : మూర్ఖులు దుష్కర్మలు చేస్తూ మనుష్యులు అఘాసురు లౌతున్నారు. ప్రపంచంలో ఎక్కడ చూసినా సత్పురుషులు దుఃఖిస్తున్నారు. దుష్టులు సుఖంగా వున్నారు. ఈ సమయంలో ధైర్యం కోల్పోని బుద్ధిమంతుడే జ్ఞాని లేక పండితుడు.

అస్పృశ్యానవలోక్యేయం శేషభారకరీ ధరా ।

వర్షే వర్షే క్రమాజ్జాతా మఙ్గళమ్ నాపి దృశ్యతే ॥ ((శ్లో॥ 59)

భావము : పృథ్వి ప్రతిసంవత్సరము క్రమక్రమంగా ఆదిశేషునికి భారమౌతున్నది. ఇప్పుడిది ముట్టుకోవడానికేమిటి కనీసము చూడటానికి తగనిదిగా అయినది. ఎక్కడా శుభకరమైన వాతావరణము లేదు.

న త్వామపి సుతైః సాకం కోఽపి పశ్యతి సామ్ప్రతమ్ ।

ఉపేక్షితానురాగాన్ధైర్జర్జరత్వేన సంస్థితా ॥ (శ్లో॥ 60)

భావము : ఇప్పుడు నీకు నీ పుత్రులతోపాటు దర్శనము కావటంలేదు. విషయానురాగంవల్ల అంధులైన జీవులద్వారా వుపేక్షింపబడిన నీవు జర్జరమైపోయావు.

వృన్దావనస్య సంయోగాత్పునస్త్వం తరుణీ నవా ।

ధన్యం వృన్దావనం తేన భక్తిర్నృత్యతి యత్ర చ ॥ (శ్లో॥ 61)

భావము : బృందావనంయొక్క సంయోగంతో నీవు మళ్ళీ తరుణావస్థ పొందావు. ఇక్కడ భక్తి సర్వత్రా నృత్యము చేయుచున్నది. అందువల్ల ఈ బృందావనధామం ధన్యము.

అత్రేమౌ గ్రాహకాభావాన్న జరామపి ముఞ్చతః ।

కిఞ్చిదాత్మసుఖేనేహ ప్రసుప్తిర్మన్యతేఽనయోః ॥ (శ్లో॥ 62)

భావము : కానీ యిక్కడ నీ పుత్రులిరువురికీ గ్రాహకులు లేరు. అందువల్ల వారి ముసలితనము పోవడంలేదు. ఇక్కడ వారికి కొద్దిగా ఆత్మసుఖం ప్రాప్తించడం వల్ల వారు నిద్రపోయినట్లు కనిపిస్తున్నారు.

**భర్తి రువాచ : భక్తి అనెను**

కథం పరీక్షితా రాజ్ఞా స్థాపితో హ్యశుచిః కలిః ।

ప్రవృత్తే తు కలౌ సర్వసారః కుత్ర గతో మహాన్ ॥ (శ్లో॥ 63)

భావము : పరీక్షిన్మహారాజు యీ పాపపు కలియుగమును యెందుకు వుండనిచ్చెను? ఇది రాగానే అన్ని వస్తువుల సారం అణగారిపోయింది లేక యెక్కడికి పోయిందో తెలియడంలేదు.

కరుణాపరేణ హరిణాప్యధర్మః కథమీక్ష్యతే ।

ఇమం మే సంశయం చిన్ధి త్వద్వాచా సుఖితాస్మ్యహమ్ ॥ (శ్లో॥ 64)

భావము : మునీశ్వరా! కరుణామయుడైన శ్రీహరి ఈ అధర్మమును యెలా ఒప్పుకొనినాడు? నా యీ సందేహమును దూరము చేయుము. మీ వచనములతో నాకు శాంతి లభించినది.

**నారద ఉవాచ : నారదు డిలా అనెను**

యదిపృష్టస్త్వయా బాలే ప్రేమతః శ్రవణం కురు ।

సర్వం వక్ష్యామి తే భద్రే కశ్మలం తే గమిష్యతి ॥ (శ్లో॥ 65)

భావము : కళ్యాణీ! నీవడిగావుకనుక ప్రేమతో నీకు అన్నీ తెలిపెదను వినుము. నేను నీకు అన్ని విషయములను వివరించెదను. దానితో నీ దుఃఖము దూరమౌతుంది.

యదా ముకున్దో భగవాన్ క్ష్మాం త్యక్త్వా స్వపదం గతః ।

తద్దినాత్కలిరాయాతః సర్వసాధనబాధకః ॥ (శ్లో॥ 66)

భావము : ఏరోజు శ్రీకృష్ణభగవానుడు భూలోకం వదిలి తన పరంధామమునకు చేరెనో, ఆరోజునుంచే సంపూర్ణసాధనలకు అడ్డుతగిలే కలియుగం ప్రవేశించింది.

దృష్టో దిగ్విజయే రాజ్ఞా దీనవచ్ఛరణం గతః ।

న మయా మారణీయోఽయం సారఙ్గ ఇవ సారభుక్ ॥ (శ్లో॥ 67)

భావము : దిగ్విజయసమయంలో పరీక్షిన్మహారాజుయొక్క దృష్టిపడినప్పుడు కలియుగం దీనుడివలె ఆయనను శరణుజొచ్చెను. మధువును గ్రోలే భ్రమరంవంటి వాడైన పరీక్షిత్తు యీ కలిని నేను చంపకూడదని నిశ్చయించుకొనెను.

యత్ఫలం నాస్తి తపసా నయోగేన సమాధినా ।

తత్ఫలం లభతే సమ్యక్కలౌ కేశవకీర్తనాత్ ॥ (శ్లో॥ 68)

భావము : ఈ కలియుగంలో తపస్సు, యోగము, సమాధులవలన యే ఫలిత మైతే లభించదో; కలియుగంలో అది శ్రీహరి నామస్మరణ చేసినవారికి తప్పనిసరిగా లభిస్తుంది.

ఏకాకారం కలిం దృష్ట్వా సారవత్సారనీరసమ్ ।

విష్ణురాతః స్థాపితవాన్ కలిజానాం సుఖాయ చ ॥ (శ్లో॥ 69)

భావము : ఈవిధంగా సారహీనమైపోయినప్పటికీ కలియుగంలో జన్మించే జీవుల సుఖంకొఱకు కలిని వుండనిచ్చెను.

కుకర్మాచ్చరణాత్సారః సర్వతో నిర్గతోఽధునా ।

పదార్థాః సంస్థితా భూమౌ బీజహీనాస్తుషా యథా ॥ (శ్లో॥ 70)

భావము : ఈ సమయంలో ప్రజలు కుకర్మాచరణయందు ప్రవృత్తులైన కారణంగా సమస్త వస్తువుల సారము తొలగిపోయింది. భూమిమీది అన్ని పదార్థములు బీజంలేని ఊకతో సమానమయ్యాయి.

విప్రైర్భాగవతీ వార్తా గేహే గేహే జనే జనే ।

కారితా కణలోభేన కథాసారస్తతో గతః ॥ (శ్లో॥ 71)

భావము : బ్రాహ్మణులు కేవలం అన్నధనులై లోభవశమున ఇంటింటికి వెళ్ళి జనులందఱకు భాగవతం చెప్పడము మొదలిడిరి. అందువల్లనే కథయొక్క సారము పోయినది.

అత్యుగ్రభూరికర్మాణో నాస్తికా రౌరవా జనాః ।

తేఽపి తిష్ఠన్తి తీర్థేషు తీర్థసారస్తతో గతః ॥ (శ్లో॥ 72)

భావము : తీర్థములలో అన్నివిధములైన ఘోరకర్మలూ చేసేవారు, నాస్తికులు, నపుంసకులు వుండటము మొదలిడిరి. అందువల్ల తీర్థముల ప్రభావంకూడ మెల్లగా పోతున్నది.

కామక్రోధమహాలోభతృష్ణావ్యాకులచేతసః ।

తేఽపి తిష్ఠన్తి తపసీ తపఃసారస్తతో గతః ॥ (శ్లో॥ 73)

భావము : ఎవరి చిత్తమైతే కామక్రోధమదలోభతృష్ణలతో కొట్టుకుంటోందో వారుకూడ తపస్సు అనే నటన చేయుచున్నారు. దానితో తపస్సుయొక్క సారంకూడ పోయినది.

మనసశ్చాజయల్లోభాద్దమ్భాత్పాఖణ్డసంశ్రయాత్ ।

శాస్త్రానభ్యసనాచ్చైవ ధ్యానయోగఫలం గతమ్ ॥ (శ్లో॥ 74)

భావము : మనస్సుపై నిగ్రహం లేకుండా లోభ-దంభ-పాఖండములను ఆశ్రయించుట వలన మఱియు శాస్త్రములను అభ్యసింపకపోవడంవలన ధ్యానయోగ ఫలంకూడ నశించినది.

పణ్డితాస్తు కళత్రేణ రమన్తే మహిషా ఇవ ।

పుత్రస్యోత్పాదనే దక్షా అదక్షా ముక్తిసాధనే ॥ (శ్లో॥ 75)

భావము : పండితులు గేదెలవలె వారి స్త్రీలతో రమిస్తున్నారు. వారిలో సంతానం కలిగించే కుశలత్వం తప్ప ముక్తి సాధనలో కుశలత లేదు.

న హి వైష్ణవతా కుత్ర సమ్ప్రదాయపురఃసరా ।

ఏవం ప్రళయతాం ప్రాప్తో వస్తుసారః స్థలే స్థలే ॥ (శ్లో॥ 76)

భావము : సంప్రదాయానుసారం ప్రాప్తించిన వైష్ణవత్వం మచ్చుకైనా యెక్కడా లేదు. ఈవిధంగా అన్నిచోట్లా అన్ని వస్తువులు సారము కోల్పోయినవి.

అయం తు యుగధర్మో హి వర్తతే కస్య దూషణమ్ ।

అతస్తు పుణ్డరీకాక్షః సహతె నికటే స్థితః ॥ (శ్లో॥ 77)

భావము : ఇది యీ కలియుగంయొక్క స్వభావము. దీనిలో యెవటి దోషమూ లేదు. అందువల్ల భగవంతుడు పుండరీకాక్షుడు అతి సమీపంలో వుంటూకూడ దీనిని సహిస్తున్నాడు.

**సూత ఉవాచ : సూతు డిలా అన్నాడు**

ఇతి తద్వచనం శ్రుత్వా విస్మయం పరమం గతాః ।

భక్తిరూచే వచో భూయః శ్రూయతాం తచ్చ శౌనక ॥ (శ్లో॥ 78)

భావము : శౌనకా! ఈవిధంగా చెప్పిన నారదుని వచనాలను విన్న భక్తి చాలా చకితురాలైంది. ఇంకా నారదమహర్షి ఆమెకు యేమి చెప్పాడో వినండి.

**భక్తి రువాచ : భక్తి అన్నాది**

సురర్షే త్వం హి ధన్యోఽసి మద్భాగ్యేన సమాగతః ।

సాధూనాం దర్శనం లోకే సర్వసిద్ధికరం పరమ్ ॥ (శ్లో॥ 79)

భావము : దేవర్షీ! తమరు ధన్యులు. నా సౌభాగ్యవశాన మిమ్ములను కలిశాను. సంసారజీవులకు సాధు దర్శనమే సమస్త సిద్ధులకు కారణము.

జయతి జయతి మాయాం యస్య కాయాధవస్తే వచనరచనమేకం కేవలం చాకలయ్య ।

ధ్రువపదమపి యాతో యత్కృపాతో ధ్రువోఽయం సకలకుశలపాత్రం బ్రహ్మపుత్రం నతాస్మి ॥ (శ్లో॥ 80)

భావము : కేవలం మీరు ఒకసారి వుపదేశించినది ధారణ చేసిన ప్రహ్లాదుడు మాయమీద విజయము సాధించాడు. ధృవుడుకూడ మీయొక్క కృపతోనే ధృవత్వము పొందాడు. మీరు మంగళరూపులు. మఱియు సాక్షాత్తు బ్రహ్మయొక్క పుత్రులు. నేను మీకు నమస్కరిస్తున్నాను.

**ఇది పద్మపురాణ ఉత్తరార్థములో శ్రీమద్భాగవతమహత్యంలో భక్తి - నారద సమాగయోగము అనే ప్రథమోఽధ్యాయము.**

# చేతనత్వంయొక్క స్థాయిలు

అవతారపురుషుడైన శ్రీకృష్ణభగవానుని చరిత్ర గురుచరిత్ర. అంటే అది ఒక వ్యక్తియొక్క చరిత్ర కాదు. గురువుల చరిత్ర అని అనుకోవచ్చు. అంటే అంధకారాన్ని పోగొట్టే చరిత్ర. గురుచరిత్ర చదివితే మనలోని అంధకారము అంతరించిపోతుంది. కనుక యే గురువుయొక్క చరిత్ర చదువుతున్నా యీ విషయము గమనంలో వుండాలి. అంటే అది ఒక భౌతికశరీరధారియైన వ్యక్తియొక చరిత్ర అని అనుకోకుండా మనలో జ్ఞానజ్యోతులని వెలిగించే చరిత్రగా అర్థము చేసుకోవాలి. అలాంటి చేతనత్వము యే స్థాయిలో వుంటుంది? అజోపి.............

గురుచరిత్ర చదువుతుంటే యీ స్థాయి వ్యక్తులయొక్క చదువుతున్నాము అని అర్థము చేసుకోవాలి. అజో0పిసన్ -అనే మాటకు అర్థము - పుట్టుకలేనివాడు అని. భౌతికశరీరధారిగ జన్మించిన వ్యక్తి యీ స్థితికి యెలా చేరుకుంటాడో భాగవతంలోని 12 స్కంధములు స్పష్టీకరిస్తాయి. భగవద్గీత నుపదేశించిన శ్రీకృష్ణుడో, రాముడో, ఋషులో మాత్రమే పుట్టుకలేనివారుకాదు. మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తి పుట్టుకలేనివాడే. సరే శ్రీకృష్ణుడు పుట్టుకలేనివాడు అని తెలుసుకున్నాము. మఱి ఆయన దేవకీవసుదేవులకు జన్మించాడు. అలా జన్మించిన భగవంతునికి తాను పుట్టుకలేనివాడు అని తెలియడము విశేషము కాదు. మనకు ఆ విషయము తెలియదు. ఎందుకు తెలియదు? అనే ప్రశ్న వేసుకుంటే దీనికి జవాబును ఒక వుదాహరణ ద్వారా అర్థము చేసుకుందాము. ఒక వ్యక్తికి వక్కపొడి తినే అలవాటుంది. అతను ఆ అలవాటును మానగలడా? సాధారణంగా మానలేడు. కానీ మానడము పెద్ద కష్టమేమి కాదు. కదా! వక్కపొడి వేసుకోవడం అనే దురలవాటు యెలా మానుకోలేకపోతున్నామో, అలాగే చనిపోవడము అనే అలవాటునుకూడ మనం మానలేకపోతున్నాము. దానితో మరణిస్తున్నాము. నాకు మరణము లేదు, పుట్టుక లేదు అని తెల్సిన మరుక్షణమే మనంకూడ శ్రీకృష్ణునిలాగ అమరులమే! గోకులంలోని గోపగోపికలకు యీ విషయము అర్థమైంది. రాసలీల యీ విషయమును ధృవీకరిస్తుంది. గోపికకు-గోపికకు మధ్య శ్రీకృష్ణుడు; కృష్ణుడికి-కృష్ణుడికి మధ్య గోపిక. ంతమంది భౌతికంగా వుండటము చమత్కారమేకదా? ఇది ఎలా సాధ్యము అంటే వారికి తాము పుట్టుక లేనివారము అనే విషయము అనుభూతిలోకి వచ్చిందిగనుక. అందరిలోను భగవంతుడైన శ్రీకృష్ణుని దర్శించే స్థాయికి యెదిగారు వ్రజవాసులు. ఆ స్థితికి యెదిగారుగనుకే వారికి శ్రీకృష్ణుడికి భేదము లేదు. మనంకూడ యీ అనుభూతిని పొందవచ్చు. అయితే అనుభూతి లేకుండా యెన్నిసార్లు యీ శ్లోకమును వల్లించినా అది నిష్ప్రయోజనమే. ' నేను ఆత్మని ' అని నోటితో అంటున్నాముతప్ప, ఆచరణలో దాన్ని సాధించలేకపోతున్నాము.

అవ్యయాత్మా- వ్యయము లేనటువంటి ఆత్మ. అంటే నాశరహితుడు. ఆ స్థితిలో వున్న చేతనత్వమునకు కోరికలు వుండవు. ఈ వ్యక్తి దగ్గఱ్నుండి యేదైనా పోతేనేకదా కావాలి అనే కోరిక వుద్భవిస్తుంది? ఈ ప్రపంచమంతా అతనిదే అయినప్పుడు, ఆ ప్రపంచము నాశనము లేనిదయినప్పుడు యింక కోరుకునేదేముంది?

భూతానామీశ్వరోఽపిసన్ - పంచభూతములకు ఇలాంటివారు అధిపతులు. ఈశ్వరుడు అంటే అధిపతి. స్వామి. తను చెప్పిన మాట అందరూ విని తీరాల్సిందే అనే వున్నత స్థితిలో వున్న చేతనత్వము. ఈ స్థితికి మనుష్యులందఱూ ఎదుగవచ్చు. ఎదగటానికే గురుచరిత్రలను పారాయణ చేయమనేది. వారు యెలా ఆ స్థితికి వెళ్ళారో ఆ చరిత్రల్లో చెబుతారు.

ప్రకృతిం స్వామధిష్ఠాయ - ఎప్పుడైతే పంచభూతములకు ఈశ్వరుడు అన్నామో ప్రకృతి మొత్తము ఆతని అధీనంలో వుంటుంది అని అర్థము. గురువులకు ప్రకృతి వశములో వుంటుంది.

సంభవామి ఆత్మమాయయా - అలాంటి వ్యక్తి ఆత్మయొక్క మాయావరణశక్తితో అవతరిస్తాడు. అలా అవతరించిన వున్నత చేతనత్వములకు తాము అవినాశీ ఆత్మయని, ప్రకృతి తన అధీనంలో వుంటుంది అని గుర్తుంటుంది. కానీ సామాన్యులకు యీ అనుభూతి వుండదు. గురువులు యెన్నిసార్లు యీ విషయమును చెప్పిన సామాన్యులకు యీ అనుభూతి ఎండమావిగానే వుంటుందితప్ప అనుభూతిలోకి రావడం లేదు.

ఇక్కడ స్వామి వివేకానంద చెప్పిన ఒక విషయమును గుర్తుచేసుకుంటే బావుంటుంది. 'మీకు ఉపనిషత్తులు అర్థము కావాలంటే మీరు మంత్రజపాలు, పారాయణలు యేమి చేయనక్కఱ్లేదు. ఒక చిన్న కథ గుర్తుంచుకోండి చాలు' అన్నాడు.

ఒక సింహంపిల్ల అనుకోకుండా ఒక గొఱ్ఱెలమందలో కలిసింది. వాటితోపాటే పెరిగింది. అయితే దానికి తనకు గొఱ్ఱెలకు మధ్య తేడా వున్నదని మాత్రం అర్థమౌతోంది. ఇంతలో మఱో సింహం యీ సింహప్పిల్లని చూసి 'నువ్వు గొఱ్ఱెలమందలో వున్నప్పటికి, అక్కడే పెరిగినప్పటికి నువ్వు గొఱ్ఱెవి కాదు, సింహానివి' అని తెలియజేసింది. దానితో ఆ సింహప్పిల్ల తన ఆలోచనలను మార్చుకుని సింహంలాగే ప్రవర్తించడం మొదలెట్టింది.

మనంకూడ అలా చేస్తే చాలు. మనంకూడ భౌతికజీవితంలో యిరుక్కుపోయాము. అదే శాశ్వతమని అనుకుని అక్కడే సుఖదుఃఖాలు అనుభవిస్తూ జీవించేస్తున్నాము. అయితే పుట్టిన ప్రతిజీవి యీ భౌతికజీవితపు అనుభూతులలోంచి వున్నతస్థితికి యెదుగవల్సిన ఒక యోజనను ప్రకృతి ఆదేశించినది. గురుచరిత్రల పారాయణ ద్వారా లేక గురు మార్గదర్శనంలో ఉన్నతతలములకు చేరుకున్న అనేకమంది పేర్లు మనము వినివున్నాము. ఏ పనిచేస్తున్నా నేను ఆత్మను భావంతో చేస్తూవుంటే పరిణామక్రమంలో యెప్పటికోప్పటికి ఆత్మయొక్క అనుభూతి లభిస్తుంది. అప్పుడు చేసే పని శ్రీకృష్ణునికి యేవిధంగా లీలగా వుంటుందో మనకూ అలాగే వుంటుంది.

ఇతంటి శక్తి కలిగివున్న మనిషి మరి యెందుకు సామన్యుడిగా జీవిస్తున్నాడు? అనేది ప్రశ్న. మనిషి తన ఆలోచనలను మార్చుకుని పరిస్థితులను మార్చుకోవచ్చు అనేది సర్వవిదితము. అయితే నిత్యజీవితంలో మనిషి తనకు ప్రకృతి యిచ్చిన పాత్రను ఒక నటుడుగా చక్కగా పోషిస్తే ఆ జీవితమనే నాటకము రక్తికడుతుంది. భగవంతుడైనా మానవశరీరమును ధరించినప్పుడు దానికి తగిన జీవితమును అనుసరిస్తాడు. అప్పుడే ఆ పాత్ర రక్తికడుతుంది. కదా! రాముడు సీతాదేవిని తలచుకుని దుఃఖిస్తాడు. మఱి రాముడు అవతారపురుషుడేగా? మఱెందుకు దుఃఖించాడు. ఆయన ప్రకృతిలో ఆ సమయంలో తన పాత్రను పోషించాడు. అంతే. దాన్నే భగవంతుని లీల అంటాము. కృష్ణుడు తన జీవితమంతా యిలాంటి అనేక లీలలను ప్రదర్శించాడు. లీలలను కనబరుస్తూనే తన బాధ్యతలనుకూడ చేపట్టాడు. మనంకూడ అలాగే ప్రవర్తించాలి. దీనితోపాటు జీవితములోని యే బాధ్యతను వదలకూడదు. ప్రకృతి అంతా కృష్ణుని ఆదేశానుసారమే నడుస్తూవున్నప్పటికి

తన పాత్రను తను సరిగా పోషించుకున్నాడ శ్రీకృష్ణుడు. ప్రకృతిలో యెవటిపాత్ర యేమిటి? అనేది యెవరికివారు యెన్నుకుంటారు. చలనచిత్రంలో నటించాలంటే తను యే పాత్ర పోషించగలడో ఆ పాత్రనే నటుడు యెన్నుకుంటాడు. మనిషికూడ అంతే. అయితే ప్రకృతిలో మనిషి తన కివ్వబడిన పాత్రను సరిగా పోషించకపోతే ఆ పాత్ర ఔచిత్యము దెబ్బతింటుంది. నటుడు యేదైనా ఒక పాత్రలో నటించాలంటే తను చెప్పవల్సిన సంభాషణలు, ఏ సమయంలో ఎలా చెప్పాలి అనేది తెలియాలి. తెలిస్తే నటుడు ఆ పాత్రలో చక్కనా నటించగలడు. మర్చిపోతే? నాటకము రక్తికట్టదు.

మనిషిగా పుట్టిన సామాన్యుడు తను వేయవల్సిన పాత్రయొక్క సంభాషణలను, యే సమయంలో యే సంభాషణనను చెప్పాలో, ఎలా చెప్పాలో మర్చిపోయాడు. భగవంతుడు ఇవన్నీ సరిగా నిర్వర్తిస్తాడు. కృష్ణుడు, రాముడు తమ పాత్రలను చక్కగా పోషించారు. కదా! అందుచేతే వారు అజోపిసన్ అని చెప్పుకున్నారు.

పుట్టికలేని అవినాశీ ఆత్మ సృష్టిచేయగల సామర్థ్యము కలిగివుంటుంది. అలాగే దాన్ని లయము చేసే శక్తీ కలిగివుంటుంది. ఒక్క కృష్ణుడే కాదు, యీ శక్తిని మనిషిగా పుట్టిన ప్రతి ప్రాణి కలిగివుంటుంది. సూర్యోదయం = సృష్టి ఆరంభము అనుకుంటే; సూర్యాస్తమయము = లయము అవుతుంది. రాత్రి నిద్రించే సమయం లయంతో సమానము. మెలకువ రావడం సృష్టి ఆరంభమును సూచిస్తుంది. అయితే నిద్ర అనేది ప్రతిప్రాణికి సర్వసామాన్యము. మెలకువ అనేదికూడ అంతే. మెలకువ రాగానే తిరిగి నిత్యజీవితంలో పడిపోతాము. మనిషి జీవితంలో తన పాత్రను తను సరిగా నటించకపోతే ఆ పాత్ర లీల, అందము పోతుంది. ఆటల్లో అయినా మోసం చేస్తే ఒప్పుకోము. ఎందుకు ఒప్పుకోము అంటే ఆ ఆటకు కొన్ని నియమాలు పెట్టుకుంటాము. ఆ నియమాలు అతిక్రమిస్తే మోసం చేశాడు అంటాము. అలా చేస్తే ఆట అందము పోతుంది. ఆటలో నియమోల్లంఘన చేయరాదు. అందుకే యే ఆట ఆడేటప్పుడైనా ముందు ఆ ఆటకున్న నియమాలు తెల్సుకుంటాము. తెల్సుకున్నాక ఆట ఆడుతాము.

అలాగే ప్రకృతిలో అనేక నియమాలున్నాయి. పంచతత్త్వములు యిలాగ ప్రవర్తించాలి. ప్రకృతి యిలాగే వుండాలి. ఇలాగ కొన్ని నియమాలున్నాయి. ఈ నియమాలు ప్రతి ఆత్మ తనకు తాను యేర్పరచుకుంటుంది. ఎందుకంటే ఆత్మ అనేది భూతములకు ఈశ్వరుడుగనుక. మనమే నియమాలను యేర్పరచుకుంటాము. ఈ పనిని యిలాగే, యీ నియమాలతో చేయాలి అని నిర్ణయించుకున్నాక అలాగే చేయాలి. నీ యిష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే ఆ పని అందంగా పూర్తవదు. మధ్యలో అపశృతులొస్తాయి. నేను ఫలానా వుద్యోగము ఇన్నాళ్ళు చేస్తాను అని నిర్ణయించుకుంటే అన్నాళ్ళు పూర్తిచేయాల్సిందేకదా! ఇలాంటి వున్నతస్థాయి జీవితము జీవిస్తూవుంటే మెల్లిమెల్లిగా ప్రకృతి మీ వశంలోకొస్తుంది. ఆ స్థాయివారు భాగవతం వింటే ఫలితాలు అద్భుతము. భాగవత సప్తాహాలు నిరంతరము జరగాలని గురుదేవులు శ్రీరామశర్మఆచార్యగారి ఒక తీరని కోరిక. పంచతత్త్వముల ఆధిపత్యము సాధించుకోజూచేవారు భాగవతం వినాలి. వింటే వాటి నియమాలను అధిగమించవచ్చు. అప్పుడు పంచతత్త్వములు తమ స్వభావమును కోల్పోతాయి. గాలి గాలి లాగ ప్రవర్తించకుండా నీరులాగ ప్రవర్తించవచ్చు. అలాగే మిగతా తత్త్వములూను. గురువులు యీ విద్యలో నిపుణులు. ఉదా॥ శ్రీకృష్ణుడు, శిరిడిసాయి. శిరిడిసాయి తాను యీ స్థితిని పొందటానికి 12 సంవత్సరములు గురువును ఆశ్రయించానన్నాడు. ఈ స్థితి రావడానికి సామాన్యులు కొన్ని నియమాలను పాటించాలి.

**నిరంతరము ఆజ్ఞాచక్రస్థితిలో జీవించడము :**

కణకణంలో వున్న గురువు స్వభావమును గుర్తిస్తాము. గుర్తించాక మనంకూడ వారిలాగ మారటానికి ప్రయతిస్తాము. అప్పుడు మనంకూడ గురువులుగ మారిపోతాము. పైన చెప్పిన కథలో లాగ సింహం పిల్ల మఱల సింహములాగ మారిపోయినట్లు మనంకూడ అవినాశీఆత్మలుగా మారిపోతాము. అప్పుడు కష్టములను చూసి భయపడము.

రామరక్షాస్తోత్రంలో భర్జనం భవబీజానా మర్జనం సుఖసంపదామ్ ।

తర్జనం యమదూతానాం రామరామేతి గర్జనమ్ ॥ అంటాడు. చివరకు యముడుకూడ అలాంటివారిని చూసి భయపడతాడు. ఆ స్థితికి యెదగాలి ప్రతి మనిషి. తను ఆత్మను అని గుర్తించడానికి పెద్దగా సాధనలు అవసరము లేదు. గుర్తిస్తే చాలు. అందుకే శిరిడిసాయి ఎవరికి మంత్రోపదేశములు చెయ్యలేదు. ఉపవాసాలు మానేయమన్నాడు. నేను ఆత్మను అనే అనుభూతి వస్తే? జీవితము ఆనందమయంగా మారుతుంది. గురువులు చెప్పింది వినగా వినగా యెప్పుడో ఒకప్పుడు యీ అనుభూతి శిష్యుడికి కచ్చితంగా లభిస్తుంది. ప్రకృతి అంతా ఒక భ్రమ అనిపిస్తుంది. రాత్రి నిద్రపోతున్నప్పుడు మీకు భౌతికజగత్తు లయమౌతుంది. సంబంధబాంధవ్యాలు వుండవు. ఉద్యోగము వుండదు. ఏమీ వుండవు. అన్నీ లయమౌతాయి. చివరకు నేను అనే స్పృహకూడ వుండదు. ఇంతకి నిద్రపోయిన వ్యక్తికి సృష్టి వున్నట్లా? లేనట్లా? అతనికి సంబంధించినంతవఱకు సృష్టి లేదు. మెలకువ రాగానే జీవితం పునఃప్రారంభమౌతుంది. అంటే జీవితంలో మీ ఆట మఱల మొదలౌతుంది. మెలకువ రాకపోతే శాశ్వతనిద్రను వరిస్తాము. దాన్నే మృత్యువు అంటారు. మఱి చనిపోవడం మంచిదా? చెడ్డదా? మంచిదే.

అయితే అమరత్వమును సాధించినవారిని మృత్యువు యేమి చెయ్యలేదు. ఈ స్థితిని తెలియజేయడానికే జగద్గురువు భగవద్గీతలో ఇలా అన్నాడు.

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**

**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ (గీత అ॥ 2, శ్లో॥ 69)**

**భావము : సకల ప్రాణికోటికి ఏది రాత్రి వలె నుండునో ఆ నిత్యజ్ఞానరూపమగు పరమానందమును పొందినదశలో స్థితప్రజ్ఞుడగు యోగి మేలుకొనియుండును. ఇక నాశవంతములగు ఏ సంసారసుఖములను పొందినదశలో సకల ప్రాణులు మేలుకొనియుందురో, పరమాత్మతత్త్వమెరింగినట్టి మునికి అది రాత్రితో సమానము.**

అమరత్వమును సాధించినవారు తన స్వమాయతో పుడుతూంటారు, మరణిస్తూంటారు. స్వమాయయా అంటే యీ సృష్టి మీరు నిర్మించుకున్నదే అని. అయితే ఆ విషయము గురువులుకు, అవతారపురుషులు మొదలగువారికి గుర్తుంది. సామాన్యులకు గుర్తులేదు. నిరంతరము ఆజ్ఞాచక్రంలో వుండటం అలవాటు చేసుకుంటే పంచతత్త్వముల ఆధిపత్యము లభించితీరుతుంది.

మూలాధారచక్రము మీద ఆధిపత్యము రావాలి. మనిషి శరీరము ధరించాడంటేనే అర్థము గతజన్మ వాసనలవలన అని. మనిషి తన పూర్వజన్మ సంస్కారాలవలన, వాసనలవలన యీ జన్మలో వాటికి తగిన శరీరము లభిస్తుంది. పొడుగ్గా పుట్టినా, పొట్టిగా పుట్టినా, లావుగా వున్నా, సన్నగా వున్నా ఎలా వున్నా అవి గతజన్మ వాసనల ఆధారంగానే లభిస్తాయి. అలవాట్లుకూడ అంతే.

**ఆహార నియమాల పాలన :**

మంచి అలవాట్లను వృద్ధి చేసుకుంటూ, చెడు అలవాట్లను నశింపజేసుకోవడం అనేది మనిషి చేతిలో వున్నది. అందుకే సాధన చేస్తున్నప్పుడు ఆహారనియమాలను యేర్పరచారు ఋషులు. ఆహారం ద్వారా మనస్సు నిర్మించబడుతుంది. మనస్సు మారితే ఆలోచనలు మారుతాయి. ఆలోచనలు మారితే జీవితము మారుతుంది. కనుక సాధకునికి ఆహార నియమాలు పాటించడము అత్యావశ్యకమైన విషయము. ఆహారనియమాలుగనుక పాటిస్తూ వుంటే మెల్లిమెల్లిగా చేతనత్వంలో మార్పు వస్తుంది. ఎలాంటి మార్పు?

కృష్ణం నారాయణం వన్దే కృష్ణం వన్దే వ్రజప్రియం ।

కృష్ణం ద్వైపాయనం వన్దే కృష్ణం వన్దే పృథాసుతం ॥

**భావము : నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణదేవునికి నమస్కారము. వ్రజప్రియుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయనస్వరూపుడైన శ్రీకృష్ణభగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.**

*1. కృష్ణం నారాయణం వన్దే* - సాధకుడు యీ స్థితికి యెదుగుతాడు. మీరు నారాయణస్థితికి యెదగాలి. అంటే సర్వాంతర్యామిత్వము లభించాలి.

*2. కృష్ణం వన్దే వ్రజప్రియం* - తర్వాత నేను లీలామానుషవిగ్రహుడిని అనే అనుభూతిని పొందాలి. ఇలాంటి అనుభూతిని పొందినవారు ప్రపంచంలో అనేకమంది వున్నారు. గురువులు యీ స్థితిలో వుంటారు. అందుచేతనే వారు అనేక చమత్కారములు చేయగలుగుతారు. చనిపోయినవారిని బ్రతికించగలరు. ఆహారమును అనేకరెట్లు చేయగలరు. గురువుల చరిత్ర చదివితే యిలాంటి అద్భుతాలు అనేకం కనిపిస్తాయి. అయితే గురువులు చనిపోయిన ప్రతివారిని బ్రతికించెయ్యొచుకదా! అనే ఆలోచన కలగడం సహజము. నేను మరణిస్తాను, నేను పుడతాను అని నిర్ణయించుకున్నవారిని యెవరేమి చేయగలరు? ఉపనిషత్కారులు అందుకే 'మనయేవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః' అన్నారు.

కృష్ణుడిని లీలామానుషవిగ్రహుడు అంటాము. ఆయన శరీరము మనలాగ పంచతత్త్వములతో నిర్మించబడలేదు. సూక్ష్మలోకాలలోనే వివిధరకాలైన పవిత్రమైన అణువులతో నిర్మించబడినది. ఈ భావంతో పుట్టాడుగనుక కృష్ణుడు ఆయన వ్రజవాసులకు ప్రీతిపాత్రుడయ్యాడు. కృష్ణం వన్దే వ్రజప్రియం అంటారు. ప్రతి గురువు యీ మానసికస్థితిలో వుంటాడు.

*3. కృష్ణం ద్వైపాయనం వన్దే* - ద్వైపాయనుడు ఎవరంటే వ్యాసుడు. అంటే వ్యాసచేతనత్వస్థితి. వ్యాసుడియొక్క లక్షణము యేమిటి? ఆయన చేసిన పనులేంటి? వ్యాసుడు వేదాలను క్రోడీకరించాడు. మహాభారతం వ్రాశాడు. ఉపనిషత్తులను ప్రపంచానికి అందించాడు. మరి మనుష్యులుగా పుట్టిన మనకి ఇంత జ్ఞానము వున్నదా? లేదు. కనీసము జ్ఞానము సంపాదించుకునే మానసికస్థితి వున్నదా? లేదు. మనలో ద్వంద్వం వున్నది. ద్వైపాయనంలోని ద్వంద్వ మున్నది. సుఖదుఃఖాలు, మంచిచెడులు మొదలగు ద్వంద్వాంలు జీవితంలో భాగములుగా వుంటాయి. వ్యాసుడు ఆయన పుత్రుడైన శుకమహర్షి ఇల్లు వదిలి వెళ్లిపోతుంటే యేడ్చాడు. అలాగే ఆనందమును అనుభవించేటప్పుడు ఆనందమును అనుభవించాడు.

అయితే ద్వంద్వంలో వున్న వ్యక్తి దానినుండి బయటపడటానికి ప్రయత్నించాలి. సింహం గొఱ్ఱెలమందలో వున్న మేకలను పట్టుకుని చంపి తినలేదు. మఱో సింహమును సింహంగా మార్చింది. అంతే. మీరుకూడ మీ స్వస్థితిని అనుభూతిలోకి తెచ్చుకోవాలి. ఇతరులకు ఆ అనుభూతి రావడానికి సింహంలాగ కృషిచేయాలి. మీరు ముందు జాగృతం కావాలి. తర్వాత దేశమును జాగృతము చేయాలి. అందుకే వివేకానంద 'వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః' అన్నాడు.

***4. కృష్ణం వన్దే పృథాసుతం*** - ద్వంద్వస్థితిలో వున్నప్పటికి జీవితంలోని అన్ని కోణములను చవిచూడాలి మనిషి. ద్వంద్వంలో వున్న మనిషికి 'నేను యెలాగైతే ద్వంద్వంలో వున్నానో, మిగతావారుకూడ ద్వంద్వంలో వున్నారు. జీవితంలో వారు తమ పాత్రను తాము నిర్వహిస్తున్నారు' అనే విషయము అనుభూతిలో వుంటుంది. అయితే మనిషి యీ ద్వంద్వ ప్రవృత్తినుండి బయటపడాలి. బయటపడటానికి అర్జునుడిలాగ తన అంతఃకరణంలో తీవ్రమైన యుద్ధం చేయాలి.

అంటే మొదట అర్జునస్థితికి రావాలి, అక్కడినుండి వ్యాసపాత్రకి, అక్కడినుండి జగద్గురుపాత్రలోకి అంటే కృష్ణస్థితికి రావాలి. అక్కడినుండి నారాయణస్థితికి చేరుకోవాలి. జగద్గురువున్నచోట ఆయన ప్రణాళికను అమలుచేసేందుకు నారదునిలాంటివారు అనేకమంది ప్రోదిచెందుతారు.

# దేవర్షి నారదుడు భక్తిని కలియుట

నారదుడు అంటే మూడులోకాలలోను సుఖంగా తిరగ్గలిగే చేతనత్వము అని. గాయత్రీమంత్రోచ్చారణ చేసేవారందరూ నారదస్థితికి యెదుగుతారు. కనుక గాయత్రీ మంత్రమును జపించేవారందఱికి సద్గురుప్రాప్తి కలుగుతుంది. నారదుడు సద్గురువు. ఆయన అనుగ్రహం లభించినవారందఱు మహానుభావులయ్యారు లేదా భగవంతునిలో ఐక్యమయ్యారు. ఉదా॥ ప్రహ్లాదుడు. ఆయన రాక్షసవంశంలో పుట్టినప్పటికి శ్రీహరి అనుగ్రహమును పొందాడు. రావణాసురుడు అవతారమూర్తి రామునిలో లీనమయ్యాడు. నారదుడు ఎవరిని కలిస్తే వారు నారాయణతత్త్వంలో లీనమయ్యారు. అసలు రూపుదాల్చిన నారాయణతత్త్వము నారదుడు. నారము అంటే నీరు. నీరు దాహమును తీరుస్తుంది. దప్పిక ఒక్కటేకాదు యే దాహమునైనా నారదుడు తీరుస్తాడు. నారదుని చేతిలో మహతి అనే వీణ నిరంతరము మ్రోగుతువుంటుంది. మహతీ అనేది మహః అనే తలమును సూచిస్తుంది. భూః, భుః, స్వః తర్వాతి తలము మహః తలము. అంటే త్రిగుణాతీతస్థితి అన్నమాట.

అలాంటి నారదుడు ఒకసారి భక్తిని కలిశాడుట. సూర్యుని 7 కిరణాలలో భక్తి అనేది 6వ కిరణము. నారాయణ తత్త్వము తెలిసిన చేతనత్వమే మిమ్మల్ని నారాయణుని దగ్గఱకు తీసికెళ్ళగలదు. నారదుడుని ఆశ్రయిస్తే ఆయన నారాయణుని దగ్గఱకు కచ్చితంగా తీసికెళతాడు. వెళ్ళడమా? మానడమా? అనేది మన చేతిలోని పని. ఇష్టపడిన ప్రహ్లాదుడు, ధృవుడు మొదలగువారు ఆయన్ను పొందారు అన్న విషయము గుర్తుంచుకోవాలి. అయితే మనిషి తనకు ప్రకృతి ప్రసాదించిన పాత్రను, బాధ్యతను పూర్తిగా నిర్వర్తించితీరాలి. లేకపోతే పాత్ర ఔచిత్యము దెబ్బతింటుంది. దెబ్బతినకుండా ఎలా వున్నా పఱ్వాలేదు.

దేవర్షి నారదుడు భక్తిని కలిశాడు ఒకసారి. ఈనాడు భక్తి అనేది అందఱ్నీ నియంత్రిస్తోంది. భక్తి భగవంతుడిమీదా లేక మఱో విషయంమీదా అన్నది వేఱే సంగతి. అధికారం మీద భక్తి వుండొచ్చు, డబ్బుమీద భక్తి వుండొచ్చు. లేదా భగవంతుడిమీద భక్తి వుండొచ్చు. అలవాటు అనేది భక్తికి మఱోరూపం అనుకోవచ్చు. మనిషి అలవాట్లకి భక్తుడు. రాముడిని చూస్తే హిందువులకు పారవశ్యం. అల్లాని చూస్తే ముస్లిం స్పందిస్తాడు. ఇద్దరిలోను భక్తి వున్నది. మఱి యెవరి మార్గము సరైనది? ఇద్దరిది సరైన మార్గమే. అలవాటు వల్ల మనము రాముడిని పూజిస్తాము. ముస్లింలు అల్లాని పూజిస్తారు. కనుక నిత్యజీవితంలో ఎవరి అలవాట్లు మీమీద అధికారం చెలాయిస్తాయే మీరు వారి మాటే వింటారు.

భక్తి అంటే భావతీవ్రత స్థితి అనికూడ అనుకోవచ్చు. భక్తిని యెవఱు కలిశారు? నారదుడు. అంటే గాయత్రీ మంత్రమును జపిస్తూ మూడులోకములను దాటిన చేతనత్వము. గాయత్రీమంత్రంలోని భూః, భుః, స్వః అనే మూడు పదములు మూడు లోకములను సూచిస్తాయి. కనుక త్రిలోకాధిపత్యము రావాలంటే గాయత్రిని జపించాల్సిందే. గంటలుగంటలు గాయత్రీ జపము చేయాల్సిందే. దానికి సమయము వెచ్చించాల్సిందే. భక్తి వుంటే జపము చేస్తాము లేదా చెయ్యము అంతే. అందుకే వ్యాసభగవానుడు భక్తిని ముఖ్యమైనదిగా చెప్పాడు.

అయితే భక్తిని రెండు రకాలుగా వుపయోగించుకోవచ్చు.

1. వ్యాసుడు వ్రాసిన సాహిత్యమును పారాయణ చేసుకుని మీ చేతనత్వంలో మార్పు తెచ్చుకోవచ్చు.

2. జ్ఞానంతో చేతనత్వంలో మార్పు తెచ్చుకోవడము. అంటే ఒక్కముక్కని పట్టుకుని వున్నతస్థితికి యెదగడము. నారదుడు భక్తిని కలిశాడు అనే వాక్యంలో సాధకులైనవారు నిరంతరము గాయత్రిని జపించాలి అనే సూచన వున్నది. గాయత్రిని జపించినవారు గురుస్థితిని పొందుతారు అన్నదానిలో సందేహంలేదు. గాయత్రిని జపించేవారు నారదుడిని గురువుగా స్వీకరించడంలో తప్పులేదు అన్నది అర్థమైందిగదా?

ఓం - మూలాధారము, భూర్ - స్వాధిష్ఠానము, భువః - మణిపూరకము, సువః -అనాహతము, మహః - విశుద్ధి జనః - ఆజ్ఞ తపః - సహస్రారము, సత్యం - సర్వాంతర్యామిస్థితిని పొందడము, ఉన్నది ఒక్కటే అని గుర్తించడము.

***ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్ ॥*** గాయత్రీ మంత్రంలోని నః అనే అక్షరము సామూహికతను సూచిస్తుంది. కనుక గాయత్రీమంత్రజపము సామూహికంగా చేస్తేనే త్వరితగతిన ఫలితములను పొందుతామని ఋషుల నిశ్చితాభిప్రాయము.

అందుచేతనే సామూహిక జీవితమును అంటే కుటుంబ జీవితమును ఋషులు అందించారు. నారదుడు రావణుడి దగ్గఱికి వెళ్ళాడు, ఋషుల దగ్గఱికి వెళ్ళాడు. కదా! మనము కూడా సామూహికతను అనుసరించాలి. గాయత్రీమంత్రము రూపుదాల్చిన నారాయణస్వరూపము. ఆయన సర్వాంతర్యామి. అంతటా వ్యాపించియున్నవాడు. ఆయనను సామూహికంగా ఆరాధిస్తే ఫలితము త్వరగా వస్తుంది. అందుకే నారదుడు రాక్షసులనీ కల్సుకున్నాడు, ఋషులనీ కల్సుకున్నాడు. ఇద్దఱి మంచి కోరుకున్నాడు.

ఇంతటి వున్నత వ్యక్తిత్వమున్న నారదుడు భక్తిని కల్సుకల్సుకున్నాడు. ఇక్కడ భక్తిని గూర్చి కొంచెము అర్థము చేసుకుని ముందుకు సాగుదాము.

సాధారణంగా ఒక దైవం మీద భక్తి వుంటే వేఱే దైవమును కొలవడానికి ఆ సాధకుని మనస్సు అంగీకరించదు. శివుడిమీద భక్తి వుంటే శివాలయమునకు వెళతారుతప్ప ఇంకే దేవాలయము దరిదాపులకుకూడ వెళ్ళరు. అలాగే విష్ణుభక్తులు శివాలయంవైపు కన్నెత్తి చూడరు. ఈ పద్ధతి సరైనదేనా ఆలోచించండి. భగవంతుడు ఒక్కడేకదా! మఱి యీ వేఱ్పాటుధోరణులు ఎందుకు? చివఱకు హనుమంతుడుకూడ రాముడే కృష్ణుడిగా వస్తే గుర్తించలేకపోయాడు. కృష్ణుడు రాముడిగా దర్శనమిస్తేనే భక్తితో నమస్కరించాడుగాని, కృష్ణుడికి నమస్కరించలేకపోయాడు. అది భక్తి ఘనీభవించిన స్థితి యేమో!

ఈనాడు భక్తి కన్నా జ్ఞానము అవసరము. అందుకనే ఏక దేవతోపాసన లేక ఒకే గురువు అన్న సూత్రము యీనాడు వర్తించదు. ఇది యే యుగంలోను సరికాదు. ఏవిధంగా అయితే తేనెటీగ అనేక పుష్పములనుండి మధువును సంగ్రహిస్తుందో జ్ఞానము కోరుకునే సాధకుడు అనేకమంది గురువులను జ్ఞానంకోసం ఆశ్రయించాలి.

మధులుబ్ధో యధాభృంగః పుష్పాత్పుష్పాన్తరం వ్రజేత్ ।

జ్ఞానలుబ్ధ స్తథాశిష్యో గురోర్గుర్వన్తరం వ్రజేత్ ॥ (గురుగీత - 89)

**భావము : తుమ్మెద మధువుకొఱకు ఒక పుష్పంనుండి వేఱొక పుష్పమున కెళ్ళినట్లుగా శిష్యుడు గురువుల వద్ద కెళ్ళి జ్ఞానాన్ని గ్రహించాలి.**

సాక్షాత్తు దత్తస్వామే అందుకు వుదాహరణ. ఆయన 24 మంది గురువులను ఆశ్రయించాడు. ఈ విషయము ఆయనే స్వయంగా చెప్పుకున్నాడు.

గాయత్రీ జపం చేస్తున్నప్పుడు మూలాధారం నుండి ఓం భూర్, భువః, స్వః అంటే మణిపూరకం వఱకు వచ్చాక పైనున్న అనాహతంలోకి ప్రవేశించి ఆ చక్రంలో వున్న సూర్యకిరణములు (సూర్యస్థానము) నెత్తురు ద్వారా శరీరం మొత్తంలోకి ప్రాకిపోయి శరీర మంతా కాంతివంతమౌతోంది అనే భావన చేసుకోవాలి. శరీరమును కాంతితో నింపుకున్న సాధకులందఱూ కల్సి జీవించాలి. అందుకే గాయత్రీలో నః అనే శబ్దము సామూహికతను సూచిస్తోంది.

సచ్చిదానన్దరూపాయ విశ్వోత్పత్యాది హేతవే ।

తాపత్రయవినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః ॥ (శ్లో॥ 1)

**భావము : సత్, చిత్, ఆనంద స్వరూపము, విశ్వంయొక్క వుత్పత్తి, స్థితి, వినాశనానికి కారణమైన మఱియు ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆదిభౌతికమైన మూడురకాల తాపములను నాశనము చేసే ఆ శ్రీకృష్ణభగవానునికి మేము నమస్కరించుచున్నాము.**

వయం అంటే? మేము అని. కనుక వ్యక్తిగతంగా సాధన చేసుకుంటే భక్తి యొక్క లొంగుబాటులోకి వెళ్ళరు. మీ వ్యక్తిగత భక్తే మిమ్మల్ని తప్పుద్రోవ పట్టిస్తుంది. భక్తి అంటే అలవాట్లు అనికూడ అర్థము చెప్పుకున్నాము. మీకు యేది యిష్టమో అది అలవాటుగా మారుతుంది. నిద్రపోవడం యిష్టమున్నవారికి నిద్రమీద భక్తి వున్నట్లే. కారం తినడం అంటే యిష్టం అంటే కారం మీద భక్తి వున్నట్లే. చివఱగా మీకు దేనిమీద భక్తి వుంటే మీరు అదేగా అయిపోతారు. ఈనాడు అందరికి డబ్బుమీద భక్తి వున్నదిగనుక ఏ పనిచేసినా ఎంత డబ్బు సంపాదించావు అనే అడుగుతున్నారు. ఇలాంటి భౌతికవిషయాల మీదున్న భక్తిని భగవంతునిమీద ఆ సచ్చిదానందరూపుని మీద కేంద్రీకరించండి. సత్-చిత్-ఆనంద రూపుడు అంటే భూర్, భువః, స్వః అనే మూడు. ఇవి త్రిపుటిలు. బుద్ధి, చిత్తము కలిస్తే అహంకారము వస్తుంది.

అలాగే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు. సత్-చిత్-ఆనంద స్వరూపుడు మనిషిలోని ఆజ్ఞాచక్రంలో నెలకొనివుంటాడు. ఆ సచ్చిదానందరూపుని మంత్రపుష్పంలో ఇలా అభివర్ణించారు.

సన్తాపయతి స్వం దేహ మాపాద తల మస్తకః । తస్య మధ్యే వహ్నిశిఖా అణీయోర్ధ్వా వ్యవస్థితః ॥

**భావము : వైశ్వానరుడు అనబడు ఆ మహాగ్ని, తననుండి సర్వత్రా వ్యాపించే అగ్నికిరణాల వేడిమిచేత, తాను ధరించిన దేహమును అరికాళ్ళనుండి బ్రహ్మరంధ్రం వఱకును తపింపజేయుచుండును. అట్టి మహాతాపకమైన రశ్మలు కలిగిన అగ్నుల నడుమ ఆ అగ్ని చక్రమునకు ఇరుసుకొనయో అన్నట్లు ఒక విశిష్టాగ్ని వూర్ధ్వముఖంగా వెలుగుచున్నది.**

నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా । నీవారశూక వత్తన్వీ పీతా భాస్వత్యణూపమా ॥

**భావము : ఆ అగ్నిచార నీలిమబ్బు నడుమ మెఱుపుతీగ వలె, సూక్ష్మతమమైన నివ్వరిధాన్యపుగింజ యొక్క పైములుకంత ప్రమాణమున బంగారుకాంతులు విరజిమ్ముచు ప్రకాశించుచున్నది.**

అమృతబిందూపనిషత్తులో 101 నాడులగూర్చి చెబుతూ అందులో 100 నాడులు అధోముఖంగాను, ఒక్క నాడి వూర్ధ్వముఖంగాను వుంటుంది, దాన్నే అమృతనాడి అని అంటారు అని చెబుతాడు.

తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః । సబ్రహ్మ స్సశివస్సహరి స్సేన్ద్రసోஉక్షరః పరమస్స్వరాట్ ॥

**భావము : ఆ సూక్ష్మాగ్ని యొక్క అగ్రభాగపు నట్టనడుమనే పరమాత్మ వ్యవస్థితుడై వున్నాడు. అతడే సృష్టికర్త యగు బ్రహ్మ. అతడే లయంకరుడగు శివుడు. అతడే స్థితికరుడైన విష్ణువు. అతడే జగత్పాలకుడగు ఇంద్రుడు. అతడే నాశనములేని శాశ్వతుడు. అతడే శుద్ధసచ్చిదానంద రూపుడైన పరముడు. అతడే స్వరాట్టు.**

మూలాధారంనుండి అనాహతమునకు వచ్చినప్పుడు మంత్రపుష్పంలో చెప్పబడిన ఆ భావమును చేసుకోవాలి. నీలిరంగు కాంతులను వెదజల్లుతున్న ఆ నాడి అనాహతం నుండి ఆజ్ఞాచక్రంలోకి వెళుతోంది అనే భావన చేసుకోవాలి. ఆ నీలమేఘశ్యాముడిమీద భక్తిని పెంపొందించుకోవాలి. ఆజ్ఞాచక్రంనుండే ఈ సమస్త సృష్టి పుట్టి, అక్కడే స్థితమై, తిరిగి లయమైపోతోంది. నిద్రపోతున్నప్పుడు ప్రతివారు ఆజ్ఞాచక్రంలోనే తెలిసో తెలియకో లయమౌతుంటారు. లయం కానివారు అనిద్రారోగంతో బాధపడుతుంటారు. అలాంటివారు ఆజ్ఞాచక్రంమీద దృష్టినుంచుకుంటే త్వరగా నిద్రదేవి ఒడిలోకి జాఱుకుంటారు. ఈ అజ్ఞాచక్ర సాధనలో వివేకానంద అత్యంత నిష్ణాతుడు. ఆయన నిద్రపోతున్నప్పుడు శరీరంలోని రక్తమంతా ఆజ్ఞాచక్రంలోకి చేరుకునేది. అక్కడ ఒక జ్యోతి వెలుగు కనిపించేది అని అన్నాడు. ఆ జ్యోతి స్వరూపుడే నీలిమేఘశ్యాముడు. రాత్రి నిద్రపోతున్నప్పుడు మనస్సును ఆజ్ఞాచక్రం మీద కేంద్రీకరించి పడుకోవడం అనేది ఋషులు అందించిన ఒక అద్భుత సాధన.

అయితే భగవంతుడిమీద భక్తి పెరగాలంటే జీవితంలోని బాధ్యతలను వదిలెయ్యకూడదు. వాటిని యింకా సక్రమంగా నిర్వర్తించాలి. ఇలాంటివారి సమస్త తాపములను, తాపత్రయాలను ఆ నీలిమేఘశ్యాముడు తీరుస్తాడు.

తాపములు అనేకరకములు. మనిషికి ఖనిజజగత్తుకు, వృక్షజగత్తు, జంతుజగత్తులకు చెందిన అనేక తాపములు అతని సంస్కారాలతోపాటు వెన్నంటివస్తాయి. వాటన్నింటిని తొలగిస్తాడు. ద్వంద్వములలో చిక్కుకునివుంటాడు మనిషి. ఉదా॥ అల్లుడేమో తన మాట వినాలి అని కోరుకునే అత్త, కొడుకుమాత్రం అత్తగారి మాట వినకుండా తన మాటే వినాలని కోరుకుంటుంది. ప్రకృతిలో దానికి యెప్పుడైతే విరుద్ధంగా జరుగుతుందో కష్టములు మొదలౌతాయి.

ఇతరులవలన నాకు కష్టము లొచ్చాయి అని బాధపడతారు. ఇది కామమయశరీరమునకు చెందిన దోషము. అంటే వృక్షజగత్తుకు చెందిన దోషము. కనుక కోరికలు తీరాలి అని అనుకునేవారికి ఒక చక్కని చిట్కాను మన ఋషులు అందించారు. చెట్లకి గనుక నీరు పోస్తే మనిషికి తీరని కోరిక వుండదు. కామమయజగత్తుకు చెందిన మూర్ఛరోగమున్నవారు 15 మొక్కలకు లేదా చెట్టకు క్రమంతప్పకుండా నీరు పోస్తె వారికున్న రోగం తగ్గిపోతుంది. ఇలాంటి అనేక రోగములను నివారించడానికే ఋషులు చెట్లకు నీరుపోయమంటూ సూచించారు. ముఖ్యంగా ఆశ్రమాలలో చెట్లను పెంచి నీరుపోయించేవారు గురువులు. దానితో కామమయతలంలో వున్న రోగాలు పోవడమేగాక, కోరికలూ తీరుతాయి.

ఖనిజజగత్తుకు చెందినది భౌతికశరీరమునకు చెందిన తాపము. అలాగే మనిషి మనస్సులో కూడ బాధలు వుంటాయి. ఇవి ఋణానుబంధంవలన వస్తాయి.

యం ప్రవ్రజన్తమనుపేతమపేతకృత్యం
ద్వైపాయనో విరహకాతర ఆజుహావ ।
పుత్రేతి తన్మయతయా తరవోఽభినేదు
స్తం సర్వభూతహృదయం మునిమానతోఽస్మి ॥ (శ్లో॥ 2)

**భావము ః ఎప్పుడైతే శుకదేవుడు యజ్ఞోపవీత సంస్కారంకూడ అవకుండా మఱియు లౌకిక, వైదిక కర్మానుష్ఠానాలు చేసే అవసరము రాకుండా ఒంటరిగా సన్యాసం తీసుకోవడానికి యింటినుండి వెడలుచున్నాడో; అది చూసిన ఆయన తండ్రి వ్యాసభగవానుడు విరహంతో పుత్రా, నీవెక్కడికి వెడుతున్నావని బాధతో అడిగాడు. అప్పుడు వృక్షములు తన్మయంచెందినవై శ్రీశుకభగవానుల తరఫునుండి అవి జవాబు నిచ్చాయి. అలాంటి సర్వభూత హృదయస్వరూపుడైన శ్రీశుకదేవమహర్షికి మేము నమస్కరిస్తున్నాము.**

శుకమహర్షికి నమస్కారము అన్నాడు. శుకము అనేది ఒక చిలుక. చిలుకయొక్క మొదటి లక్షణము అర్థమైనా, కాకపోయినా చెప్పింది వల్లెవేస్తుంది. అలా వల్లించగా వల్లించగా దేవత్వము ప్రాప్తిస్తుంది. ప్రకృతిలో మీరు దేన్ని పదేపదే వల్లెవేస్తారో మీరు అదే అయిపోతారు. ఆ స్థితి మీకు ప్రాప్తిస్తుంది. దాన్నే జపవిజ్ఞానము అన్నారు ఋషులు.

ఉదా॥ శాస్త్రవేత్తలందరూ యీ కోవకు చెందుతారు. రోగమునకు మందు తెలియకపోయినా తిరిగితిరిగి అనేక ప్రయోగాలు చేస్తారు. అలా చేయడంలో వారి వుద్దేశ్యము ఎప్పటికోప్పుడు ఆ రోగమునకు మందు లభిస్తుంది అనే ఆశ. అయితే కేవలం జపం చేయడంవలన అనుకున్న ఫలితమును పొందలేము. దానితోపాటు ప్రయోగాలుకూడ చేయాలి. అంటే ఆచరణకూడ వుండాలి.

ఈ శ్లోకంలో శుకస్థితినుండి శుకదేవ స్థితికి వెళ్ళే సూత్రమును అందించాడు. ఈ శుకమహర్షికి యజ్ఞోపవీత సంస్కారము అవ్వలేదు. అది అవకుండా సన్యాసం పుచ్చుకోరాదు అనే ఒక నియమ మున్నది. అటువంటి యజ్ఞోపవీత సంస్కాము అవ్వకుండానే సన్యాసం తీసుకునే పుత్రిని చూసి వ్యాసుడు వ్యధ చెందుతాడు.

చెట్లు - కోరికకి ప్రతీక. వ్యాసభగవానుడి కోరికకి చెట్లు ప్రతిస్పందన యిస్తున్నాయి. అయితే శుకుడు ప్రతిస్పందన యివ్వడంలేదు. చెట్లు స్పందించాయి.

సంతానము కోరుకునేవారు రావిచెట్టుకు ప్రదక్షిణలు చేయమని సూచించారు ఋషులు. మంత్రజపము చేస్తూ అలా చెట్టు చుట్టూ తిరిగితే అనుకున్న కోరిక కచ్చితంగా తీరుతుంది. అయితే మనిషికి కోరిక వల్ల బాధవస్తోందితప్ప; కోరిక తీరకపోవడంవలన కాదు. ఎందుకంటే ఒక కోరిక తీరిన మరుక్షణం ఇంకో కోరిక పుడుతుంది. అది తీరితే మఱొకటి. ఒక్క కోరికే ముఖ్యమైవుంటే ఆ ఒక్క కోరిక తీరంగానే మీకు ఆనందము లభించాలి. కానీ ఆనందము లభించడంలేదు. ఆ కోరిక తీరిన మరుక్షణం యింకో కోరిక అనే కలుపుమొక్క మొలకెత్తుతుంది. కనుక అసలు రహస్యం యేమిటంటే కోరిక వుద్భవించడమే.

వ్యాసుడికి కూడ ఒక కోరిక వుద్భవించింది. రాగానే గొంతెత్తి అరిచాడు. అది విని చెట్లు ప్రతిస్పందించాయి. అయితే వ్యాసుడు తండ్రిగా తన కుమారుని వెనక్కి పిలవడం బాధ్యత గనుక ఆ బాధ్యతను నిర్వర్తించాడు. వ్యాసుడు కామమయజగత్తునుండి పలుకుతున్నాడు. శుకుడు సర్వభూత హృదయుడు. అందుచేతనే వ్యాసుడు పిలిస్తే శుకునికి బదులు చెట్లు స్పందించాయి. ఆర్తితే పిలిస్తే యే గురువైనా పలుకుతాడు అనేది ఇందుకే. గురువు సర్వవ్యాపకస్థితిలో వుంటాడు. ఆయన ఫలానా రూపంలోనే పలకాలని లేదు. ఏ రూపంలోనైనా స్పందించగలడు.

**నైమిషే సూతమాసీనమభివాద్య మహామతిమ్ ।**

**కథామృతరసాస్వాదకుశలః శౌనకోఽబ్రవీత్ ॥ (శ్లో॥ 3)**

**భావము : ఒకసారి భగవత్ కథామృతరసాస్వాదన చేయుటలో కుశలురైన శౌనకముని నైమిశారణ్యక్షేత్రంలో మహామతి సూతునకు నమస్కరించి యిలా అడిగారు.**

శౌనకుడు = శ్రోత. శ్రోతలు యెలాంటివారై వుండాలి? కథామృతరసాస్వాదకుశలః -వారు చెప్పిన కథను ఆస్వాదించడంలో కుశలురైవుండాలి. ఆసక్తిగల శ్రోత కథను బాగా చెప్పగలిగే వ్యక్తిని కథను చెప్పమని అడగాలి. ఉదా॥ భాగవతమును సప్తాహపారాయణ చేయడానికి పరీక్షిన్మహారాజు శుకమహర్షిని ఆశ్రయించాడు. చెప్పినవారు, విన్నవారు యిద్దఋూ ధన్యులయ్యారు అన్న సంగతి సర్వవిదితమే. పురాణాలలో వాటిలో కథను చెప్పే చేతనత్వమును సూతుడుగా చెప్పారు.

ఆ సూతుడు ఎక్కడ కూర్చుని వున్నాడు? నైమిషే - నిమిషరహితస్థితి. కాలాతీతస్థితిలో వున్నాడు సూతుడు. కాలాతీతస్థితిని అనుభవించలేని వ్యక్తి భాగవతకథను వినిపించలేడు. భాగవతమును పల్లకీలో తీసుకురమ్మనడం, కథామృతాన్ని వినిపించే వ్యక్తిని పూజించమనడంలో గల అర్థము ఆ చెప్పే వ్యక్తి కాలాతీతస్థితిలో వుంటాడుగనుక ఆ విధానమును యేర్పాటుచేశారు. సూతుడు కాలాతీతస్థితిలో వుండటమేగాదు మహామతిమంతుడుకూడ. అంటే తెలివైనవాడు.

ఆయన యేమి చేస్తాడు? కథను చెప్పడం ద్వారా మీ చేతనత్వంలో మార్పు తీసుకొస్తాడు. మీ చేతనత్వంలో మార్పు యే స్థాయికి రావాలంటే సర్వవ్యాపకత్వము, సర్వజ్ఞత, సర్వసమర్థత రావాలి. ఆధ్యాత్మికవిద్యలో సాధకుడికి ఆ లక్షణాలు రావాలి.

కానీ యీనాడు భౌతికవిద్యను అభ్యసించి అదే గొప్పఅనుకుంటున్నారు. ఆ విద్యతో వచ్చిన వుద్యోగంతో జీవితంలో స్థిరత్వము వచ్చింది అని మురుసుకుంటున్నారు. ప్రకృతి యెప్పుడు గతిశీలమైనది. మఱి స్థిరత్వము యెలా వస్తుంది?

ప్రకృతి వేగంతో గనుక మన గమనము వుంటే మన వేగం ప్రకృతి వేగం ఒకేలాగ వుంటే మనకు స్థిరత్వము వచ్చినట్లు. ఉదా॥ రెండు రైళ్ళు ప్రక్కప్రక్కనే వెడుతున్నాయి. రెండు రైళ్ళ వేగం ఒకేలాగ వుంటే ఒక రైలులోని వ్యక్తి రెండో రైలులోని వ్యక్తితో మాట్లాడవచ్చు. అయితే ఆ ఇద్దఱు వ్యక్తులు స్థిరంగా వున్నారా? లేరు. రైలు వేగంతో ముందుకు ప్రయాణిస్తున్నారు. చూడటానికిమాత్రము స్థిరంగా వున్నారు అని అనిపిస్తుంది.

సాధకుడుకూడ ప్రకృతితో యిలా ప్రయాణించాలి. అప్పుడు స్థిరత్వము వస్తుంది.

ఈ స్థితి ఆధ్యాత్మికవిద్యవల్లనే లభిస్తుంది. అనేక సాధనలను ఋషులు అందించారు. పూజలు, వ్రతాలు, జపాలు చేయమన్నారు. కానీ యీనాడు అవన్నీ మీ భౌతికజగత్తును స్పృశిస్తున్నాయితప్ప మీ మనస్సుయొక్క లోతులలోకి వెళ్ళడంలేదు. షోడశోపచారపూజతోనే శ్రీరామకృష్ణపరమహంస అంత వున్నతస్థితిని అందుకున్నాడు. పూజలు అవీ ఆ స్థాయిలో చేయాలి. షోడశోపచారపూజ మనిషిలోని 16 రకాల చేతనత్వస్థాయిల్లో మార్పు తెస్తుంది.

పూజ చేస్తున్నప్పుడు ఆరతిస్తారు. ఆరతిచ్చాక దేవుడికి తెరవేస్తారు. ఎందుకు వేస్తారో ఎప్పుడైనా గమనించారా? అంతర్ముఖమవ్వ మని అలాంటి విధివిధానమును యేర్పాటుచేశారు మునులు. తెరవేశాక కళ్లుమూస్కుని అంతర్ముఖమవ్వాలి. మీ హృదయంలో నిలుపుకున్న ఆ స్వామిని మీ ఇంటికి తీసుకెళ్ళాలి. ఈనాడు దేవాలయంలో దేవుని దర్శనానికి వెళ్ళేవారు యెలాంటి మానసికస్థితిలో వెడుతున్నారో!! ఏదో వెళ్ళాం, వచ్చాం, అంతే. అయిపోయింది అనుకుంటున్నారు. దేవాలయానికి వెళ్ళిన మనిషి చేతనత్వంలో మార్పురావాలి.

భాగవతం చదువుతున్నవారు యెలాంటి మార్పు తెచ్చుకోవాలంటే .....

కృష్ణం నారాయణం వన్దే కృష్ణం వన్దే వ్రజప్రియం ।

కృష్ణం ద్వైపాయనం వన్దే కృష్ణం వన్దే పృథాసుతం ॥

**భావము : నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణదేవునికి నమస్కారము. వ్రజప్రియుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయనస్వరూపుడైన శ్రీకృష్ణభగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.**

మొదటి మార్పు పృథాసుతం అనేది సాధకునిలో రావాలి. పృథాసుతం అంటే పృథ్వీపుత్రుడు అని అర్థము. ఎవఱు పృథ్వీపుత్రులు? మనుషులందఱూ పృథ్వీపుత్రులే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే యీ పృథ్వీమీదున్న యీ చరాచర సృష్టంతాకూడ పృథ్వికి బిడ్డలే. ఈ పృథ్వీపుత్ర స్థితిని మనకు అందజేయడానికి గురువులు బహు ప్రయత్నము చేశారు. అందులో శిరిడిసాయి ప్రయత్నము అమోఘము. కుక్కగా, బల్లిగా, మేకగా యిలా తన చేతనత్వంలో అఖండమండలాకారమును దర్శింపజేసిన చేతనత్వము శిరిడిసాయి చేతనత్వం.

మహాభారతంలోని అర్జునుడుకూడ మనిషే. అంటే అతనుకూడ పృథ్వీపుత్రుడే. అయితే యుద్ధంలో అర్జునుడి మానసికస్థితి యేమిటి? ఇరుసేనల మధ్య నా రథాన్ని నిలబెట్టు అని శ్రీకృష్ణుడిని కోరతాడు అర్జునుడు. రెండు అనేది ద్వంద్వమును సూచిస్తుంది. మనిషి జీవితంలో ఈ ద్వంద్వము అనేది తప్పనిసరి. యుద్ధంలో అర్జునుడికి వ్యతిరేకంగా కొందరు, అనుకూలంగా కొందఱు యుద్ధం చేయడానికి పూనుకున్నారు. మన నిత్యజీవితంలోకూడ కొందఱు మనపట్ల వ్యతిరేకతతోను, కొందఱు అనుకూలంగాను ప్రవర్తిస్తుంటారు. మనిషి జీవితంలో ద్వంద్వము అనేది యెప్పుడూ వస్తుంది.

ఇటు భౌతిక ఆకర్షణలు, సుఖాలు ఒకవైపుకు లాగుతుంటే; అంతర్గతసుఖాలు, ఆకర్షణలు లోపలికి లాగుతుంటాయి. రెండురకాలైన కోరికలలో ఒకటి బాహ్యం వైపుకు లాగుతుంటే; మఱోది అంతరంగం వైపుకు లాగుతుంటుంది.

బాగా అలసిన మనిషి నిద్రపోవాలనుకుంటాడు. అంటే అలసట తర్వాత విశ్రాంతి అవసరము అన్నది అర్థమౌతున్నదిగదా! అలాగే భౌతికసుఖాలు, ఆకర్షణలు అనుభవించిన తర్వాత ఆ నిషానుండి బయటపడి కాసేపైనా అంతర్గతమవ్వకపోతే మనస్సు అశాంతితో అలమటిస్తుంది. మనస్సుకుకూడ విశ్రాంతి కావాలిగదా? అది అంతర్గత దృష్టి ప్రసాదిస్తుంది.

మీకు భౌతికజీవితంలో యేది కావాలనుకుంటే అది లభించే ఒక వరము ఉపలబ్ధమైంది. అయితే ఒక షరతు. ఆ వరంతో మీరు అంతర్ముఖులుగామాత్రం అవ్వలేరు అనే నియమముకూడ వున్నది. ఆ వరంతో మీరు ఊ అంటే సకలసుఖాలు లభిస్తున్నాయి. అన్నీ అనుభవిస్తున్నారు. మీరు యేది కోరుకుంటే అది జరిగిపోతోంది. మీరు ఫలానా దేశానికి ప్రధానిని కావాలనుకుంటే అలాగే అయిపోతున్నారు. కోట్లకొద్దీ ధనము కావాలనుకుంటే లభిస్తున్నది. ఎన్ని లభించినా శాంతిమార్గము దానితో పొందలేరు.

మీరు వరుసగా 3 రాత్రులు నిద్రపోలేదనుకోండి. ఏమౌతుందో తెలుసా? పిచ్చెక్కే పరిస్థితి యేర్పడుతుంది. మనిషి నిద్రలేకుండా ఎక్కువకాలం జీవించలేడు. అలాగే భౌతికసుఖాలు ఎన్ని లభించినా అంతర్ముఖమవ్వకుండా మనిషి సుఖంగా వుండలేడు. అసలు విషయము యేమిటంటే అంతర్జగత్తు వైపుకు వెళ్ళకుండా కేవలం భౌతికసుఖాలు అనుభవిస్తుంటే మనిషి పిచ్చెక్కిపోతాడు. అయితే మనిషి యీనాడు తన తెలివితేటలు, జ్ఞానము, సంపద, వనరులు అన్నీ భౌతికసుఖాలను పెంచుకునేందుకుమాత్రమే వుపయోగించుకుంటున్నాడు. ఇది వాస్తవము అన్న విషయము అందరికి తెలుసు. మఱి మనిషి తెలివైనవాడు అవునా? కాదా? ఆలోచించండి!!

కేవలం భౌతికసుఖాలు ముఖ్యంకాదు, కేవలం ఆధ్యాత్మికవిద్యే జీవితమనుకున్నా యీ యుగంలో కుదరదు. రెండూ వుండాలి. అయితే ఆధ్యాత్మికవిద్య లేకపోతే మనిషి పరిణామక్రమంలో ఎదగలేడు. ఆధ్యాత్మికవిద్య ఉద్దేశ్యము యేమిటి? అనే ప్రశ్న వస్తే ఏది శాశ్వతమైనదో, ఏది అవ్యయమైనదో, యేది మీకు ప్రకృతిమీద పరిపూర్ణమైన ఆధిపత్యము నిస్తుందో అది సాధించడమే! ఆ లక్ష్యముంటే అంటే ఆత్మదర్శనము కావాలనుకుంటే భాగవతవిద్య మీకు సహకరిస్తుంది.

భాగవతంలో 12 స్కంధా లున్నాయి. 12 స్కంధాలు - ద్వాదశరాశులకు ప్రతీక. 12 స్కంధాలు ఆధ్యాత్మిక జ్యోతిర్విద్యను బోధిస్తాయి. ఉదా॥ రాశులలో మొదటి రాశి - మేషరాశి. మేక అంటే అజము అని. అజము - అంటే పుట్టుకలేనివాడు అని. ఆగ్నేయదిశలో మనము మేకను అగ్నిదేవునియొక్క వాహనంగా పూజిస్తాము. అగ్నికి-అజమునకు(పుట్టుకలేకుండా వుండటానికి)గల సంబంధము అర్థమవ్వాలి. అంటే అగ్నిద్వారా పుట్టుకలేకుండా వుంటే స్థితికి ఎదగాలి.

గురువులందఱూ యీ అగ్నివిద్యలో నిష్ణాతులే! వారు పుట్టుకలేనిస్థితిని అనుభూతి చెందుతారు. పుట్టుకలేనివారికి మరణంకూడ వుండదు. అంటే గురువు లందఱూకూడ అమరులన్నమాట. అందుచేతనే గురువులు భౌతికశరీరమును వదిలేసినా వారి సమాధులని పూజిస్తాము. అక్కడ అనుకున్న కోరికలు తీరుతాయి అనే విషయము సర్వవిదితమేగదా! వారి సమాధులే ఆర్తులకు కల్పవృక్షాలు. వారి బాధలను పోగొట్టే కామధేనువులు. వారి సమస్త కోరికలు తీర్చే పరశువేదిలు. గురువు లందఱూ ప్రకృతిమీద అంటే పంచతత్త్వములమీద ఆధిపత్యమును పొందినవారే.

ఉదా॥ శిరిడిసాయి ఆగిపొమ్మంటే కూలిపోయే మసీదు ఆగిపోయింది. ఆయన సంకల్పమాత్రంతో తుఫాను చెలరేగింది. ఇలాంటి చమత్కారములు గురువు లందఱి జీవితాలలోను మనము గమనిస్తాము. వెంకయ్యస్వామి దగ్గఱ భోజనానికి కూర్చుంటే అన్నము అక్షయమయ్యేది. ఈ చమత్కారములన్నీ వారి ప్రాకృతికాధిపత్యమును నిరూపిస్తున్నాయి. మఱి గురువు లందఱూ ఏ విద్య ద్వారా యీ చమత్కారములన్నీ చేస్తున్నారో ఆ విద్యను నేర్చుకోవాలి. రాబోయే రోజులలో ఆ విద్యనే విశ్వవిద్యాలయాల్లో బోధిస్తారు అన్నది సత్యము. ఇదొక జరుగబోవు తథ్యము. ఈ యోగవిద్య ద్వారానే గురువులు అనేక చమత్కారములు చేశారు. అనేక అద్భుతాలు ప్రదర్శించారు అని మనకు తెలుసు.

**మూకం కరోతి వాచాలమ్ పంగుమ్ లంఘయితే గిరిమ్ ।**

**యత్కృపా తమహం వన్దే పరమానన్ద మాధవమ్ ॥**

శ్రీకృష్ణుడు అలాగే చేశాడు. శిరిడిసాయి అలానే చేశాడు. సత్యసాయి అంతే. అయితే యీ విద్యను నేర్చుకోవాలంటే కొన్ని జన్మలు పడుతుంది అన్నది వాస్తవము. మామూలు భౌతికవిద్యను నేర్చుకోవాలంటేనే విద్యార్థి దాదాపు 17 సంవత్సరాలు సమయాన్ని, దానితోపాటు కొంత ధనమును, వనరులను వెచ్చించాలి. భౌతికవిద్యకే ఇంత సమయము, ఇంత ధనము, వనరులను వెచ్చిస్తే మఱి పంచతత్త్వముల ఆధిపత్యమును సముపార్జించేందుకు ఎన్ని జన్మలు పడుతుంది? ఎంత ధనము వెచ్చించాల్సివుంటుంది. ఎన్ని వనరులను సమీకరించుకోవాల్సివుంటుంది? ఎన్ని సాధనలు చేయాల్సొస్తుంది? ఆధ్యాత్మికవిద్యను 24 గంటలు సాధన చేయగా చేయగా కొన్ని జన్మలలో దాని ఫలితము కనిపిస్తుందితప్ప యేదో ఒకరోజు జపము చేసి, మఱ్నాడు ధ్యానము చేసి, మూడోరోజు ఫలితము రావాలంటే రాదు అన్నది సుస్పష్టము.

అయితే సాధనలు చేస్తూ చేస్తూ మధ్యలో మరణిస్తే తర్వాతి జన్మలో అక్కడినుండి సాధన మొదలౌతుంది. ఇది ప్రకృతిలో వున్న ఒక గొప్ప నియమము. గీతామృతమును బోధిస్తున్నప్పుడు అర్జునుడు 'సాధన చేస్తూ మధ్యలో మరణిస్తే యేమౌతుంది? అని' శ్రీకృష్ణుడిని ఒక ప్రశ్న అడుగుతాడు. దానికి జవాబుగా జగద్గురువు యిలా అంటాడు. మరణించేముందు యే మానసికస్థితిలో మరణిస్తే దాన్నే పొందుతావు. పుడితే యోగుల కులంలో అయినా పుడతావు లేదా ధనవంతులు యింట్లో అయినా పుడతావు. యోగుల కులంలో పుట్టావు అంటే నీకు యోగం మీద ఆసక్తి వున్నది అని. కాబట్టి నువ్వు సాధనలో ముందుకు వెళలావు. అదే ధనవంతుల యింట్లో పుట్టావు అంటే నీకు యోగం మీద కన్నా భౌతికసుఖాలమీద ఆపేక్ష యెక్కువ అని అర్థము. కనుక ఎక్కడ పుట్టావు అన్నదాన్నిబట్టి నీ లక్ష్యమును చెప్పవచ్చు అని వివరంగా చెబుతాడు కృష్ణుడు. అయితే కలియుగంలోని యీ యుగసంధి సమయంలో ప్రతి ఐదుగురిలో ముగ్గురికి సమాధిస్థితికి చేరుకునే స్థాయి వున్నది అన్నది ఋషుల అభిప్రాయము. అయితే ఆ ముగ్గురు సాధన చేస్తేనే ఫలితము కనిపిస్తుందితప్ప ఉత్తుత్తినే నటిస్తే లాభం లేదు. మనిషి మనస్సు సాధన వైపు మొగ్గదు. అదీ ఆశ్చర్యము.

దీన్నే గీతలో శ్రీకృష్ణుడు యిలా అభివర్ణిస్తాడు.

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన మాశ్చర్యవద్వదతి తథైవ నార్యః ।**

**ఆశ్చర్యవచ్చైవనమన్యశ్శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥ (గీత అ॥2, శ్లో॥29)**

**భావము : ఈ ఆత్మను ఒకానొకడు ఆశ్చర్యమైన దానినివలె చూచుచున్నాడు. మఱియొకడు ఆశ్చర్యమైన దానినివలె దీనినిగూర్చి చెప్పుచున్నాడు. అట్లే వేఱొకడు ఆశ్చర్యమైన దానినివలె దీనినిగూర్చి వినుచున్నాడు. అట్లు వినియు, చూచియు, చెప్పియుగూడ ఒకడును దానిని సరిగా తెలిసికొనుటలేదు.**

ఈ విద్యను నేర్చుకున్న వ్యక్తి గురువు అయితీరుతాడు. వ్రజభూమిలో వున్న ప్రతీ గోపాలుడు, గోపిక కృష్ణుని స్వరూపమే. అందఱూ కృష్ణునిస్థాయిలో వున్నవారే. మధుర, బృందావనం భూమిలో ఆ గొప్పదనము నేటికి కనబడుతున్నది. శ్రీరామకృష్ణపరమహంస మధురకికాని, బృందావనమునకుగాని వెళ్ళినప్పుడు సమాధిస్థితిని సహజంగా పొందేవాడు. అక్కడి ప్రతి అణువులోను శ్రీకృష్ణుని దర్శించాడు ఆయన. ఆయనకు ఆ జ్ఞానము వున్నదికాబట్టి సులభంగా సమాధిస్థితిని పొందాడు. లేనివారు అభ్యాసం ద్వారా పొందవచ్చు. అభ్యాసం చేసేముందు తగు జ్ఞానము సంపాదించుకోవాలి.

ఆయుర్వేదంలో ఒక విషయమును వైద్యులు కచ్చితంగా చెబుతారు.అదేమిటంటే మిమ్మల్ని ఒక పాము కాటేసిందనుకోండి. ఆ విషమునకు విరుగుడు ఆ చుట్టుప్రక్కలే యెక్కడో వుంటుంది. అయితే ఆ ఆకుకానీ లేక దానికి విరుగుడుగాని తెలియకపోతే అవి అక్కడే వున్నా నువ్వు  కనిపెట్టలేవు. అలాగే బృందావనం, మధులలో ప్రతి అణువు కృష్ణచేతనత్వమును వెలువరిస్తువుంటుంది. దర్శించగలిగేవారికి ఆవిధమైన దర్శనమే అవుతున్నది. లేనివారికి లేదు.

భారతభూమి గొప్పదన మేమిటంటే యిక్కడ మీ చేతనత్వమును సులభంగా మార్చుకునేందుకు ఋషులు అనేక సిద్ధక్షేత్రములను, తీర్థస్థలాలను తమ తపశ్శక్తితో అభివృద్ధి చేశారు. తెలిసివెళ్ళినా, తెలియకవెళ్ళినా యెంతో కొంత వెళ్ళినవారి చేతనత్వంలో మార్పువస్తుంది. రావడము తథ్యము. ఋషుల ఆ శక్తి అంత గొప్పది. తెల్సివెళితే ఫలితము యింకా యెక్కువగా వుంటుంది. పూర్వకాలంలో ఆ సిద్ధస్థలాలకు, తీర్థస్థలాలకు వెళితే వారి పాపాలు పోయేవి, అనుకున్న కోరికలు తీరేవి, సమస్యలు తొలగిపోయేవి. ఎందుకు అలా జరిగేదంటే అక్కడకు వెళ్ళినవారుకూడ కొంత జ్ఞానమును కలిగివుండేవారు. అక్కడున్న సాధకులు లేదా యోగులు లేదా సిద్ధపురుషులు ఆ స్థల ప్రాముఖ్యతను, దాని వైశిష్ట్యమును అక్కడికి వచ్చినవారికి తెలియజేసేవారు. వెళ్ళినవారు లక్ష్యము తెల్సి వెళితే, ఆ ప్రాంతంలో వున్నవారు లక్ష్యప్రాప్తికి యేమి చేయాలో విపులంగా చెప్పేవారు. నేటి పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నంగా వున్నది. తీర్థస్థలాలకు వెళ్తున్నవారు యెందుకు వెళ్తున్నారో వారికే తెలియదు. తెల్సివెళ్ళిన అక్కడ తీర్థస్థల ప్రాభవమును, ప్రాశస్త్యమును చెప్పేవారూ అరుదు. దొందూదొందే!!

సరే సాధకుడు పంచతత్త్వముల మీద ఆధిపత్యమును సాధించుకున్నాడు. అంటే మానసికజగత్తులో అర్జునస్థితిలోకి వచ్చాడన్నమాట. తర్వాత మాయాశక్తిని వుపయోగించుకునే స్థితికి ఎదగాలి. అంటే శ్రీకృష్ణుని స్థితి అన్నమాట.

శ్రీకృష్ణుని చేతిలో యెప్పుడు మురళి వుంటుంది. మెడలో స్టెతస్కోప్ వుంటే వైద్యుడు అంటాము. అలాగే చేతిలో మురళి వుంటే ఆ వ్యక్తి ప్రాణాయామ సాధనలో అత్యంత నిష్ణాతుడు అని ఆధ్యాత్మికజగత్తు తెలియజేస్తుంది. ప్రాణాయామంలో ఎంత నిష్ణాతులు కావాలంటే మీ శ్వాస మేరుదండం మీద మీరు యే రాగము పలికించాలనుకుంటే ఆ రాగమును పలికించాలి.

అలాగే కృష్ణుడు గరుడాసనంలో వుంటాడు. ప్రాణాయామంలో నిష్ణాతులు కావాలంటే దానికి తగిన ఆసనం కూడ వేయాలి. ప్రాణాయామంలో శ్రీకృష్ణుడి కున్న ప్రావీణ్యం రావాలంటే గరుడాసం సరిగ్గా వేయాలి. ప్రాణాయామం సరిగా చేస్తే గాలిలోకి యెగురవచ్చు. విష్ణుమూర్తి వాహనం గరుడుడు. ఆయన దానిమీద గాలిలో విహరిస్తువుంటాడు.

వైష్ణవక్షేత్రాలలో గరుడాసనం వేస్తే ఫలితము అమోఘంగా వుంటుంది. అది క్షేత్రమహిమ. శివుణ్ని ఆరాధించాలంటే శైవక్షేత్రానికి వెళ్ళాల్సిందే. ఋషులు తీర్థక్షేత్రములను, దేవాలయములను ఆవిధమైన వుద్దేశ్యంతో యేర్పాటుచేశారు. చేతనత్వవిజ్ఞానంలో ఒకొక్క క్షేత్రానికి ఒక్కొ ప్రాముఖ్యత వుంటుంది. ఇనుము కావాలంటే ఇనుము లభించే గనికి వెళ్ళాలి. అలాగే విష్ణుతత్త్వమును అర్థము చేసుకోవాలంటే వైష్ణవక్షేత్రానికి వెళ్ళాల్సిందే. శివుడిని అర్థము చేసుకోవడానికి శైవక్షేత్రమును దర్శించాల్సిందే.

అయితే యీ క్షేత్రదర్శనాలకి ముందు సాధకులకు తప్పకుండా ఆసనప్రాణాయామాల మీద కనీస ఆధిపత్యము వుండితీరాల్సిందే. లేకపోతే ఫలితము రాదు. ఏ దేవాలయమునకుగాని లేదా తీర్థక్షేత్రమునకుగాని వెళితే ఆ దైవమునకు సంబంధించిన శక్తి మీలోకి ప్రవేశించాలంటే తప్పకుండా ఆ దేవత యే ఆసనం మీద కూర్చుని వున్నదో మీరు ఆ ఆసనం వేయడంలో నిష్ణాతులయి తీరాల్సిందే. ఆసనప్రాణాయామాల ఆధిపత్యము లేకుండా ఎందుకు దేవాలయమును దర్శించడము? దైవీశక్తితో మీరు అనుసంధానింపబడాలంటే తప్పక ఆ దేవత యే ఆసనంలో కూర్చుని వున్నదో మీరూ అదే ఆసనంలో కూర్చోగలగాలి. ఉదా॥ సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహం కోరుకునే భక్తుడు లేక సాధకుడు మయూరాసనంలో కుశలత్వమును సాధించాలి. విష్ణువుని పట్టుకోవాలంటే గరుడాసనంలో నిష్ణాతులవ్వాల్సిందే.

దేవాలయములను చేతనత్వవిజ్ఞానకేంద్రములుగా తీర్చిదిద్దారు ఋషులు. దేవాలయములలో ఒకప్పుడు చేతనత్వవిద్యను బోధించేవారు.

మనిషి భూమ్మీద యెందుకు పుట్టాడు? అనే ప్రశ్న వస్తే దానికి జవాబు చేతనత్వవిద్యను నేర్చుకుందుకు అని చెప్పాలి. అందుకే భాగవతం మొదలులోనే కృష్ణం వన్దే పృథాసుతం అన్నారు. పృథ్వీమీద తప్ప యింకెక్కడ మనిషిలాంటి ప్రాణి లేదు. ఇంతటి విలక్షణమైన మనిషి చేతనత్వవిజ్ఞానంలో అణువునుండి మొదలుకొని బ్రహ్మాండంవఱకు యెదుగవచ్చు. బ్రహ్మవఱకు యెదిగిన సాధకుడికి సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, సర్వసమర్థత లభిస్తాయి. ఋషులు, మునులు, యోగులు, గురువులు యీ స్థాయిలో వుంటారు. వీరికి దేవతల భవిష్యత్తుకూడ తెలుసు. అసలు దేవతలు వీరి అధీనంలో వుంటారు. అవసరమైతే మనిషి దేవతలకు కూడ సహాయపడగల సామర్థ్యము కలవాడు. పూర్వకాలంలో అలా జరిగిన సంఘటనలు వున్నాయి. పురాణాల్లో మనకు కొన్ని వుదాహరణలు లభిస్తాయి. ఉదా॥ దశరథుడు. అలాగే యుగసంధి సమయంలో మనిషికి తిరిగి అలాంటి అద్భుత అవకాశం లభించింది. స్వయంగా మహాకాలుడే మనిషి సహాయంకోసం పిలుపునిచ్చాడు. అంతటి మహత్తర అవకాశం లభించినా మనిషి తన కోరికలు తీరడంకోసం దేవతలను అడుక్కుంటున్నాడు తప్ప దైవం పిలుపును వినడంలేదు. బిక్షగాడికి విలువ వుండదుకదా?

ఆ స్థితినుండి దేవతలకు సహాయం చేసే స్థితికి యెదుగవల్సిన అవసరంకూడ యీ యుగసంధి సమయంలో వున్నది.

అయితే మనిషి దేవతలకు సహాయం చేయడానికి తగిన అర్హతను కల్గివుండాలన్నదికూడ వాస్తవము. ధైర్యమును ప్రదర్శించాలి. మనిషి నేడు తన స్వార్థమనే సాలెగూడులో చిక్కుకుని అదే సర్వస్వము అనుకుంటున్నాడు. ధైర్యం చేసి బయటికి రావడానికికూడ ప్రయత్నించడంలేదు. దాన్నుండి బయటపడాలంటే భయము, హృదయదౌర్బల్యము అతడిని వివశుడిని చేస్తున్నాయి. ముందు వాటినుండి బయటపడితే అప్పుడు మహాకాలుని పిలుపుసంగతి.

క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।

క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప ॥ (గీత అ॥2. శ్లో॥3)

**భావము ః ఓ అర్జునా! అధైర్యమును పొందకుము. ఇది నీకు తగదు. నీచమగు యీ మనోదుర్బలత్వమును వీడి యుద్ధము చేయుటకు లెమ్ము.**

కృష్ణుడు అర్జునుడిని పిఱికితనమును వీడి, హృదయదౌర్బల్యమును వదిలి యుద్ధము చేయమని వుద్బోధించాడు. అలాగే యీనాడు గురువులు మహాకాలుని ఆదేశం మేఱకు యుగమును మార్చడానికి మనిషి చేయిని తమ చేతులలో కలుపమని అడుగుతున్నారు. క్షుద్రమైన భౌతికసుఖలాలసలో పడి బలహీనులై మహాకాలుని పిలుపుని అందుకోలేని మానవజాతి దురదృష్టమును యేమనగలము?

ఒక లక్ష్యము పెట్టుకుని పని చేయాలి అంటే దానికి కొన్ని నియమాలు, పద్ధతులు వుంటాయి. వాటికి అనుగుణ్యంగ పనిచేయాలితప్ప నా యిష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తానంటే కుదరదు. యుద్ధము చేయడానికి సైనికుడికి శిక్షణ అవసరము. అలాగే మహాకాలుని సైన్యంలో పనిచేయడానికి మనిషి కొన్ని అర్హతలు సంపాదించుకోవాలి. ముందుగా సాధకుడిగా మారాలి. ఆసన ప్రాణాయామాలు అతనికి నిత్యకృత్యమవ్వాలి. ఆహారనియమాలను పాటించాలి.

ఇలా సాధన చేస్తూవుంటే యెప్పటికోప్పటికి సాధకుడు పృథాసుతం అనే అర్జునస్థితినుండి ద్వైపాయనస్థితికి, ప్రజప్రియస్థితికి, ఆ తర్వాత నారాయణస్థితికి యెదుగుతాడు.

ఇవి నాలుగు మనిషి సాధించవల్సిన నాల్గుస్థితులు. ఇవి సాధించడానికే మనిషి భూమ్మీద జన్మించాడు. దేవతలు కూడ యీ స్థితులను పొందటానికి మానవజన్మ రావాలి అని కోరుకుంటారు.

ఈ స్థితులను సాధించాలంటే గురువును ఆశ్రయించాల్సిందే. గురువు బోధిస్తాడు. శిష్యుడు వింటాడు. భౌతికవిద్య నేర్చుకోవాలన్నా ఉపాధ్యాయుడు బోధిస్తుంటే; విద్యార్థి మౌనంగా కూర్చుని వింటాడు. విద్య వస్తుంది. ఆధ్యాత్మికవిద్యకూడ అంతే. ఆధ్యాత్మికజగత్తులో వినేవ్యక్తిని శౌనకుడు అంటారు. చెప్పేవ్యక్తిని సూతుడు అంటారు. శ్రోతకి తాను వింటున్న విషయం పట్ల ఆసక్తి వుండాలి. ఆసక్తి లేకపోతే యెంత గొప్ప వక్త చెబుతున్నా అది వృథాయే! శ్రోతకు కథామృత రసాస్వాదకుశలః- అనే గుణము వుండాలి. శ్రోతకు యీ లక్షణము లేకపోతే యెంత గొప్ప వక్త చెప్పినా వృథాయే. వక్త, శ్రోత యిద్దఱూ సమవుజ్జీలుగా వుండి తరించిన సంఘటన మహాభారతంలో చోటుచేసుకున్నది. ఆ సంఘటలనో అటు శ్రోత, ఇటు వక్త యిద్దఱూ చరిత్రలో నిలిచిపోయారు. వారే శుకమహర్షి, పరీక్షిత్తు. ద్రోణుడు ఏకలవ్యుడు, అర్జునులను ఉదాహరణగా తీసికోవచ్చు. ఏకలవ్యునిలో శ్రోత కుండవల్సిన లక్షణము పరిపూర్ణంగా వున్నది. అందుకనే సాక్షాత్తు గురువు దగ్గఱ విద్య నేర్చుకున్న అర్జునుడికన్నా గురుప్రతి దగ్గఱ విలువిద్యను అభ్యసించిన ఏకలవ్యుడు గొప్పవాడయ్యాడు. శ్రోతకు చెప్పబడుతున్న విషయంపట్ల ఆసక్తి అంతలాగ వుంటే అప్పుడు ఫలితము 100% వుంటుంది. భక్తుడికి భగవంతునిపట్ల యెంతలాగ వుంటుందో శ్రోతకు శ్రవణము చేయడంలో అంత భక్తి వుండాలి. భక్తి అంటే ఆలోచనలు ఘనీభవించిన స్థితి. ఒక లక్ష్యమును పెట్టుకుని దానిమీదే దృష్టిని కేంద్రీకరించి పనిచేయడం. ఇంక అదితప్ప మిగతావి పట్టవు. మీ భక్తి దేనిమీద వుంటే మీరు అదే అయిపోతారు. ఆ భక్తి వుంటే ఆ భక్తియొక్క ఫలితము తప్ప యింక యేమిపోయినా, వచ్చిన మీరు పట్టించుకోరు. లక్ష్యము యేదైనా ఆ లక్ష్యము మీద భక్తి వుండాలి. ఉంటే యేది లభించినా, ఏది పోయినా పట్టించుకోరు.

భాగవతంలో భక్తిని యువతితో పోలుస్తారు. నారదుడు యువతిగా వున్న భక్తిని కలిశాడుట. మీ భక్తి దేనిమీదున్నదో అది లభించకపోతే 'ఇంక యీ జీవితం వృథా' అనే అనే మానసికస్థితి వుండాలి. ఎలాంటి ఆహారము తీసుకుంటే అలాంటి మనస్సే యేర్పడుతుంది అని ఋషులు యేనాడో చెప్పారుకదా? కనుక భాగవతంలో చెప్పినట్లుగా భక్తి మీలో యువతిగా వుండాలంటే మీ ఆహారంలో కచ్చితంగా ఋషులు సూచించిన మార్పు వచ్చితీరాల్సిందే. ఆహారం మారితే చేతనత్వము మారుతుంది. ఆహారం మారితే శరీరంలోని నాడులు మారుతాయి. రక్తప్రసరణ మారుతుంది. దానితో ప్రాణశక్తి ప్రభావితమౌతుంది. అప్పుడు మీ చేతనత్వంలో మార్పు సంభవిస్తుంది. ఇవన్నీ సరిగా వుంటే మనిషి మనస్సు మారటానికి కేవలం ఒక చిన్న మాట చాలు. ఉదా॥ నారదుడు చెప్పిన ఒక చిన్న మాట ధృవుడిని ధృవతారగా నిలిపింది. అది యీనాటికి ఆకాశంలో నిలిచి దిశానిర్దేశ్యము చేస్తూనేవున్నది. ఏ యుగంవాడు ధృవుడు? మఱిప్పటికి ఆకాశంలో శోభాయమానంగా వెలుగుతున్నాడుకదా?

ముందు ఆహారము మారాలి. మారిన తర్వాత ఆసనాలు వేయాలి. దానితో మనస్సులో మార్పువస్తుంది. ఆసనాలతో పాటు ప్రాణాయామంకూడ అభ్యసించాలి. ఆసనాలు ఏమి చేస్తాయంటే - ప్రాణశక్తిని కావల్సిన దిశలోకి మళ్ళించగలిగే శక్తిని ప్రసాదిస్తాయి. శరీరంలోని 72,000 నాడుల్లో ప్రాణశక్తి ప్రవాహిస్తే మనిషి వ్యాసస్థితిలోకి వస్తాడు. ఆహారం, ఆసనప్రాణాయామాలు ఒకదానికొకటి అనుసంధానింపబడివుంటాయి. మనస్సు మారటానికి ఆహారం మారాలి. ప్రాణశక్తిని సరిచేయడానికి ఆసనాలు, ప్రాణశక్తిని పెంపొందింపజేయడానికి ప్రాణాయామము చేయాలి. ఇలా ఇవి చేస్తూ వుంటే మీరు యేది వింటే అది కర్ణరసాయనమే అవుతుంది. నారాయణ కీర్తనే అవుతుంది. చెవులలో యే శబ్దంపడినా అది కర్ణరసాయనమే అవుతుంది.

**అజ్ఞానధ్వాన్తవిధ్వంసకోటిసూర్యసమప్రభ ।**

**సూతాఖ్యాహి కథాసారం మమ కర్ణరసాయనమ్ ॥ (శ్లో॥ 4)**

**భావము : హే సూతమహాశయా! నీయొక్క జ్ఞానము అజ్ఞానాంధకారమును నశింపజేయు కోటిసూర్యులకు సమానము. మీరు మా చెవులకు అమృతోపమయమైన సారగర్భితమైన కథను వినిపించండి.**

**భక్తిజ్ఞానవిరాగాప్తో వివేకో వర్ధతే మహాన్ ।**

**మాయామోహనిరాసశ్చ వైష్ణవైః క్రియతే కథమ్ ॥ (శ్లో॥ 5)**

**భావము : భక్తి జ్ఞాన వైరాగ్యాలు పొందినప్పుడు వచ్చే మహావివేకంయొక్క వృద్ధి యెలా జరుగుతుంది? మఱియు వైష్ణవులు మాయామోహం నుండి ఏవిధంగా బయటపడతారు?**

భక్తి - జ్ఞానము - వైరాగ్యము : ఆధ్యాత్మికజగత్తులో యిదొక త్రిపుటి. భక్తి దేనిమీదుంటే తత్సంబంధిత జ్ఞానము లభించితీరుతుంది. లక్ష్యము వుంటే, భక్తి వుంటే దానికి కావల్సిన జ్ఞానము మీరు తప్పక సంపాదించుకుంటారు. ఉదా॥ మీ పిల్లవాడిని ఇంజనీర్‌ని చెయ్యాలి అనే లక్ష్యమున్నది మీకు. అంటే మీ భక్తి ఇంజనీరింగ్ మీద వున్నది. దానితో ఎలా లక్ష్యమును సాధించాలి? అనే ఆలోచన మొదలౌతుంది. రకరకాల ఆలోచనలు చేస్తారు. ఎలాగోలా ఇంజనీరింగ్‌లో సీటు సంపాదిస్తారు. దానికోసం అవసరమైనన్ని మార్గాలు అనుసరిస్తారు. ఎప్పుడైతే లక్ష్యము లేదా భక్తి అనేది యేర్పడిందో వైరాగ్యము మీకు తెలియకుండానే మీలోకి ప్రవేశిస్తుంది.

ఇంజనీరింగ్ మీ లక్ష్యము. మీ పిల్లవాడు కళాశాలనుండి యింటికి వస్తాడు. అదే సమయంలో మీరు యేదో పనిచేసుకుంటున్నారు. పిల్లవాడు ఆ పనిలో సహాయం చేయడానికి వస్తాడు. మీరు వెంటనే వద్దు వెళ్లి హాయిగా స్నానం చేసి కాసేపు విశ్రాంతి తీసుకుని చదువుకో అని చెబుతారుతప్ప ఆ పనిని చేయనివ్వరు. అంటే మిగతావిషయాలపట్ల వైరాగ్యము దానంతట అదే వస్తుంది. వైరాగ్యము = భక్తి+జ్ఞానము. అలాగే వివేకము అంటే నువ్వు ఏ లక్ష్యమును పొందాలనుకుంటున్నావో దానికోసం మిగతావాటిని వదిలేసుకోవాలి అనే జ్ఞానము.

ఈ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను వుపయోగించుకుని చిన్నచిన్న లక్ష్యములను, కోరికలను కాదు సాధించవల్సినది. గురుచేతనత్వంలోకి ప్రవేశించాలి.

అర్జునుడికికూడ వైరాగ్య మొచ్చింది. అయితే అది వివేకంతో కలిసిందిగనుక కృష్ణుడు చెప్పిన పనిచేశాడు.

**ఇహ ఘోరే కలౌ ప్రాయో జీవశ్చాసురతాం గతః ।**

**క్లేశాక్రాన్తస్య తస్యైవ శోధనే కిం పరాయణమ్ ॥ (శ్లో॥ 6)**

**భావము : ఈ ఘోరకలియుగంలో జీవులు అసురీ స్వభావం కలవారు. వివిధ క్లేశాలతో ఆక్రాంతులైన ఆ జీవులను పరిశుద్ధులనుచేయడానికి సర్వశ్రేష్ఠ వుపాయం బెట్టిది?**

భాగవతమును అందఱూ ఒకే వుద్దేశ్యంతో చదవరు. మనుష్యుల మనస్సులనుబట్టి ఉద్దేశ్యాలు మారుతాయి.

**శ్రేయసాం యద్భవేచ్ఛ్రేయః పావనానాం చ పావనమ్ ।**

**కృష్ణప్రాప్తికరం శశ్వత్సాధనం తద్వదాధునా ॥ (శ్లో॥ 7)**

**భావము : సూతమహాశయా! అన్నింటికంటే కళ్యాణకరమైనది, పవిత్రము చేయువాటన్నింటిలోకి పవిత్రమైనది, శ్రీకృష్ణప్రాప్తి యిచ్చేట్టి శాశ్వత సాధన నీనాడు మీరు మాకు చెప్పండి.**

ఒకప్పుడు భరతభూమిలో యీ విద్యే చెప్పబడేది. గురుకులాల్లో, విశ్వవిద్యాలయాల్లో యోగవిద్య చెప్పబడేది. నేడు భౌతికవిద్యకుమాత్రమే ప్రాధాన్యత వున్నదితప్ప ఆత్మవిద్యకు పెద్దపీఠం వేయలేకపోతున్నాడు మనిషి. ఏ కాలంలో అయినాసరే కొంతమంది ఆ విద్యను పొందుతూనేవున్నారు. ఉదా॥ శిరిడిసాయి, సత్యసాయి, శ్రీరామశర్మఆచార్య మొదలువారు యీ విద్యలో కుశలురు.

**చిన్తామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసమ్పదామ్ ।**

**ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుణ్ఠమ్ యోగిదుర్లభమ్ ॥ (శ్లో॥ 8)**

**భావము : చింతామణి కేవలం లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము అధికాధికమైన స్వర్గీయ సంపత్తుల నిస్తుంది. కానీ గురుదేవులు ప్రసన్నులైతే యోగులకుకూడ దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం యిస్తారు.**

వైకుంఠధామమును అందించే యోగవిద్యతప్ప నాకు యింకేమీ అక్కర్లేదు అనే స్థితికి సాధకుడు యెదగాలి.

**అనన్యాశ్చిన్తయన్తోమాం యే జనాః పర్యుపాసతే ।**

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ (గీత అ॥9, శ్లో॥22)**

**భావము : ఎవరు అనన్యప్రేమికులయిన నా భక్తులై పరమేశ్వరుడనగు నన్ను నిరంతరము స్మరించుచూ నిష్కామభావంతో భజించుచుందురో, నిరంతరము చింతించుచుందురో అట్టివారల యోగక్షేమముల నేను స్వయంగ ప్రాప్తింపజేయుదును.**

భగవంతుని మీద అనన్యశ్చింత వున్న వ్యక్తి సర్వబాధ్యతలు ఆ పరంధామునివే. సర్వబాధ్యతలు ఆయన మీదే పెట్టానుగదా అని మనిషి తను నిర్వర్తించవల్సిన బాధ్యతలను నిర్వర్తించకుండా నిర్లక్ష్యము చేస్తే కుదరదు. గురువులు తమ జీవితాలలో యే బాధ్యతను వదలలేదు. అన్నీ పూర్తిగా నిర్వహించారు.

ఉదా॥ గురుదేవులు శ్రీరామశర్మఆచార్య, మాతా భగవతీదేవిలు మథుర వదిలి హరిద్వార్ వచ్చేముందు తమ యిద్దఱి కూతుళ్ళ వివాహములు చేశారు. హరిద్వార్ ఆశ్రమ నిర్మాణానికి తమ ధనమునే వెచ్చించారు. గురుదేవులు తమకు సంక్రమించిన జమిందారి ఆస్తిని ఆశ్రమనిర్మాణానికి వెచ్చిస్తే; మాతాజీ తమ నగలను వెచ్చించారు. వారు యెవరి సహాయం ఆ సమయంలో అర్థించలేదు. ఎవరు సహాయం చేసిన చేయకపోయినా వారు తమ లక్ష్యమును చేరుకునేవారే. అందులో సందేహం లేదు.

ఇతరులమీద ఆధారపడి జీవించేవారు, బాధ్యతలను విస్మరించేవారు ఆధ్యాత్మికజగత్తుకు తగరు. ఎందుకంటే ఆధ్యాత్మికజగత్తులో బాధ్యతలు పెరుగుతాయితప్ప తరగవు.

అర్జునుడుకూడ మహాభారతయుద్ధము అనే బాధ్యతనుండి తప్పించుకోవాలనే ప్రయత్నించాడు. కృష్ణుడు ఆ ప్రయత్నాలను సాగనివ్వలేదు. చేతనత్వవిద్యద్వారా అతడిని కార్యోన్ముఖుడిని చేశాడు. ఆ చేతనత్వవిద్య తెలిసున్న గురువుల దగ్గఱికి ఎవరైనా రావల్సిందే. ఆ విద్య అందించే శక్తి అంత గొప్పదిమఱి. సత్యసాయి దగ్గఱికి దేశప్రధానులు సైతం తమ తమ సమస్యలను తీర్చమని వస్తారు. పూర్వకాలంలో రాజులకి యేదైనా సమస్య వస్తే పరిష్కారంకోసం ఋషులు, గురువులు, మునులను ఆశ్రయించేవారు.

అంత గొప్పదైన చేతనత్వవిద్య నేర్చుకోవడం శుద్ధదండుగ అని యీనాడు మనిషి అనుకుంటున్నాడు. ఎందుకంటే మనిషి ఆలోచనలు అంత అపవిత్రంగా వున్నాయిగనుక. చదువురాని వ్యక్తులు అధికారం చలాయించే రోజులివి. విద్య రానివ్యక్తి విద్యాశాఖామంత్రి. ఇంక ఆయన పాలన యే స్థాయిలో వుంటుందో వూహించండి. ఈ పరిస్థితి మారాలి. మారటానికి మనమేమి బాహ్యమైన యుద్ధం చేయనవసరం లేదు. అంతర్గతయుద్ధం చేసినా చాలు ఫలిత మొస్తుంది.

రావణాసురుడు పెట్టే బాధలు భరించలేకపోయారు ఋషులు. వారు సర్వశక్తిమంతులైనప్పటికి భగవంతుడైన విష్ణువును ఆశ్రయించారుతప్ప తమ శక్తిని ప్రదర్శించలేదు. ఎందుకంటే అది వారి పనికాదుగనుక. పరిపాలనాకర్త విష్ణువు బాధ్యత అది. ఆయనకే వదిలేశారు ఆ పని. అయితే వూరికనే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోలేదు. భగవంతుడు తన కార్యమును నిర్వర్తించడానికి తగిన భూమికను సమకూర్చిపెట్టారు. వనరులను సమకూర్చారు. ఋషుల పనియేమిటంటే 'ఏది సత్యమో ఆ సత్యమును ఆశ్రయించి జీవిస్తూ బాహ్య ప్రపంచము ఎలా జీవిస్తున్నా, తాము మాత్రం ఆ మార్గంలోనే జీవించేవారు. బయటి ప్రపంచంకోసం వారు తమ పంథాను మార్చుకోరు.

విశ్వామిత్రుడు యజ్ఞం ఆరంభించాడు. రాక్షసులు వచ్చి యజ్ఞాన్ని ధ్వంసం చేస్తున్నారు. తను రాక్షసులను సంహరించగలిగే శక్తిమంతుడైనప్పటికి యాగరక్షనార్థం శ్రీరాముని తనతో పంపమని దశరథుడిని అడిగాడు.

దశరథుడుకూడ మనలానే భయపడి పంపనన్నాడు. నా కొడుకును రాజును చేస్తాను. రాజ్యమును పాలించుకుంటూ పెళ్ళిచేసుకుని పిల్లాపాపలతో కలకాలం సుఖంగా జీవిస్తాడు. నీతో పంపితే కష్టము. కనుక పంపను అన్నాడు. ఈ

విషయంలో దశరథుడుకూడ సామాన్యమైన తండ్రిలాగే ప్రవర్తించాడు. మనమూ అంతేగా? గురువుల పనిలో సహాయం చేయమంటే నా కొడుకును చదివించాలి. అతని జీవితమును వుద్ధరించాలి అంటున్నామేతప్ప గురువుల ప్రణాళికలో పాలుపంచుకోవడం లేదు. కుటుంబమును వుద్ధరించాలి అని అనుకోవడంలో తప్పులేదుగాని మనిషి ప్రకృతిచేతిలో, కర్మాధిదేవత చేతిలో ఒక కీలుబొమ్మ అనికూడ మరువరాదు. ప్రారబ్ధానుసారం జీవితాలు సమకూరుతాయి. ఈ విషయము తెల్సినా దశరథుడులాంటి రాజుకూడ విశ్వామిత్రునితో రాముడిని పంపించడానికి యిష్టపడలేదు.

విశ్వామిత్రుడు స్పష్టంగానే చెప్పాడు. 'ఈనాడు ఆసురీప్రవృత్తులు విజృభించాయి. వాటిని అంతం చేయడానికి నీ కుమారుని సహాయం నాకు కావాలి' అని అడిగాడు. అయినా దశరథుడు పంపను అని వాదిస్తుంటే అప్పుడు ప్రక్కనే వున్న వశిష్ఠుడు కలుగజేసుకుని నీవల్ల అయ్యేపనికాదిది. రాముడిని విశ్వామిత్రునితో పంపించు' అని వుపదేశిస్తాడు. రాజగురువు ఆదేశంతో దశరథుడు యాగరక్షణార్థం రాముడిని - విశ్వామిత్రుని వెంట పంపుతాడు.

రాక్షసులు అంటే మానసికబలహీనత కలిగున్నవారు. చెడు అలవాటు వుంటే దాన్ని వదులుకోలేని మానసిక బలహీనత వున్నవారిని రాక్షసులు అనడం సమంజసము.

**ఇహ ఘోరే కలౌ ప్రాయో జీవశ్చాసురతాం గతః ।**

**క్లేశాక్రాన్తస్య తస్యైవ శోధనే కిం పరాయణమ్ ॥ (శ్లో॥ 6)**

**భావము : ఈ ఘోరకలియుగంలో జీవులు అసురీ స్వభావం కలవారు. వివిధ క్లేశాలతో ఆక్రాంతులైన ఆ జీవులను పరిశుద్ధులనుచేయడానికి సర్వశ్రేష్ఠ వుపాయం బెట్టిది?**

కలియుగంలోని మనుష్యులు అలవాట్లకు బానిసైయున్నారు. వారు యెలా వుద్ధరింపబడతారు?

**చిన్తామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసమ్పదామ్ ।**

**ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుణ్ఠమ్ యోగిదుర్లభమ్ ॥ (శ్లో॥ 8)**

**భావము : చింతామణి కేవలం లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము అధికాధికమైన స్వర్గీయ సంపత్తుల నిస్తుంది. కానీ గురుదేవులు ప్రసన్నులైతే యోగులకుకూడ దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం యిస్తారు.**

భాగవతము గురుచరిత్రే. అది చేతనత్వవిద్యను నేర్పుతుంది. జగద్గురుచేతనత్వమును చెబుతుంది భాగవతం. జగద్గురు చేతనత్వ మంటే అందఱి గురువుల చేతనత్వము. గురువు చేతనత్వము శిష్యునిలోని అజ్ఞానమును పోగొడుతుంది. ఈ విషయము అందఱికి తెల్సినదేకదా! మనిషిలోని అజ్ఞానము అతనికి తాడుని - పాములా భ్రమింపజేస్తుంది. అది పాముకాదు, త్రాడని తెల్సినవ్యక్తి అది త్రాడేకాని, పాము కాదు అని చెబుతాడు. త్రాడు పాములా కనబడటము మాయ.

కొడుకు చనిపోయాడు. తల్లిదండ్రులు బాధపెడుతున్నారు. వారి దగ్గఱికెళ్ళి 'బాధపడకండి. ఎవరికి యెవఱు. మీ మోహంవలన మీకు బాధకలుగుతున్నది. మోహం పోగొట్టుకోండి' అనివుచిత సలహా యిస్తారు చాలామంది. వారుమాత్రము మోహమును అంటిపెట్టుకునే వుంటారు. ఈ మాయ, మోహం నుండి బయటపడితే యెంత శాంతి లభిస్తుందో! అందుకనే భగవంతుడు జీవులకి నిద్రను ప్రసాదించాడు. నిద్రలో యీ బాధలు, మాయలు, మోహాలు యేమి వుండవు. హాయిగా శాంతంగా నిద్రపోతుంటారు. నిద్రలేచాక అన్నీ మళ్ళీ మామూలే. కనుకే మనిషికి నిద్ర అత్యంత అవసరము. మనిషి మూడురోజులు వరుసగా నిద్రపోకపోతే దాదాపు పిచ్చెక్కిపోతాడు. శాంతస్థితి యెంత గొప్పదో తెలియజేయడానికి

ప్రకృతి నిద్రాదేవిని సృజించినా మెలకువగా వుంటూనే శాంతస్థితిని అనుభూతి చెందడమే నిజమైన లక్ష్యము. మెలకువగా వుండికూడ శాంతస్థితిని అనుభూతి చెందాలి. యోగులు యీ అనుభూతిని పొందుతారు. అందుకే గీతలో కృష్ణుడు యిలా అంటాడు.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।

యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ (గీత అ॥2. శ్లో॥69)

**భావము : సమస్త ప్రాణులకును ఏది రాత్రి యై యున్నదో, దానియందు ఇంద్రియనిగ్రహపరుడగు యోగి మేలుకొనియుండును. దేనియందు ప్రాణులు మేలుకొనియున్నారో అది పరమార్థతత్త్వమును దర్శించు మునీంద్రునకు రాత్రిగా నుండును.**

అందుచేత సామాన్యమానవుని నిద్ర యోగికి మెలకువస్థితి. మన మెలకువస్థితి యోగికి నిద్రాస్థితి. భగవంతుడు నిద్రమత్తును వదలండి అని అనేక జన్మలబట్టీ చెబుతూనే వున్నాడు. ఒక జన్మలోనే యోగివి కమ్మని అనేకసార్లు లేపాడు భగవంతుడు, అయినా నువ్వు నిద్రనుండి లేవలేదు. ఆయన ఓపిక నశించి ఒక్క కుదుపుకుదిపాడు. నీకు యేదో ఒక జబ్బు చేసి మరణిస్తావు. మఱల మఱో జన్మ. ఎన్ని జన్మలెత్తినా మనిషి భగవంతునితో అనుసంధానింపబడవల్సినదే. చేతనత్వవిద్యలో నిరంతరము దానిగూర్చే ఆలోచిస్తుంటే తప్పక భగవంతుని కుదుపు మనకు తెలుస్తుంది. దానితో మన చేతనత్వంలో మార్పువస్తుంది.

అయితే చేతనత్వవిద్యను ప్రసాదించే గురువు మనిషిలోనే వుంటాడు. బాహ్యజగత్తులో గురువుని యెన్ని సంవత్సరాలు వెదకినా లభించడు. ముందు అంతర్జగత్తులో ఆయన సాక్షాత్కారం లభిస్తుంది. తర్వాత భౌతికదర్శనము లభిస్తుంది.

**సూత ఉవాచ : సూతుడు ఇలా అన్నాడు**

ప్రీతిః శౌనక చిత్తేతే హ్యతో వచ్మి విచార్యచ ।

సర్వసిద్ధాన్తనిష్పన్నం సంసారభయనాశనమ్ ॥ (శ్లో॥ 9)

**భావము : హే శౌనకా! నీ హృదయంలో భగవానునిమీద ప్రేమ వున్నది. అందువల్ల నేను బాగుగా ఆలోచించి, సంసార భయనాశనకారము, సర్వసిద్ధాంత నిష్పన్నము, నిష్కర్షము లేక సమస్త సిద్ధాంతసారమైన దానిని నీకు చెప్పుచున్నాను.**

ఆధ్యాత్మికజగత్తులో శిష్యుడు - గురువుని యేదైనా ప్రశ్నవేశాడు అంటే ఆ ప్రశ్న యేమిటో తెలియకుండానే వేశాడన్నమాట. గురువు సర్వజ్ఞ, సర్వవ్యాపక, సర్వసమర్థ స్థితిలో వుంటాడు. అలాంటి వ్యక్తిని అంటూ సూతుడిని శౌనకుడు అంటే శిష్యుడు నాకు సంసారభయనాశనము చేసే విద్యయొక్క సారమును చెప్పమని అడిగాడు. దానికి సూతుడు జవాబిస్తున్నాడు.

శిష్యుడికి గురువు యెప్పుడు అవసరము అంటే శిష్యుడు నిస్సహాయస్థితిలో వున్నప్పుడు. శిష్యుడు తనంతటతాను విషయమును తెల్సికోలేనప్పుడు గురువు అవసరము. శిష్యుడు కింకర్తవ్యవిమూఢుడైనప్పుడు గురువు అవసరము.

శౌనకుని ప్రశ్న విన్న సూతునికి 'శౌనకుడు అడుగదల్చుకున్నది ఒకటి, అడుతున్నది మఱోటి' అని అర్థమైనది. అందుకే నీ హృదయం నాకు తెలిసింది. నువ్వు యేమి అడగదల్చుకున్నావో నాకు అర్థమైంది అంటాడు. అందుకే సూతుడిని మహామతి అన్నారు. గురువులు ఆ స్థితిలో వుంటారు.

శిష్యుడు అడిగిన ప్రశ్నకు గురువు తిన్నగా జవాబిస్తే యిద్దఱూ అసమర్థులే. గురువు శిష్యుడు యేమి అడుగదలచుకున్నాడో అది అర్థము చేసుకుని దానికి జవాబియ్యాలి. విషయమును అర్థమయ్యేటట్లు చెప్పాలి. శిష్యుడు అడిగిన ప్రశ్నకు మాత్రమే జవాబిస్తే తర్వాత శిష్యుడు గురువుని విమర్శించే అవకాశమున్నది.

మా అమ్మాయికి వివాహం కావాలి. అబ్బాయికి వుద్యోగం కావాలి...... ఇలా కోరికల పరంపరతో గురువుని ఆశ్రయిస్తారు. గురువు వారి కోరికలను తీరుస్తాడు. అయితే యిక్కడ కోరిక కోరినవారి హృదయంలో యేమున్నది? వారి కోరిక తీరితే వారికి శాంతి లభిస్తుందే అనే ఆశ. ఎవరు యే కోరిక కోరుకున్నా వారికి తెలియకుండానే వారు గురువుని అడుగుతున్నది శాంతినే. ఏ కోరిక కోరినా శాంతి రాదు అనే విషయము మనుష్యులకి అర్థము కావడంలేదు. కోరికల పరంపరకు అంతుండదు. కనుక అశాంతి వుంటూనేవుంటుంది. ఆ కోరికల వెనుకనున్న హృదయమును గురువు పట్టుకుంటాడు. సామాన్యులకు యీ విషయము అర్థము కాదు. గురువుకి మాత్రము మీ హృదయబాధ అర్థమౌతుంది. నువ్వు గురువు దగ్గఱకు యే కోరికతో వచ్చినా, నీ హృదయంమాత్రం నీకు తెలియకుండానే శాంతిని కోరుకుంటున్నది. గురువుకి యీ విషయము స్పష్టంగా తెలుసు. సూతుడుకూడ యీ విషయమునే చెబుతాడు శౌనకుడికి. నీ హృదయము నాకు అర్థమైంది అంటాడు అందుకే.

**భావము : హే శౌనకా! నీ హృదయంలో భగవానునిమీద ప్రేమ వున్నది. అందువల్ల నేను బాగుగా ఆలోచించి, సంసార భయనాశనకారము, సర్వసిద్ధాంత నిష్పన్నము, నిష్కర్షము లేక సమస్త సిద్ధాంతసారమైన దానిని నీకు చెప్పుచున్నాను.**

సంసారజీవితంలో అనేక భయాలుంటాయి. సంసారంలో, ప్రపంచంలో నీకు యేవిధమైన భయ మున్నా ఆ భయము పోవడానికి మార్గమును చెబుతాను. ప్రపంచంలో అనేకరకాలైన సిద్ధాంతము లుంటాయి. ఒకవేళ ఆ సిద్ధాంతాలు ఒకదానికొకటి విరుద్ధంగావున్నాకూడ నువ్వు ఖంగారుపడకు. వాటన్నింటిని నీకు అర్థమయ్యేటట్లు చెబుతాను.

**భక్త్యోఘవర్ధనం యచ్చ కృష్ణసన్తోషహేతుకమ్ ।**

**తదహం తేఽభిధాస్యామి సావధానతయా శృణు ॥ (శ్లో॥ 10)**

**భావము : భక్తిప్రవాహమును పెంచేది, భగవాన్ శ్రీకృష్ణునికి సంతోషమును యిచ్చేది అయిన సాధనాన్ని నేను నీకు వినిపిస్తున్నాను, సావధానంగా వినుము.**

సావధానచిత్తుడవై విను అంటాడు. అంటే చెప్పింది వెంటనే చేసెయ్యి అని. సావధాన్ అని అంటారు గురుదేవులు సాధన చేయిస్తూ. సావధాన్ అంటే చెప్పింది వినగానే తక్షణమే అమలు చేసే చేతనత్వంతో వినండి అని.

భక్త్యోఘవర్ధనం - మీలో భక్తి పెంపొందాలి.

కృష్ణసంతోషహేతుకమ్ - మీలో కృష్ణచేతనత్వము పెంపొందాలి. భాగవతమును వినడము మొదలెట్టగానే మీలోకి కృష్ణచేతనత్వము ప్రవేశించాలి. అ, ఆ లు నేర్చుకోవడం మొదలెట్టగానే మీకు తెలుగుభాష రావడం మొదలెడుతుంది. అలాగే భాగవతమును సావధానచిత్తముతో వింటే కృష్ణచేతనత్వము మీలోకి తక్షణమే ప్రవేశిస్తుంది.

కృష్ణచేతనత్వము వేఱే యెక్కడో లేదు. మీలోనే, మీ అంతరంగంలోనే ఆ చేతనత్వ మున్నది. భౌతికజీవిత యావలో పడి యీ విషయమును మర్చిపోయి మీ పాత్రలలో మీరు జీవిస్తున్నారుతప్ప వస్తుతః మీలో కృష్ణుడు నెలకొనివున్నాడు. ఆ విషయమును గుర్తిస్తే చాలు ఆయన మీలో మేలుకొంటాడు.

మీలో కృష్ణభక్తి పెంపొందాలి. భక్తి అంటే మీ ఆలోచనలు, కోరికలు యే లక్ష్యము మీద వుంటే ఆ లక్ష్యము నెరవేరేవఱకు మీకు ఆకలిదప్పులుండవు. మఱో విషయము పట్టదు. ఆ మానసికస్థితిని భక్తి అంటారు.

ఉదా॥ శ్రీరామకృష్ణపరమహంసకు కాళికాదేవిమీద భక్తి వున్నది. ఆవిడ దర్శనముకానంతవఱకు ఆయన ఒక్కరోజు గడిచిపోతే 'అయ్యో తల్లీ! ఇంకో రోజు గడిచిపోయింది, నీ దర్శనం మాత్రం కాలేదు' అని యేడుస్తూ తలను గోడకేసి కొట్టుకునేవాడు.

వ్యాపారులకు డబ్బుమీద భక్తి వుంటుంది. ఆ డబ్బు కళ్ళబడందే వాళ్ళకి కంటిమీద కునుకుండదు.

శౌనకుడు వేసిన ప్రశ్నకు సూతుడుకూడ యేమని జవాబిచ్చాడు? నీలో భక్తిని పెంచేది - అన్న విశేషణమును వాడతాడు. శిష్యునిలో భక్తిని పెంచే బాధ్యతకూడ గురువుదే. నీలో భక్తి వుంటే నీ లక్ష్యము నెరవేరేవఱకు నువ్వు నిద్రపోవు. భక్తే నిన్ను నిద్రపోనివ్వదు. అదే నీవెంట పడుతుంది. ఎప్పుడైతే మీలో భగవంతునిమీద భక్తి పెంపొందుతుందో ఆయన చేతనత్వం మీలోకి ప్రవేశిస్తుంది. సూతుడు - శౌనకుడితో అదే అంటాడు. నీలో భక్తిని పెంపొందిస్తాను. భక్తి పెరిగితే భగవంతుడు సంతోషిస్తాడు. కదా! దానితో ఆయన అనుగ్రహం లభిస్తుంది.

**కాలవ్యాలముఖగ్రాసత్రాసనిర్ణాశహేతవే ।**

**శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌ కీరేణ భాషితమ్ ॥ (శ్లో॥ 11)**

**భావము ః కాలసర్పముఖగ్రాసులైన కలియుగంలోని జీవుల కష్టాల నాశనంకొఱకు శ్రీమద్భాగవతశాస్త్రమును శుకుడు తెల్పినాడు.**

శాస్త్రము అంటే ఎవరు ఆచరణలో పెట్టినా ఒకేలాంటి ఫలితమునిచ్చేది.

నువ్వు జీవితంలో - ఒక మహాత్ముడి దగ్గఱకు లేక యోగి దగ్గఱకు లేక గొప్పగొప్పవారి దగ్గరకు యెవరి దగ్గఱకు వెళ్ళినా వారు తమ జీవితంలో ఆ స్థితిని యే ఆధారంతో సాధించారో, ఏ సూత్రంతో సాధించారో చెబుతారు. ఎవరు యే సిద్ధాంతమును ప్రతిపాదించినా లేదా ఆచరణలో పెట్టినా చివఱకు అందఱూ జగద్గురు సిద్ధాంతములోనే సమాహిత మవ్వాలి. భాగవతం దగ్గఱకు యెవఱు వచ్చారుట?

కాలవ్యాలముఖగ్రాస - మృత్యువు వెన్నంటివున్నవాడు. చనిపోయే వ్యక్తి యెవ్వరైనాసరే ఆనందము కావాలనుకుంటే భాగవతమును ఆశ్రయించాల్సిందే.

రెండురకాల సమస్యలు. 1 బ్రతికుండి సుఖంగాలేము. 2. లేదా చనిపోతాము. ఈ రెండు లక్షణాలు వున్న వ్యక్తి పరమశాంతిని పొందాలంటే, సవ్యమైన జీవితవిధానమును పొందాలంటే ఆ వ్యక్తి కచ్చితంగా భాగవతమును ఆశ్రయించాల్సిందే. చేతనత్వవిజ్ఞానవిద్యలో నిష్ణాతుడు కావాలనుకునే ప్రతీవ్యక్తి భాగవతమును చదవాల్సిందే. ఎందుకంటే -శ్రీమద్భాగవతం శాస్త్రం-అన్నాడు సూతుడు. శాస్త్రం అంటే? ఎవరు దాన్ని ఆచరణలోపెట్టినా ఒకేలాంటి ఫలితము నిస్తుంది శాస్త్రము. ఆచరణలో పెట్టిన వ్యక్తి శుకుడైనా కావచ్చు లేదా వ్యాసుడైనా కావచ్చు లేదా పరీక్షిత్తు అయినా కావచ్చు. శాస్త్రం అంటే ఆ విద్యను యిదివఱకు యెవరైతే ఆచరణలో పెట్టారో వారు యెలాంటి ఫలితమునైతో పొందారో ఆ ఫలితమునే తర్వాత ఆచరణలో పెట్టినవారుకూడ పొందుతారు.

**అగ్నిః పూర్వేభి ఋషిభిరీడ్యో నూతనైఋుత సదేవాగ్ం ఏహవక్షతి ॥ (అగ్నిసూక్తం శ్లో॥ 2)**

**భావము : అగ్ని పూర్వులైన ఋషులచేతను, నవీనులైన ఋషులచేతను కూడ స్తుతింపబడినవాడై దేవతలను ఇచ్చటకు అనగా యజ్ఞమునకు ఆహ్వానించునుగాక!**

సూతుడు - శౌనకుడికి భాగవతమును చెప్పడంలేదు. భాగవత శాస్త్రమును చెబుతున్నాడు. భాగవత శాస్త్రమును పూర్వం చదివినవారు ఎలా గొప్పవారయ్యారో ఈనాడు నువ్వుకూడ దాన్ని అభ్యసిస్తే అంత గొప్పవాడివౌతావు అని చెబుతున్నాడు.

కలౌకీరేణ భాషితమ్ - కీరము అంటే చిలుక. ముందు శాస్త్రమును చిలుకపలుకులు లాగ నేర్చుకోండి. చిలుక పలుకులు అంటే చెప్పింది చెప్పినట్లే చెప్పడంతప్ప అదేంటో అర్థంకాదు. అయితే చిలుకలాగ వల్లెవేస్తుంటే ఎప్పటికోప్పటికి శుకమహర్షిగ మారుతారు.

**ఏతస్మాదపరం కిఞ్చిన్మనః శుద్ధ్యై న విద్యతే ।**

**జన్మాన్తరే భవేత్పుణ్యం తదా భాగవతం లభేత్ ॥ (శ్లో॥ 12)**

**భావము : మనశుద్ధికొఱకు యింతకంటే గొప్ప సాధన లేదు. అనేక జన్మపరంపరల పుణ్యోదయంవల్లనే భాగవతశాస్త్రం లభిస్తుంది.**

పై శ్లోకంలో చెప్పిన 'ఇది' - కృష్ణచేతనత్వమును సూచిస్తుంది. ఆ చేతనత్వము మనిషిలోనే వున్నది. అయితే అది 4 రకాలుగ మనిషిలో వ్యక్తీకరింపబడుతుంది. అతి స్వల్పస్థితిలో వుంటే అర్జునుడిలా వుంటుంది. అంతకంటే కొంచెము పైకి యెదిగితే ద్వైపాయనస్థితికి వస్తుంది. ఇంకాస్త పైకి వెళ్తే వ్రజకిశోరస్థితి, ఇంకా పైకి వెళితే నారాయణస్థితి లభిస్తుంది. ప్రతీమనిషిలోను యీ చేతనత్వములు వున్నప్పటికి అవి అపవిత్రంగా అంటే మలముతో నిండియున్నవి. ఆహారంలో మార్పు, ఆసన ప్రాణాయామాలు మొదలగునవి ఆ మలమును తొలగిస్తాయి. మనిషి సాధన చేసేంది ఎందుకంటే తనలో వున్న దేవతా చేతనత్వమును ఆవరించియున్న దమ్ముధూళిని తొలగించుకునేందుకు. దేవత్వము మనిషిలో నిరువుగప్పిన నిప్పు లాగ వుంటుంది. ఆ బూడిదను తొలగిస్తే దైవత్వవు కోటిసూర్యకాంతులతో తేజరిల్లుతుంది.

ఇంకా స్పష్టంగా అర్థమవ్వాలంటే ఒక ఉదాహరణ చెప్పుకోవచ్చు. ఒక వ్యక్తి 7 తలుపులున్న ఇంటిలోకి ఒకదానివెంట ఒకటి తాళం వేసుకుంటూ లోపలికి వెళ్ళి చివరగా కిటికీలోంచి తాళం బయటికి విసిరేశాడు. ఇప్పుడు ఆ వ్యక్తి బయట కెలా వస్తాడు? ఎవరైనా తాళం అతనికి బయటినుండి లోపలికి అందిస్తే వస్తాడు. లేకపోతే అక్కడే వుండిపోతాడు.

కాబట్టి మనిషిలో భగవంతుడు వున్నాడు. కానీ ఆయనపై ఒక తెర వేసుకున్నాము. అప్పుడు ఆయన మనకు ఆగోచరంగా వున్నాడు. మనమే ఆయన. ఆయనే మనము. ఇంక ముక్తి, భగవంతునిలో ఐక్యమవడము అనేవి యేమి లేవు. నువ్వు భగవత్స్వరూపిడివే!! కానీ మనిషి భగవంతునిలా ప్రవర్తించలేకపోతున్నాడు. ప్రవర్తిస్తే చాలు మనిషి భగవంతుడు అనబడతాడు. పెద్దలు అభ్యాసం కూసువిద్య అన్నారు. అలా ప్రవర్తించడానికి మనిషి అభ్యాసం చేయాలి. చేయగా చేయగా దానిలో నైపుణ్యం వస్తుంది. ఉదా॥ మీరు కార్ తోలడం నేర్చుకోవాలి. నేర్పేందుకు ఒక వ్యక్తి డ్రైవింగ్‌సీట్‌లో కూర్చుని చెబుతూంటాడు. మీరు గమనిస్తువుంటారు. తర్వాత మీరు కార్ తోలడానికి ప్రయత్నిస్తారు.

మెల్లిమెల్లిగా అదే వస్తుంది. అలాగే నేను భగవంతుడిని అని అలా ఆచరణ చేయడం మొదలెడితే మెల్లిగా యెప్పుడో అప్పుడు మీరు నిజంగా భగవంతుడైపోతారు. కృష్ణుడే(భగవంతుడే) మీ శరీరంలో వుంటే మీరు యెలా జీవిస్తారో అలా జీవించడానికి ప్రయత్నించాలి. ఆ ప్రయత్నం యెప్పుడో ఫలిస్తుంది. అలా ఎలా జీవించాలి అనేదానికి అనేకమంది గురువుల జీవితచరిత్రలను అధ్యయనం చేయాలి. వారి జీవితంలో గురుత్వస్థాయికి యెదగటానికి యెలా ప్రయత్నము చేశారో గమనించాలి. వాటిని నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలి. ఎప్పుడైతే మీరు మనసికంగా మనస్సు మార్చుకొని సావధాన మనస్సుతో ఆలా జీవించడానికి ప్రయత్నము చేస్తారో అప్పుడు గురువు మిమ్మల్ని చూసి ఆనందిస్తాడు.

**చిన్తామణిర్లోకసుఖం సురద్రుః స్వర్గసమ్పదామ్ ।**

**ప్రయచ్ఛతి గురుః ప్రీతో వైకుణ్ఠమ్ యోగిదుర్లభమ్ ॥ (శ్లో॥ 8)**

**భావము ః చింతామణి కేవలం లౌకిక సుఖాన్నిస్తుంది. కల్పవృక్షము అధికాధికమైన స్వర్గీయ సంపత్తుల నిస్తుంది. కానీ గురుదేవులు ప్రసన్నులైతే యోగులకుకూడ దుర్లభమైన నిత్యమైన వైకుంఠధామం యిస్తారు.**

ఆయన మీకు వైకుంఠధామము నిస్తాడు. అయితే దానికి తగిన అర్హత సంపాదించుకోవాలంటే సాధకునికి కొన్ని లక్షణము లుండాలి. అందులో మొదటి లక్షణము - అభయము. భయము లేని స్థితి.

**కాలవ్యాలముఖగ్రాసత్రాసనిర్ణాశహేతవే ।**

**శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌ కీరేణ భాషితమ్ ॥ (శ్లో॥ 11)**

**భావము ః కాలసర్పముఖగ్రాసులైన కలియుగంలోని జీవుల కష్టాల నాశనంకొఱకు శ్రీమద్భాగవతశాస్త్రమును శుకుడు తెల్పినాడు.**

**ఏతస్మాదపరం కిఞ్చిన్మనః శుద్ధ్యై న విద్యతే ।**

**జన్మాన్తరే భవేత్పుణ్యం తదా భాగవతం లభేత్ ॥ (శ్లో॥ 12)**

**భావము ః మనశుద్ధికొఱకు యింతకంటే గొప్ప సాధన లేదు. అనేక జన్మపరంపరల పుణ్యోదయంవల్లనే భాగవతశాస్త్రం లభిస్తుంది.**

భాగవతమును యెవఱు వినగలరు? సింహం పిల్లలు. (ముందర పుటలలో చెప్పిన సింహం కథలోని సింహం). నేను గొఱ్ఱెను అన్న భావమును వదిలి సింహమును అనే భావన తెచ్చుకుంటే చాలు. కానీ మనము 'మనము గొఱ్ఱెలము' అనే భావాన్నే పట్టుకుని వ్రేలాడుతున్నాము. పట్టుకోకూడదు. వదలాలి. మనకు కొన్ని జన్మలుగా పట్టుకోవడం అలవాటైపోయింది. వాటిని వదిలించడానికి గురువులు మంత్రములను పట్టుకోమన్నారు. వాటిని పట్టుకుని మిగతావాటిని వదులుతారేమోనని గురువుల ఆశ. అయితే మనిషి అందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తాడు. అలా మంత్రజపాలు అవి చేయగా చేయగా ఎప్పుడో మనలోని భగవంతునిమీద ఆవరించియున్న బూడిద తొలగించబడుతుంది. దేనికైనా సమయము రావాలి. భాగవతమును వినాలన్నాకూడ పూర్వపుణ్యం వల్లనే సంభవము.

**పరీక్షితే కథాం వక్తుం సభాయాం సంస్థితే శుకే ।**

**సుధాకుమ్భం గృహీత్వైవ దేవాస్తత్ర సమాగమన్ ॥ (శ్లో॥ 13)**

**భావము ః రాజా! శ్రీశుకుడు- పరీక్షిత్తునకు యీ కథ తెల్పటానికి సభలో ఆసీనులై వున్నప్పుడు దేవతాగణములు అమృతభాండాన్ని తీసుకుని ఆయన దగ్గఱకు వచ్చారు.**

సరే శౌనకుడు -పరీక్షిత్తుకు భాగవతం చెప్పడం మొదలెట్టగానే దేవతలు అమృతభాండం తీసుకుని ఆయన వద్దకు వచ్చారు. దేవతలకు దేవత్వము యెందువల్ల వచ్చింది? అమృతంవలన. మఱి అలాంటి అమృతమును తీసుకుని దేవతలు శుకమహర్షి వద్దకు వచ్చి అమృతమును తీసుకుని భాగవతకథామృతము నిమ్మని బేరం పెట్టుకున్నారుట. శుకుడు కుదరదు అని తెగేసిచెప్పాడు. దేవతలు భాగవతమును తెల్సుకునేందుకు అమృతమును యివ్వడానికి సిద్ధపడ్డా రంటే భాగవతం కోసం తమ దేవత్వమును వదులుకోవడానికి సిద్ధమయ్యారన్నమాట.

అయితే శుకుడు యేమన్నాడు? దేవతలకు భాగవతం వినే హక్కు లేదన్నాడు. మనిషికి ఆ అధికార మున్నది. అధికారి కూడ కొన్ని నియమాలు పాటించాలి. మనిషి సాధనాజగత్తులో కొన్ని ముఖ్య నియమాలను పాటించితీరాలి. 2. మౌనం. 3. మౌనంగా వుంటూ ఆజ్ఞాచక్రంలో జీవించడము అలవాటు చేసుకోవడము.

సాధనలో ఆజ్ఞాచక్రంలో జీవించమన్నారు పెద్దలు. ఎలా జీవించాలి?

యద్భావం తద్భవతి - అనికూడ పెద్దలన్నారు. ఒకసారి శివపార్వతులు భూలోకయాత్రకు వచ్చారు. కాశీలో వేలాదిమంది భక్తులు గంగాస్నానం చేస్తున్నారు. గంగాస్నానం చేస్తే పాపరహితులు అవుతారని గదా పురాణాలు ప్రవచిస్తున్నది. పార్వతీదేవి అలా గంగలో స్నానం చేసేవారిని చూసి వారందఱూ పాపరహితులవుతున్నారని చాలా ఆనందిస్తోంది. అప్పుడు శివుడు అలా జరగడంలేదు అన్నాడు. ఇద్దఱూ వాదించుకుని చివఱకు ఒక పరీక్ష పెడదాము వారికి అనుకున్నారు. శివుడు ఒక కుష్ఠురోగిగా మారాడు. పార్వతీదేవి శివుని దగ్గఱ కూర్చుని గంగలో స్నానం చేసి ఆ దారినపోతున్న భక్తులతో 'మీరందఱూ గంగాస్నానం చేసి పాపరహితులయ్యారుగదా! మీరుగనుక నా భర్తను స్పృశిస్తే ఆయన రోగము మాయమౌతుంది. కాబట్టి నాయందు దయుంచి మీలో యెవరైనా నా భర్తని తాకండి. ఆయన ఆరోగ్యవంతుడౌతాడు' అని వేడుకుంటోంది. ఎవ్వఱూ పట్టించుకోలేదు. తమదారిన తాముపోతున్నారు. ఇదంతా ఆ ప్రక్కనే వున్న ఒక గజదొంగ గమనించాడు. అతను వెంటనే గంగాస్నానం చేసి వచ్చి శివుడిని పట్టుకున్నాడు. తక్షణమే శివపార్వతులు తమ దివ్యరూపంతో ఆ గజదొంగకి సాక్షాత్కరించి అతనికి తమ సాయుజ్యమును ప్రసాదించారు.

పై కథద్వారా దేనికైనా భావన ముఖ్యం అన్న విషయము పాఠకులకు అర్థమయ్యే వుంటుంది.

ఆజ్ఞాచక్రంలో జీవించడం మొదలెడితే మీ సకలబాధ్యతలను గురువు మీద వదలండి. కానీ మీరు చేయవల్సిన పనులనుమాత్రము చేయండి. గజదొంగలాగ మీ మానసికస్థితి సరిగా వుండాలి. మనయేవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః అని అన్నారు ఋషులు. మనస్సే, భావమే ప్రధానము.

మౌనంగా వుంటూ, ఆజ్ఞాచక్రస్థితిలో జీవిస్తూ దానితోపాటు 'నాటు-కోసుకో' అనే సూత్రమును ఆచరణయోగ్యంగా చేసుకోవాలి. ఏమి నాటితే ధృవుడు -ధృవనక్షత్రంగా మారాడు? ఏమి నాటితే ప్రహ్లాదుడు - ప్రహ్లాదుడిగా మారాడు? ఏమి నాటితే రత్నాకరుడు అనే బందిపోటు దొంగ వాల్మీకి అయ్యాడు? ఏమి నాటుకుంటే శ్రీరామశర్మఆచార్య గురుదేవులు ఆ స్థితికి యెదిగారు? లాహిరీమహాశయులు ఎలా జీవించారు? ఆ నాటుకోవడము నేర్చుకోవాలి. మారాలి మనిషి. మారటానికి యెంత సమయము పడుతుంది? కొద్ది సమయంమాత్రమే పడుతుంది. ఉరిశిక్షపడి కారాగారవాసం చేస్తున్న స్వాతంత్ర్యసరమమీరుడు అరవిందోకి కారాగారంలో వివేకానందుని కంఠధ్వని వినిపించింది. ఆయన యేవో కొన్ని

విషయాలను అరవిందోకి చెప్పాడు. సాధనలూ అందించాడు. అరవిందో వాటిని వెంటనే ఆచరణలో పెట్టాడు. సాధనలో ఫలితాలను పొందాడు. ఉరిశిక్ష రద్దయ్యి, పాండిచ్చేరి చేసి అరవిందమహర్షిగా ఆశ్రమము యేర్పాడు చేసుకున్నాడు.

మారాలనుకుంటే తక్షణమే మారతారు. కదా! ఎలా మారాలి అన్నదానికి గురువుల జీవితచరిత్రలను బాగా అధ్యయనము చేయాలి. గురుపరంపరను పట్టుకోండి. గురువులలో వారిలో వారికి తేడాలు లేవు. వారు అరజ్జుః అంటే బంధాలు లేని స్థితిలో జీవిస్తారు. ద్వంద్వము వుండదు గురువు దగ్గఱ. ద్వంద్వము అనేది సామాన్యుడిని బాధిస్తుంది. ద్వంద్వములు వుంటాయి, వస్తాయి అని మహాభారతంలోని చాలా సంఘటనలు ఋజువుచేస్తాయి. ద్వంద్వములు వచ్చినప్పుడల్లా వ్యాసమహర్షి అక్కడికి వచ్చి యేది వుచితమో, ఏది అనుచితమో తేల్చిచెప్పాడు. ఆయన చెప్పినవి వివేకమునుకూడ అధిగమించివున్నాయి. సిద్ధాంతాలకు విరుద్ధంగానే చెప్పాడు. కానీ వ్యాసస్థితిలో వుండి చెప్పాడుగనుక అవి సరైన నిర్ణయాలుగానే వుంటాయి. అలా ఎందుకున్నాయంటే సిద్ధాంతాలకు విరుద్ధంగా వుండటము అనేది ప్రకృతిలోనే వున్నది. భగవంతుని నియమంలో కాదుగనుక.

నాటు-కోసుకో తర్వాత ఆధ్యాత్మికజగత్తులో ఆచరణయోగ్యమైన సూత్రము సామూహిక జీవనము. దానితోపాటు క్రమశిక్షణ. ఇవి రెండూకూడ అత్యంత ఆచరణీయమైన సూత్రములు. ఆధ్యాత్మికజగత్తులో యేది చేసిన సామూహికంగా చేయాలి. దేవతలు తమకేదైనా సమస్య వస్తే విష్ణుమూర్తి దగ్గఱకు ఒక సమూహంగా వెళ్ళేవారు. ఆయన వారి సమస్యను తీర్చేవాడు. గాయత్రీ మంత్రంలోని నః అనేది సామూహికతను సూచిస్తుంది. మనిషి నేడు వంటరితనంతో బాధపడుతున్నాడు. అందఱూ వున్నా తనకి తాను ఒంటరివాడే. అనేక వృద్ధాశ్రమాలు యేర్పడటానికి కారణము మనిషియొక్క స్వార్థమే. తను తన తల్లిదండ్రులను సరిగాచూడకపోతే భవిష్యత్తులో తన పిల్లలు తననుసరిగా చూడరు అనే కనీస ఇంగితముకూడ నేటి మనిషిలో కొరవడింది. మనిషి సామూహిక జీవితమును అలవర్చుకోవడానికే ప్రకృతిలో ఫ్లాట్‌సిస్టమ్ అమలులోకొచ్చింది. అక్కడ యిష్టమున్నా లేకపోయిన కల్సిజీవించాల్సిందే. దానితోపాటు క్రమశిక్షణను పాటించితీరాలి.

నాటు-కోసుకోలో మనిషి తన ఆలోచనలను నాటుకోవచ్చు. భావములను నాటుకోవచ్చు. ఆచరణను నాటుకోవచ్చు. నేడు మనిషికి ధనమును షేర్‌బజార్‌లో నాటుకోవడమైతే వస్తోందిగాని, గురువుల ఆశ్రమంలో వనరులను, సమయాన్ని, ధనమును నాటుకోవడము రావడంలేదు. మీ సమయాన్ని, ధనమును, ప్రతిభను, ఆలోచనలను, ఆచరణను గురువుల ఆశ్రమంలో నాటుకోండి. అలా నాటుకోవడం ద్వారా మీరుపరిణామక్రమంలో ముందుకు యెదుగగలుగుతారు. ఖనిజ, వృక్ష, జంతు, దేవతల చేతనత్వంలో మార్పువచ్చింది. యుగసంధి సమయంలో అనేక దివ్యశక్తులు ఆవిర్భవించాయి. ఖనిజజగత్తులో - రేడియోయాక్టివిటి వచ్చేసింది. అంటే ఖనిజజగత్తులో ఆ అనంతమైన చేతనత్వము ఆవిర్భవించింది. అలాగే వృక్షజగత్తులోకూడ కొన్ని గురుచేతనత్వమునకు వెళ్ళిపోయాయి. ఉదా॥ తులసి. తులసి ప్రాణశక్తిని ప్రసాదిస్తుంది. మన పురాణాలలో వచ్చే తులసి-జాలంధరుని కథే దీనికి ప్రత్యక్షసాక్ష్యం. జంతుజగత్తులో ఆవు, గుఱ్ఱము, ఏనుగు మొదలగునవి గురుచేతనత్వమునకు వచ్చాయి. అందుకనే శ్రీకృష్ణుడు ఆవుని వుపయోగించుకున్నాడు. సత్యసాయి - ఏనుగుని వుపయోగించుకున్నాడు. శిరిడిసాయి - గుఱ్ఱమును వుపయోగించుకున్నాడు. దత్తాత్రేయుడు - కుక్కలని వుపయోగించుకున్నాడు. వీటన్నింటినీ మనిషి నేడు కేవలం జంతువులలాగ చూస్తున్నాడుతప్ప గురుచేతనత్వమునకు చేరిన స్థితిలో వున్నవిగా చూడటంలేదు. ముఖ్యంగా ఆవు చేతనత్వము అతి గొప్పది. అందుకే భారతభూమిలో అతి

ప్రాచీనకాలంనుండి ఆవుని గోమాతగా పూజించారు. దాన్ని వుపయోగించుకున్నారు. అత్యంత పవిత్రమైన జంతువుగా గోవుని గుర్తించారు. గోమాతలో సకలదేవతలు కొలువైవుంటారు. కనుకే అది పరమపవిత్రమైనది. దీలీపమహారాజు, వశిష్ఠుడు మొదలగువారు గోమాతను ఆదరించారు. తమ జీవితంలో తీరనికోరికలను తీర్చుకోవడానికి గోమాతను ఆశ్రయించారు. అలాంటి గోమాత యీనాడు కడుదయనీయస్థితిలో వున్నది. దాన్ని చంపి భక్షించే ఒక జాతి భారతభూమిలో మనుగడ సాగిస్తోంది అంటే మన దేశ సంస్కృతికి, సంప్రదాయమునకు అది యెంత దుర్భరమో ఆలోచించండి. గోమాతల సంఖ్య నేడు దేశంలో విస్తారంగా పెరగవల్సిన అవసరమున్నది. ప్రతీ గురువు గోమాతను ఆదరించాడు. ముఖ్యంగా కృష్ణుడు, నందుడు, వసుదేవుడు గోమాత అభివృద్ధి, వాని సర్వతోముఖవికాసానికి ఎనలేని కృషిచేశారు. వారి బాటలో నేటి భారతజాతి పయనించవల్సిన అవసరము యెంతైనా వున్నది అని పరిస్థితులు చాటిచెబుతున్నాయి. పరిణామక్రమంలో మనిషి యెదగాలంటే అనేక చేతనత్వములను వుపయోగించుకోవాల్సివస్తుంది. కృష్ణుడు గోమాతను వుపయోగించుకున్నాడు.

ఆ కృష్ణకథను వినడానికి పరీక్షిత్తు వుద్యుక్తుడయ్యాడు. మరణమాసన్నమయిన ఆతని చేతనత్వంలో మార్పువచ్చింది. వెంటనే శుకమహర్షి పిలవకుండానే భాగవతసప్తాహమును చెయ్యడానికి పరీక్షిత్తు దగ్గఱకు వచ్చాడు.

**శుకం నత్వావదన్ సర్వే స్వకార్యకుశలాః సురాః ।**

**కథాసుధాం ప్రయచ్ఛస్వ గృహీత్వైవసుధామిమ్ ॥ (శ్లో॥ 14)**

**భావము ః దేవతలు తమ కార్యములను చేయుటలో బహుకుశలురు. అందువల్ల యిక్కడ కూడ శుకదేవులకు నమస్కరించి యిలా అన్నారు. 'తమరు యీ అమృతమును తీసుకుని బదులుగా కథామృతాన్ని దానము చేయండి'.**

స్వకార్యకుశలాః - దేవతలు తమతమ పనులు చేయడంలో బహుకుశలురు. ఉదా॥ ప్రకృతిలో నీరు -నీరుగానే పనిచేస్తుందిగాని అగ్నిగా పనిచేయదు. వరుణుడు తన పని చేయడంలో నిపుణుడు. అలాంటి దేవతలు శుకమహర్షి దగ్గఱకు వచ్చి మీరు పంచతత్త్వముల మీద ఆధిపత్యమును పొందండి. మేము యిస్తాము. దానికిబదులుగా మీరు భాగవతకథామృతమును మాకు ప్రసాదించండి అన్నారు.

'మేము మా అమృతమును అనగా దేవత్వమును మీకిస్తాము. మేము మా దేవత్వమును వదులుకుంటాము. కానీ మీరు భాగవతామృతమును మాకు పంచండి అని వేడుకున్నారు. వారు పరీక్షిన్మహారాజుతో బేరం పెట్టారు.

ఇక్కడ ఒక విషయమును మనము స్పష్టంగా అవగాహన చేసుకుని ముందుకు సాగుదాము. మనము భాగవత కథను వినడానికి కూర్చున్నాము. శరీరంమాత్రం కథా సత్సంగక్షేత్రంలోనే వున్నది. కానీ మనస్సో? అది యెక్కడెక్కడో విహరిస్తోంది. శ్రోతలోని పంచతత్త్వములు వాటిపని అవి చేస్తున్నాయి. మనస్సు దాని పని అది చేస్తోంది. కూర్చున్నవారి చేతనత్వము భాగవతకథను ఆలకిస్తున్నదా? శ్రోతలోని పంచతత్త్వములు ఆ కథను ఆస్వాదిస్తున్నాయా? అదీ ప్రశ్న.

ఇక్కడ ఒక శాస్త్రీయ విషయమును అవగాహన చేసుకోవల్సిన అవసరమున్నది. ఒక విషయమును ఒక వ్యక్తి ఓ పదిమందికి చెప్పాడునుకోండి. అప్పుడు వారిలో కొంతమందికి ఆ విషయము అర్థంకాకపోవచ్చు. కానీ తర్వాత అదే విషయమును మఱో వ్యక్తి, మఱో స్థలంలో వేఱొకరికి చెబితే ముందువిన్న పదిమందికన్నా వీరికి ఆ విషయము త్వరగా అర్థమౌతుంది. ఎక్కువమందికి అర్థమౌతుంది. పురాణాలనువాటిని అందుకే సామూహికంగా వినమనేది. వ్యక్తిగతంలో

కథలోని సారమును పట్టుకోలేకపోయినా సామూహికంగా వినడంవలన అందఱి చేతనత్వములు మీకు తెలియకుండానే మీ మనస్సులోకి ప్రవేశిస్తాయి. ఇది ఒక శాస్త్రీయ నియమము అనుకోవచ్చు. వ్యాసుడు ఈ విషయమునే యీ శ్లోకం ద్వారా తెలియజేశాడు.

కథను శ్రవణము చేస్తున్నప్పుడు నీలోని అగ్ని చేతనత్వంవలన నీ కళ్ళు చూస్తున్నాయి. ఆకాశతత్త్వంవలన చెవులు కథను ఆస్వాదిస్తున్నాయి. స్పర్శవలన భాగవతకథలోని మాధుర్యము మీ హృదయమును స్పృశిస్తోంది. రుచివలన భాగవతకథలోని రసాస్వాదన జరుగుతోంది. భాగవతం వినాలనే సంస్కారము పృథ్వీతత్త్వంవలన కలుగుతోంది. ఈవిధంగా మీలోని పంచతత్త్వములు భాగవతకథను శ్రవణం చేస్తున్నాయి. అంతేతప్ప శ్రోతగా మీరు ఆస్వాదించడంలేదు.

**ఏవం వినిమయేతే జాతే సుధారాజ్ఞా ప్రపీయతాం ।**

**ప్రపాస్యామో వయం సర్వే శ్రీమద్భాగతామృతం ॥ (శ్లో॥ 15)**

**భావము : ఈవిధంగా వినిమయమైతే పరీక్షిన్మహారాజు అమృతాన్ని త్రాగుతారు. మేము (దేవతలం)శ్రమతో భాగవతరూపమైన అమృతాన్ని త్రాగుతాము.**

దేవతలు భాగవతం వినడానికి వచ్చారంటే అర్థమిలా అన్వయించుకోవచ్చు. పరీక్షిత్తు భాగవతం వినకపోయిన అతనిలోని పంచతత్త్వములు వింటాయి. విన్నతర్వాత నిజంగా భాగవతమును వినాలి అనే ఆసక్తి గల సాధకుడు ప్రపంచంలో యెక్కడున్నా శుకుడు చెబుతున్న ఆ భాగవతసారమును పట్టుకుంటాడు.

దేవతలు వచ్చి శుకుడుతో భాగవతామృతమును తమకు పంచి అమృతమును పరీక్షిత్తుకిస్తామని అన్నారు.

**క్వ సుధా క్వకథా లోకే క్వ కాచః క్వ మణిర్మహాన్ ।**

**బ్రహ్మరాతో విచార్యైవం తదా దేవాఞ్జహాస హ ॥ (శ్లో॥ 16)**

**భావము : ఈ ప్రపంచంలో గాజుముక్క యెక్కడ? బహుమూల్యమైన మణి యెక్కడ? అని ఆలోచించి శుకమహర్షి 'అమృతమెక్కడ? శ్రీమద్భాగవతమెక్కడ?' అని దేవతలని పరిహసించాడు.**

**అభక్తాంస్తాంశ్చ విజ్ఞాయ న దదౌ స కథామృతమ్ ।**

**శ్రీమద్భాగవతీ వార్తా సురాణామపి దుర్లభా ॥ (శ్లో॥ 17)**

**భావము : అంతేకాక శ్రీశుకమహర్షి దేవతలు భక్తిశూన్యులని తలచి శ్రీమద్భాగవత కథామృతాన్ని శ్రవణ దానమియ్యలేదు. భాగవత కథాశ్రవణం దేవతలకికూడ దుర్లభమే.**

శుకుడు భాగవతమును మణితోను; అమృతమును గాజుముక్కతోను పోల్చాడు. భాగవతమణిని పట్టుకున్న సాధకుడు సృష్టికి మూలం అవుతాడు. వైద్యవిద్యను చదివితే ఒక విద్యార్థి యెలాగైతే వైద్యుడుగా మారుతాడో; అలాగే భాగవతమును అర్థము చేసుకుంటే; శ్రీకృష్ణుడు యీ సంపూర్ణసృష్టికి మూలకారణ మని యిప్పుడు యెలాగైతే అనుకుంటున్నామో మీరుకూడ ఆ స్థితికి యెదుగుతారు. సృష్టికి మూలకారణమైన కృష్ణుని లాగ మీరుకూడ మారుతారు. అంతేతప్ప ముక్తిచెందడం, చనిపోవడము యేమి వుండదు. బాధ్యతలనుండి, కర్మబంధాలనుండి స్వతంత్ర్యమును పొందుతారు. ముక్తిపొందడ మంటే మరణించడం కాదు. చనిపోయిన వ్యక్తి యెవఱికి వుపయోగపడడు. ప్రపంచానికి

వుపయోగపడేస్థితిలో జీవించగలిగే స్థితి లభిస్తుంది. పరీక్షిత్తు భాగవతసప్తాహశ్రవణంతో ఆ స్థితికి యెదిగాడు. అప్పుడు పరీక్షిత్తును చూసి బ్రహ్మ ఆశ్చర్యపోయాడుట.

**రాజ్ఞో మోక్షం తథా వీక్ష్య పురా ధాతాపి విస్మితః ।**

**సత్యలోకే తులాం బద్ధ్వాతోలయత్సాధనన్యజః ॥ (శ్లో॥ 18)**

**భావము : పూర్వకాలంలో శ్రీమద్భాగవత శ్రవణం వల్ల పరీక్షిన్మహారాజుకు వచ్చిన ముక్తిని చూసి బ్రహ్మకూడ ఆశ్చర్యపడెను. ఆయన సత్యలోకమున ఒక తులాదండమును కట్టి భాగవతమును, మిగతా అన్ని సాధనలతో తూచాడు.**

ధాతా అంటే బ్రహ్మ. అస్మితా - ఆశ్చర్యపోయాడు. బ్రహ్మ యెవరు? సృష్టికర్త. ఆయనకూడ యెప్పుడు ఆశ్చర్యపోతాడు. తాను చూసిన వస్తువు తన సృష్టిలో లేనప్పుడు. ఆ వస్తువు తన సృష్టిలోని భాగం కానప్పుడు. శుకుడు చెబుతున్న భాగవతం సృష్టిలోని భాగము కాదు. బ్రహ్మకి ఆశ్చర్యము యెందుకంటే ద్వాపరయుగాంతంలో పరీక్షిత్తు భాగవతకథను శ్రవణం చేసి ముక్తి చెందుతాడు అని బ్రహ్మరాత వ్రాయలేదుగదా!! అని. నాయొక్క రాజ్యాంగంలో యిది లేదే. నాయొక్క ప్రపంచ నియమావళిలో యిది లేదే అని ఆశ్చర్యపోయాడు. నేనేమో ముక్తి చెందాలంటే తపస్సులు చేయాలన్నాను, యజ్ఞాలు చేయాలన్నాను, జపతపాలు చేయాలన్నాను. స్వయంగా శ్రీకృష్ణుడు ఇవన్నీ చేయాలని గీతలో ప్రబోధించాడు. మఱి ఇవన్నీ లేకుండా భాగవతకథామృతమును వినడంవల్లనే మనిషి ముక్తిచెందవచ్చా? ఇదీ ఆయన ఆశ్చర్యము. ఆశ్చర్యపోయిన బ్రహ్మ అప్పుడు భాగవతమును, మిగతా శాస్త్రములను ఒక తులాదండంతో తూచాడు. అప్పుడు వచ్చిన ఫలితమును చూసి బ్రహ్మ యింకా ఆశ్చర్యపోయాడు.

**లఘూన్యన్యాని జాతాని గౌరవేణ ఇదం మహత్ ।**

**తదా ఋషిగణాః సర్వే విస్మయం పరమం యయుః ॥ (శ్లో॥ 19)**

**భావము : మిగతా అన్ని సాధనలు శ్రీమద్భాగవతంతో పోలిస్తే బరువులో తేలికని తెలుసుకున్నాడు. తన మాహాత్మ్యంవల్ల భాగవతం అన్నింటికంటే బరువైనదని తెలిసి ఋషు లందఱూ ఆశ్చర్యచకితులయ్యారు.**

కనుక మీరు ఆచరించే యజ్ఞయాగాదులు, జపతపాలు, హోమాలకంటే భాగవత శ్రవణము గొప్పదని మీకు అర్థమవ్వాలి. మీరు భాగవతజీవనవిధానంలోకి మారిపోవాలి. అందుకే శిరిడిసాయి లాంటి గురువులు 'నన్ను మీరు మంత్రోపదేశాలు, జపవిధానాలు అడగకండి' అన్నారు. ఆయన భావమేమిటంటే మీరుకూడ ఆయనలాగ జీవిస్తే అవన్నీ చేయనవసరంలేదు. లేకపోతే చేయవల్సిందే అని. శిరిడిసాయి తన గురువు తనకు మంత్రోపదేశం చేయలదని స్పష్టంగానే చెప్పాడు. కేవలం ఆజ్ఞాచక్రంస్థితిలో 12 సంవత్సరాలు జీవించాడు. గురువు అనుగ్రహంతో ఆయనకు ఆ చక్రస్థితి ప్రాప్తించింది. గురువుల జీవితచరిత్రలను యిలా అర్థము చేసుకుంటూ చదివితేతప్ప లేకపోతే అవి వుపయోగపడవు.

బ్రహ్మేకాదు, ఋషులుకూడ మేము యిన్ని జపతపాలు, యజ్ఞయాగాలు, హోమాలు చేశాము. ఇవన్నీకాకుండా కేవలం భాగవతము చదివితే చాలా!! అని ఆశ్చర్యపోయారు. చివఱగా ఋషులు, దేవతలు, బ్రహ్మ అందఱూ కల్సి ఒక నిర్ణయానికి వచ్చారు.

**మేనిరే భగవద్రూపం శాస్త్రం భాగవతం కలౌ ।**

**పఠనాచ్ఛ్రవణాత్సద్యో వైకుణ్ఠఫలదాయకమ్ ॥ (శ్లో॥ 20)**

**భావము ః భగవత్స్వరూపమైన శాస్త్రమును కలియుగంలో చదివినా, విన్నా తక్షణమే మోక్షం లభిస్తుందని ఋషులందఱూ నిర్ణయించారు.**

మనిషి మస్కిష్కంలో వైకుంఠము వుంటుంది అని ఋషులు చెప్పారు. ఆ వైకుంఠంలోని శక్తి విప్పారితేతప్ప మనిషిలోని దివ్యచేతనత్వం విప్పారదు. శ్రీకృష్ణుడు గీతలో 'దివ్యం దదామితే చక్షుః' అంటాడు. ఆ దివ్యచక్షువులు రావడానికి యీ వైకుంఠము అనేది తెరుచుకోబడాలి. తెరువబడటానికి భాగవతమును విన్నా, చదివినా చాలు. అయితే

భాగవతమును సప్తాహశ్రవణం చేయాలని సూచించారు ఋషులు. ఎందుకంటే భాగవతమును వింటున్నప్పుడు ఒక్కొక్కరోజు ఒక్కొక్కచక్రం చొప్పున విప్పారుతూవస్తుందిగనుక. వారంరోజుల్లో షట్చక్రాలు వికసిస్తాయి. భాగవతకథాశ్రవణం చేస్తూ నియమానుసారంగా ఆసనప్రాణాయామాలను ఆచరణలో పెట్టాలి. అప్పుడు భాగవతమును వింటున్నప్పుడు పంచేంద్రియాలు సరిగా పనిచేస్తాయి. విషయమును సరిగ్గా గ్రహించుకుంటాయి.

**సప్తాహేన శృతం చైతత్సర్వథా ముక్తిదాయకమ్ ।**

**సనకాద్యైః పురా ప్రోక్తం నారదాయ దయాపరైః ॥ (శ్లో॥ 21)**

**భావము ః సప్తాహవిధి ద్వారా శ్రవణం చేస్తే యిది నిశ్చయంగా భక్తిని ప్రసాదిస్తుంది. పూర్వకాలంలో దయామయులైన సనకాదులు దేవర్షినారదుడికి దీనిని వినిపించిరి.**

పూర్వకాలంలో నారదుడు, ఇప్పుడు పరీక్షిన్మహారాజుకూడ భాగవతంద్వారా అమరులయ్యారు. ఎవరైనా యేదైనా విషయమును విన్నప్పుడు దానివల్లన యిదివఱకు యెవరైనా లాభం పొందారా? అనే ప్రశ్నవేసుకుంటారు. అలాంటివారిని వెదుకుతారు. ఓహో వారు ఆ లాభము పొందారుగనుక మనంకూడ ఆ లాభం పొందవచ్చు అని తెలుసుకుంటారు. భాగవత విషయంలోకూడ యిలాగే జరిగింది. నారదుడు భాగవతం ద్వారా అమరుడయ్యాడు అని తెలుసుకున్నారు. సృష్టికి ముందరే భాగవతకథాశ్రవణం వలన ముక్తిపొందినవారు సనకాదులు. నారదుడుకూడ సృష్టికి ముందరా వున్నాడు, సృష్టి వున్నప్పుడూ వున్నాడు, సృష్టి లయస్థితిలో వున్నప్పుడుకూడ ఆయనకూడ లయస్థితిలో వున్నాడు. అయితే భాగవతమును విన్నవారు యెప్పుడూ ఒకే రూపంతో వుంటారు. వారి రూపంలో మార్పుండదు. అలాగే రూపమును మార్చుకునే శక్తికూడ వస్తుంది. ఉదా॥ శిరిడిసాయి తన భక్తులకు అనేక రూపాలలో దర్శనమిచ్చిన సంగతి ఆయన జీవితచరిత్ర చదివితే అర్థమౌతుంది. అలాగే దత్తుడు అనేక రూపాలలో దర్శనమిస్తాడన్న విషయము మనకు తెలుసు. భాగవతమును విన్నవారు చిరంజీవులౌతారు అన్న విషయము దీనిబట్టి అర్థమౌతోంది. కదా!

అందుకే నారదుడు లాంటి వారు దీనిని మఱలమఱల విన్నారు. ముందుగా నారదుడు బ్రహ్మముఖకమలంనుండి భాగవతమును శ్రవణం చేశాడు. తర్వాత సనకాదులద్వారా సప్తాహవిధివిధానమును తెల్సుకున్నాడు. ఆతర్వాతకూడ అనేకసార్లు విన్నాడు. అదీ భాగవత మాహాత్మ్యము. నారదస్థితి యేమిటంటే భాగవతమును యుగయుగాలుగా అలా వింటూనేవుంటుంది. విన్నది నలుగురికి చెబుతుంది. కనుక భాగవతమును వింటాను అన్నవారందఱికి గురువు నారదుడే. వారికి యిష్టమున్నా, లేకపోయినా.

ఈ కలికాలంలో జీవులందఱు ఆసురీసంపత్తిని కల్గియున్నారు. చెప్పే వ్యక్తి, శ్రోత అంటే గురువులు, శిష్యులు యిద్దఱు ఆసురీసంపత్తిని కల్గియున్నారు. అది యీ యుగలక్షణము. ఆసురీప్రవృత్తిలోకూడ రకములున్నాయి. అయితే

రావణుడిలాగ వుండొచ్చె లేదా కుంభకర్ణుడిలాగ కూడ వుండొచ్చు. రావణుడు అతి చురుకుదనము కల్గియుంటే; కుంభకర్ణుడు అతి నిద్రాలోలుడు. వీరి మధ్యను పుట్టిన విభీషణుడుకూడ జన్మతః సగం అసురుడే. రాముడు వచ్చేంతవఱకు విభీషణుడుకూడ అసురుడుగానే చెలామణి అయ్యాడు. చెడ్డపనులు చేయకపోయినా రావణరాజ్యంలోనే వున్నాడు. నిద్రపోవడానికి అర్థము యిలా చెప్పుకోవచ్చు. ఒకపని మంచిది కాదు అని తెలిసినా ఆ పని చేస్తుంటే నిద్రపోతున్నట్లే లెక్క. పనిచేయకుండా వున్నవారందఱూ అసురులే అని భాగవతం చెప్పకనే చెబుతోంది. ఉదా॥ వ్యాపారస్థులు, రాజకీయనాయకులు. జీవితంలో పైకి యెదగాలి అనే కోరికలేనివారు యెవరైనాసరే అసురులే.

భాగవతమును వినగావినిగా యిలాంటివారిలో మార్పువస్తుంది. భాగవతం విన్న నారదుడికి నేను యీ జ్ఞానమును ప్రపంచానికి అందియ్యాలి అని అర్థమయ్యింది. అలాగే ధుంధుకారి కూడ తరించాడు. అతను వెదురుబొంగులో దూరి 7 రోజులు అక్కడే వుండి భాగవతమును విన్నాడు. వెదురుబొంగు అనేది ఆధ్యాత్మికజగత్తులో మేరుదండమును సూచిస్తుంది. మేరుదండము దెబ్బతింటే యెంతటివాడైనా సరే కుప్పకూలవల్సిందే. పరీక్షిత్తుకూడ తరించాడు. షట్చక్రము లుండే స్థలంలో దెబ్బతింటే చక్రమునకు చెందిన జ్ఞానేంద్రియములు దెబ్బతింటాయి. ఉదా॥ మూలాధారము దెబ్బతింటే ముక్కు, యానిష్ట్ రెండూ దెబ్బతింటాయి. వాసన చూసే శక్తిపోతుంది. తిన్నది హరాయించుకుని మిగతాది యెంత శాతం బయటికెళ్ళాలో అంతా బయటికిపోవాలి. అలా పనిచేయకపోతే ఆ చక్రము దెబ్బతిన్నట్లే. ఏ చక్రము దెబ్బతిన్నా మనిషి మనుగడ కష్టమే. ముందు వాటిని సరిచేసుకోవాలి. చక్రములు సరిగా పనిచేచకుండా ప్రత్యాహారము, ధ్యానములు, ధారణలు యేమీ పనిచేయవు. యమనియమాలు పాటిస్తూ ఆసన ప్రాణాయామాలను నిత్యకృత్యంగా చేసుకున్న వ్యక్తే ప్రత్యాహారస్థితికి వస్తాడు. ప్రత్యాహారంలో ఇంద్రియములను తనిష్టమొచ్చినట్లు నడిపించగలగాలి. ఇలాంటి స్థితిని పొందిన కొందరిని వుదాహరణగా చెప్పుకుని ముందుకు సాగుదాము.

రమణమహర్షి, గాంధీ వీరిద్దరికి కొన్ని శస్త్రచికిత్సలు చేయాల్సివచ్చింది. అప్పుడు వారు తమకు మత్తుమందు అవసరంలేదని, తాము మాట్లాడుతున్నప్పుడే శస్త్రచికిత్స చేయవచ్చునని చెప్పారు. వైద్యులు ఆశ్చర్యపోయారు. అయినా వారు చెప్పినట్లే శస్త్రచికిత్స చేశారు. నొప్పి తెలియకుండా గాంధీ, రమణమహర్షి మనస్సును ప్రత్యాహారం చేశారు.

మనకు ప్రత్యాహారమే రాదు, ఇంక ధ్యాన మేమి చేస్తాము?

అలాగే మఱొకరకంగా కూడ మనము అసురులమే. ఎలా గంటే నిద్ర లేచిన దగ్గఱ్నుండి అనేక పనులు చేస్తూంటాము. మనకు తెలియకుండానే అనేకసార్లు అనేక జీవులను హింసిస్తుంటాము. కొన్నిసార్లు తెలిసి. మనము వేసుకునే అల్లోపతి మందులు అనేక జంతువులనుండి తయారుచేయబడతాయి. మనకు యీ విషయము తెల్సినా ఎంత హాయిగా వాటిని వేసుకుంటున్నామో. మఱి మనము అసురులముకాదా! మరి అసురులు మంచిపనులు చెయ్యగలరా! చెయ్యడం కష్టము. మంచిపనులు చెయ్యనివ్వకుండా వుండే స్థితే కలియుగము. ఒకవేళ చేసినా కీర్తికాంక్షో, పేరు రావాలనే ఏదో వుద్దేశ్యంతో చేస్తాముతప్ప, నిజంగా మంచి జరిగాలి అని చేయడం లేదు.

పరిణామక్రమంలో ముందుకు వెళ్ళాలి అంటే గురువు చెప్పిన పనిచేయాలి. ఈనాడు ఆ ధైర్యము యెంతమంది కున్నది? గురువు చెప్పాడని సమస్తము వదులుకుని ఆయన్ని అనుసరించేవారు యెంతమందున్నారు ప్రపంచంలో? మఱి అలాంటి పనిచేయనివారు అసురులు అంటే తప్పేముంది? గురువుకోసం సర్వం సమర్పించాలనికదా పెద్దలు చెబుతారు. సర్వం సమర్పించడం మాట దేవుడెరుగు. ఆయన చెప్పిన పని మనమున్నచోటనే చెయ్యలేకపోతున్నాము.

ఇంక సమర్పణ సంగతి ఎందుకు? ఒకవేళ గురువు నీ దగ్గఱికి వచ్చి నువ్వు నాతో వచ్చెయ్యి. ఇద్దఱము హిమాలయాలలో తపస్సు చేసుకుందాము అన్నాడనుకోండి. ముందు మీకు తపస్సు యెలా చేయాలో తెలియాలి. కదా! తపస్సెలా చేయాలో తెలియదు. తెలియదని కూడ తెలియని స్థితిలో వుండటంకూడ ఆసురీ లక్షణమే. ఆసురీ స్థితినుండి మెల్లిమెల్లిగా పరిణామక్రమంలో అర్జునస్థితికి రావాలి. అర్జునుడు అంటే రథమును ఇరుసేనల మధ్య నిలపమని చెప్పేవాడు. రెండు సేనలు యేమిటి? ఇటు ఆధ్యాత్మిక జీవితము, అటు భౌతిక జీవితము. రెండింటి మధ్య రథమును నిలపడమంటే సమత్వస్థితిలో వుండటము. సమత్వస్థితిలో వుంటే అర్జునస్థితి వస్తుంది. రజ్జుః అంటే త్రాడు. అరజ్జుః అంటే బంధంలేని స్థితి. త్రాడు యెవఱికి కావాలి? పశువులకు. పశువులు అంటే పాశములు. త్రాడుతో బంధింపబడినవారు జంతుస్థితిలో వున్నట్లు. లేనివారు అర్జునస్థితిలో వున్నట్లు. బాహ్యనియంత్రణ లేకుండా జీవితమును కొనసాగించగలగాలి. అదీ ప్రయత్నం చేసి సాధించవల్సిన ఒక స్థితి. నీలోపలున్న శక్తిని నీయంతట నువ్వు ప్రయత్నంతో సాధించాలి. అది ఎప్పుడు సంభవమంటే అరజ్జుస్థితిలో వున్నప్పుడు. అంటే బంధాలు లేనిస్థితిలో వున్నప్పుడు సాధ్యమౌతుంది.

అర్జునస్థితినుండి ద్వైపాయనస్థితికి యెదగాలి. ద్వంద్వస్థితి వచ్చినప్పుడుడల్లా భారతంలో వ్యాసభగవానుని దర్శనమౌతుంది. మన వివేకము సిద్ధాంతాలకు విరుద్ధంగా వుంటుంది. అప్పుడు దాన్ని సరిచేయగల శక్తి వున్నవాడు వ్యాసమహర్షి. అంటే ఉచితానుచితాలు తెల్సుకుని పనులు చేసే చేతనత్వము.

తండ్రి సుఖం కోసం తను వివాహం చేసుకోనని భీష్ముడు ప్రతిజ్ఞచేశాడు. కానీ వంశం నాశనమయ్యే పరిస్థితి యేర్పడింది. అప్పుడు తల్లే స్వయంగా వివాహం చేసుకొమ్మని అడిగినా భీష్మించుకుని కూర్చున్నాడు భీష్ముడు. చివఱకు యెలాంటి మరణమును ఎదుర్కొన్నాడు? బాణములు ఒళ్ళంత గ్రుచ్చుకుని యమబాధపడి మరణించాడు. కనుక భారతం 'మీరు ఏది సరైన నిర్ణయము అని అనుకుంటున్నారో అది చాలాసార్లు తప్పయ్యే అవకాశ మున్నది' అని చెబుతోంది.

వ్యాసమహర్షికూడ సత్యవతీపుత్రుడే. అయితే భీష్ముడిలాగ భీష్మించుకుని కూర్చోలేదు. ఋషి అయినాకూడ తల్లి ఆదేశం వస్తే చాలు తల్లి సేవలో నిమగ్నమయ్యాడు. వంశం నిలబడటానికి సంతానవంతుడివికమ్మని ఆదేశించింది సత్యవతీదేవి -వ్యాసుడిని. తల్లి ఆజ్ఞను వెంటనే పాటించాడు. ఆ బాధ్యతను ఇంకొరికి అప్పగించలేదు. వ్యాసుడు నేను సన్యాసిని అనే త్రాడుతో బంధింపబడలేదు.

మఱి మనము మనకి యేది యిష్టమో ఆ త్రాడుతో బంధింపబడివున్నాము. ఆ బంధములనుండి ముక్తిచెందాలి.

అర్జునస్థితిలో ఏది చెయ్యాలో అది చెయ్యాలి. అంతేతప్ప ఏది చెయ్యాలనుకుంటున్నావో అది చెయ్యడం కాదు. మనము మన కిష్టమైనది చేస్తాంతప్ప, ఏది చెయ్యాలో అది చెయ్యము. పరిణామక్రమంలో మీరు ఏ పాత్రని పోషించాలో దాన్ని సక్రమంగా పోషించండి. తల్లి తల్లిగా వుండాలి. అత్త - అత్తగానే వుండాలి. ఎవరి పాత్రను వారు సమర్థవంతంగా పోషించాలి. అలా జీవిస్తున్నప్పుడు భీష్ముడిలాగ భీష్మించుకోకూడదు. మారిన పరిస్థితులకు అనుకూలంగా మీరుకూడ మారండి. అలా ప్రవర్తించడము వ్యాసస్థితిని సూచిస్తుంది. ఎవరైనా ఏ పనైనా చెయ్యకపోవడానికి కొంతవరకు వారికి ఆ పని చెయ్యడము యిష్టము లేకపోవడమే. 5 నిమిషాలు ధ్యానానికి సరిగా కూర్చోలేని వ్యక్తి చలనచిత్రమును చూడటానికిమాత్రం 3 గంటలు కదలకుండా కూర్చోగలడు. అలా కూర్చోడానికి గల కారణము ఇష్టము. ధ్యానం చెయ్యాలని లేదుగనుక చెయ్యలేకపోతున్నారుతప్ప, చెయ్యాలి అనుకుంటే చెయ్యగలరు. ఈ విషయము అర్థమైతే

అర్జునస్థితిలో వున్నట్లు. చెయ్యవల్సినది చేస్తే వ్యాసస్థితిలో వున్నట్లు. అర్జునుడుకూడ యుద్ధం చెయ్యననే చెబుతాడు. కృష్ణుడు అతనిలో మార్పుతీసుకొస్తాడు.

మనంకూడ అమ్మో! మేము యీ జన్మలో యీ సాధనలు చెయ్యలేము అని అంటాము. ఈ జన్మలో చెయ్యకపోతే ఏదోఒక జన్మలో చేసితీరాల్సిందే. ఆ చేసేదేదో యిప్పుడే చేస్తే పోలా? వృక్షములు, జంతువులు, దేవతలు పరిణామక్రమంలో ప్రకృతి సహాయంతో యెదుగుతాయి. ఒక్క మనిషిమాత్రమే యీ విషయంలో స్వేచ్ఛను కల్గియున్నాడు. లభించిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకుంటున్నాడు మనిషి. వివేకము వుండవల్సిన మనిషిలోనే వివేకము అనేది లేకుండా పోతోంది. పరిణామక్రమంలో ముందుకు వెళ్ళు అంటే నా కుటుంబము, వుద్యోగము, బాధ్యతలు వున్నాయి, వాటితో అలసిపోయాను అంటూ ఒడ్డున కూర్చుంటాడు. మనకు యే బంధము శాశ్వతము కాదు అని అర్థమవ్వడం లేదు. చనిపోయిన మరుక్షణము యీ బంధాలు, బాధ్యతలు, ఉద్యోగాలు యేమయ్యాయి? మరణించిన తక్షణమే వాటినుండి ముక్తిచెందాడు.

ఏమి చెయ్యాలో తెలీని అగమ్యగోచరస్థితినుండి కచ్చితంగా యిది చేసితీరాలి అనే నిర్ణయాత్మకమైన బుద్ధి రావాలి. అర్జునస్థితి మనస్సును సంకేతిస్తే; వ్యాసస్థితి - బుద్ధిని సంకేతిస్తుంది. వ్యాసస్థితి అనేది ఒంటరిగా రాదు. వ్యాసుడు భాగవతం వ్రాయడానికి గణపతిదేవుని సహాయం తీసుకున్నాడు. గణపతి అంటే గణములకు అంటే సమూహములకు అధిపతి అని. ఒక సమూహం ఒక మంచి పనిచేయాలని సంకల్పిస్తే అది వినాయకచవితిరోజునే ఆరంభించాలి. లేకపోతే ఆ పనిలో విజయం చేకూరదు. ఈనాడు గురువుల లక్ష్యము యేమిటంటే అఖండభారతమును నిర్మించడము. ఇది అందఱూ కల్సిచేస్తేనే సాధ్యపడుతుందితప్ప ఒంటరిగ సాధించలేనిది.

వ్యాసస్థితినుండి మెల్లిగా వ్రజప్రియస్థితికి యెదగాలి. వ్రజభూమి గోశాల. గోవులకు నిలయము. మనస్సు ఇది మంచిది అని చెబితే బుద్ధి దాన్ని బలపఱుస్తుంది. దాన్ని ఆచరణలో పెట్టే చేతనత్వమే వ్రజప్రియ చేతనత్వము. గోపాలుడు అంటే ఇంద్రియములన్నీ వశంలో వున్నవాడు. వ్యాసస్థితిలో కొంచెము ఇంద్రియాలు చలిస్తాయి. శుకుడు తండ్రియైన వ్యాసుడిని వదిలి వెళ్ళిపోతుంటే వ్యాసుడు విలపిస్తాడు. కానీ కృష్ణస్థితి వచ్చేసరికి ఇంద్రియాలన్నీ వశంలోకి వస్తాయి. చలనము వుండదు. ఇంద్రియాలు వశంలోకి రావాలంటే చాల కష్టపడాలి. సామాన్యంగా అధీనంలోకి రావు. ఇంద్రియాలకు అధిపతి ఇంద్రుడు. ఆ ఇంద్రుడిని యెదిరించాలి. కృష్ణుడు ఇంద్రదేవుని యాగం చెయ్యడం ఆపాడుకదా? ఇంద్రుడు దేవుడైనాసరే ఇంద్రియముల అధీనంతో ఆ దేవతలుకూడ కచ్చితంగా మనిషి ఆధీనంలో కొస్తాయి. దేవతలను మా కోర్కెలు తీర్చండి అని ప్రాధేయపడనవసరంలేదు. వారిని అధీనంలో వుంచుకొని మనకు కావల్సిన పనులు చేసుకోవచ్చు. ఈనాడు మనిషి దేవతలను తమ కోర్కెలను తీర్చమని ప్రార్థిస్తున్నారు. ప్రార్థించే వ్యక్తికి శాశించే అధికారము వుండదుకదా! అధికారము రావాలంటే ఇంద్రియములు అధీనంలో వుండాలి.

ఈ స్థితినుండి నారాయణస్థితికి యెదగాలి. నారాయణుడు సర్వవ్యాపి. అఖండచేతనత్వంలో జీవించాలంటే నీ వ్యక్తిగత నిర్ణయము కాకుండా గురువులు చెప్పింది ఆచరణలో పెట్టాలి. ఒకప్పుడు గురువులు గాయత్రీ అందఱూ చెయ్యకూడదు అన్నారు. ఈనాటి గురువులు అసలు మనిషిగా పుట్టింది గాయత్రీ చెయ్యడానికే అని చెబుతున్నారు. రెంటిలో ఏది ఒప్పు, ఏది తప్పు? ఆ నిర్ణయము గురువులు తీసుకుంటారు. మనము చెయ్యవల్సినది కేవలము వాళ్ళు చెప్పింది ఆచరించడమే. ఎందుకంటే గురువులు ఆ అఖండ చేతనత్వంలో లీనమైవుంటారు. వారి ఆలోచనలు యేమి

వుండవు. ఆ అఖండ చేతనత్వము యేది చెబితే గురువులు అదే చేస్తారుగనుక మనము గురువులు చెప్పింది చెయ్యాలి. అందులో మన వుచితానుచిత నిర్ణయాలు యేమి అవసరం లేదు. నీ నిర్ణయము నువ్వు నమ్మిన గురువు ఆలోచనలతో తాదాత్మ్యము చెందాలి.

భౌతికజగత్తులో మనిషి యెన్ని సాధించినా, ఎంత వున్నతస్థితిలో వున్నా అతను ఖండితంగానే వున్నాడు. అసంపూర్ణంగానే వున్నాడు. ఇలాంటి మానసికస్థితిలో మనిషిలోకి అఖండచేతనత్వము ప్రవేశించలేదు.

మనిషికి సుఖాలు అనేవి మూడు జగత్తులలోను లభించాలి. అవి - భౌతికజగత్తు, సూక్ష్మజగత్తు మఱియు కారణ జగత్తు. జాగ్రదావస్థలో లభించేది చింతామణి, పరశువేది. ఒక వ్యక్తి దేశానికి ప్రధానమంత్రి అయ్యాడు. మఱో వ్యక్తి రాష్ట్రపతి అయ్యాడు. ఒకడు రాజకీయనాయకుడయ్యాడు. ఇదంతా భౌతికజగత్తులోనేకదా? భాగవత శ్రవణం వలన భౌతికజగత్తులోని కోరికలు తీరుతాయి.

శాస్త్రవేత్తలు మొదలగువారు తాము కనిపెట్టాలనుకున్నదాన్ని కలలుగని, దానికి భౌతికజగత్తులో ఆకారమును యేర్పరుస్తారు. అలాంటి కలలజగత్తులోని కోరికలుకూడ తీరుతాయిట భాగవతం చదివితే.

అలాగే నిద్రాస్థితిలోని కోరికలుకూడ భాగవతం చదివితే సాకారమౌతాయి. వ్యాపారస్థులు. వీరిలో కొంతమంది మట్టిముట్టుకుంటే బంగారమౌతుంది. వారు యీ నిద్రాజగత్తును బాగా వుపయోగించుకోగలరు. వ్యాపారం చేసేవారందఱూ వ్యాపారవేత్తలుకారు. మట్టిముట్టుకున్నా బంగారంగా మారే సామర్థ్యమున్న వారే నిజమైన వ్యాపారులు.

ఈ నిద్రాస్థితిని మనుష్యులకు అందజేసేది ఋషులు. ఋషులలో 5 రకములున్నాయి. 1. ఋషులు 2. మహర్షులు 3. రాజర్షులు 4. బ్రహ్మర్షులు 5. దేవర్షులు.

మనిషి తను అనుకున్నది సాధించలేకపోవడానికి కారణము చేతనత్వంలో మార్పురాకపోవడమే. చేతనత్వంలో మార్పు అనేది మీరుగనుక భాగవతం సరిగా వింటే క్షణంలో సంభవిస్తుంది.

ఉదా॥ ఒక వ్యక్తి కార్యాలయంలో పనిచేస్తున్నాడు. అతని పై అధికారి అతడిని యేదో కారణం చేత తిట్టాడు. ఇతను మౌనంగా అన్నీ భరించాడు. అదే మనిషి సాయంత్రం యింటికి వస్తాడు. భార్య మాటవరసకు యేదో అన్నది. అంతే ఆవిడని తిడతాడు. ఏమి జరిగింది అక్కడ? చేతనత్వంలో మార్పువచ్చింది. కార్యాలయంలో వున్నప్పుడు తాను నౌకరు అనే భావన వుంటే; ఇంట్లో తను అధికారి అనే అహం వున్నది. కార్యాలయంలో ఇంద్రియాలు అతని నియంత్రణలో వున్నాయి. అదే ఇంట్లో? ఇంట్లో ఇంద్రియాల అధీనంలో అతనున్నాడు.

అయితే చేతనత్వంలో మార్పు రావడానికి మొదటి మెట్టుగా ఆహారం మార్చుకోవాలి. ఆహారమును ప్రసాదంగా మార్చుకుని తినాలనే ఋషులు పూజావిధానంలో చివరలో ప్రసాదవితరణ యేర్పాటుచేశారు. భగవంతునికి నిజంగా నైవేద్యమిచ్చిన ఆహారం తీసుకుంటే విషంకూడ అమృతంగా మారుతుంది. ఉదా॥ మీరాబాయి విషమును తీసుకున్నా అది అమృతంగా మారింది అని మనకు తెల్సుకదా? ఈనాడు మనము భగవంతునికి నైవేద్యమిచ్చిన ఆహారం తీసుకుంటున్నా మనకు యేవిధమైన ఫలితమూ రావడం లేదు.

మనిషి జాగ్రదావస్థనుండి ఎదిగి స్వప్నస్థితిలో జీవిస్తే అతను ప్రపంచమును శాశించగలడు. రాజకీయనాయకులను యిందుకు వుదాహరణగా తీసుకోవచ్చు. వారు మేము అది చేస్తాము, ఇది చేస్తాము అని ముందే వాగ్దానాలు చేస్తారు.

అవి పూర్తిచేస్తారా చెయ్యరా అన్నది తర్వాత. శాస్త్రవేత్తలుకూడ క్యాన్సర్ లాంటి రోగమునకు మందు కనిబెడతాము అని చెబుతున్నారు. అది వారి కలేగా. కనిపెడతారా లేదా అన్నది తర్వాతి విషయము. అలాగే రచయితలు. వీరు అసలుసిసలైన స్వప్నాలను అమ్ముతారు. నటులు అంతే. రాజకీయనాయకులు, వ్యాపారస్థులు, నటులు, రచయితలు, శాస్త్రవేత్తలు వీరందఱూ స్వప్నజగత్తులో జీవించగలిగే చేతనత్వమున్నవారు.

ఋషులు ఈ స్థితిని దాటి నిద్రాస్థితిలో జీవిస్తారు. నిద్ర - అంటే అజ్ఞానస్థితి అని చెప్పుకోవచ్చు, ఇది సామాన్యులకు. ఋషులు యీ స్థితిలో ఎఱుకతో జీవిస్తారు. మనము నిద్రపోతే ప్రపంచముగూర్చి యేమి తెలియదు. నిద్ర మేలుకున్నాక తెలుస్తుంది. ఋషులు ఆ స్థితిలోకూడ ఎఱుకతో జీవించగలరు. వారు అజ్ఞానస్థిత నిద్రని జ్ఞానస్థితనిద్రగా మార్చుగలరు. ఋషి, మహర్షి, రాజర్షి, బ్రహ్మర్షి, దేవర్షి అనేవి నిద్రాజగత్తులో వున్న 5 చేతనత్వస్థితులు. రచయితలు భౌతికజగత్తులో ఏవిధంగా అయితే తమ వూహలద్వారా సృష్టిచేస్తారో; నిద్రాజగత్తులో ఋషులు ఆ పనిచేయగలరు. ఉదా॥ నారదుడు. నారదుడు నాటకం వ్రాస్తే అందులో త్రిమూర్తులు నటులుగా వుంటారు. పురాణాలను వాటిని కాస్త జాగ్రత్తగా గమనిస్తే మనకు యీ విషయము అర్థమౌతుంది. నారదుడు దేవర్షిస్థితిలో వున్నాడు. వశిష్ఠుడు బ్రహ్మర్షిస్థాయిలో వున్నాడు. వశిష్ఠుడు అంటే ఒక విశిష్టమైన కార్యాచరణను అమలులోపెట్టేవాడు. ఆయన అవతారపురుషులైన శ్రీరామచంద్రమూర్తి లాంటివారికికూడ గురుత్వస్థాయి వహించగలడు. రాముడికి ఎలా జీవించాలో వశిష్ఠుడు చెప్పాడు. రాజర్షి అనే చేతనత్వము పై రెండు స్థాయిలను అనుసరిస్తూ ముందుకు సాగుతుంది. జనకుడు రాజర్షి. ఈనాడు యీ స్థాయి పాలకులు లేరు. నెహ్రూ మొదలగువారు యీ కాలంలో వున్న నిజమైన రాజకీయనాయకులు. ఈకాలంలో వున్న నిజమైన వ్యాపారవేత్తలు టాటా, బిర్లా, బజాజ్ మొదలగువారు.

నారదుడు సనకాదులను కలుసుకుని నేను భూలోకయాత్ర చేశాను. అక్కడ తపస్సు, శౌచం, దయ, దానం, సత్యం అనేవి మచ్చుకుకూడ లేవు అంటాడు.

సత్యము - రచయితలు. వారు ఉన్నది వున్నట్లు వ్రాయాలి.

శౌచము - శాస్త్రవేత్త. ప్రయోగాలు చేయాలంటే స్వచ్ఛత ముఖ్యం. ప్రయోగశాలలో ఉప్పుతో ప్రయోగం చేయాలంటే స్వచ్ఛమైన ఉప్పుతోనే చేయాలి. లేదంటే ఫలితము రాదు. మారిపోతుంది. మామూలుగ మనము వాడే ఉప్పు కేజీ 8 రూపాయలు. ప్రయోగాశాలల్లో వాడే ఉప్పు ఖరీదు వందల్లో వుంటుంది.

దానము - వ్యాపారవేత్తలు. వారు యెంత దానం చేస్తే అంత లాభపడతారు.

దయ - రాజకీయవేత్త. రాజుకి దయ అనేది వుండాల్సిన అతి ముఖ్య లక్షణము.

తనస్సు - నటులు. తాము నటించాలంటే నటులు ఆ పాత్రలో లీనమవ్వడానికి తపస్సు చేయాల్సిందే. అలా చేసినవారే నిజమైన నటులై ప్రజల ఆదరమును చూడగొంటారు.

మనిషిలో చేతనత్వము మారడానికి ఆసనాలు అనేవి ముఖ్యపాత్ర వహిస్తాయి అని ఇంతకుముందు చెప్పుకున్నాము. ఉదా॥ ఒక వ్యక్తికి ఉద్యోగం లేదు. అతనికి ఉద్యోగం వచ్చింది. వెంటనే అతని చేతనత్వంలో మార్పువస్తుందికదా! అక్కడ అతని ఆసనం మారింది. నిరుద్యోగి అనే ఆసనంనుండి ఉద్యోగి అనే ఆసనమునకు వచ్చాడు. కనుక చేతనత్వం మారటానికి ఆసనాలు ముఖ్యము అనేకదా అర్థము?

నారదుడు భూమిమీదకు వచ్చినప్పుడు సత్యమును, శౌచమును, దయను, దానమును, తపస్సును పాటించే మనుష్యులే కనిపించలేదట. అంటే మఱోవిధంగా చెప్పుకుంటే సరైన వ్యాపారస్థుడు లేడు, శాస్త్రవేత్త లేడు, రాజకీయనాయకుడు లేడు, నటుడు లేడు, సాహితీవేత్త లేడు. వీరందఱూ పొట్టకూటికోసం తమతమ పాత్రలను పోషిస్తున్నారుతప్ప వారిలో నిజమైన మనిషి లేడు అని వాపోతాడు. వ్యాపారస్థుడు ధనలాభంకోసం వ్యాపారం చేస్తున్నాడుతప్ప దానము చెయ్యడానికి చెయ్యడంలేదు. అలాగే మిగతావారినికూడ అన్వయించుకోవచ్చు.

అందఱూ పాఖండులుగా జీవిస్తున్నారు. పాఖండం అంటే లేనిది వున్నట్లు నటించడము. ఇతరులకోసం అలా నటిస్తూంటారు.

అలా కాకుండా నిజమైన మనుష్యులుగా బ్రతకాలి. తర్వాత ఆధ్యాత్మికజగత్తులో రావల్సిన ముఖ్య మార్పు యేమిటంటే మందాహ - అంటే మంచిది అని తెల్సిన వెంటనే తక్షణమే ఆ పనిచేయగలిగే మనఃస్థితి. సాధకులలో అది రావాలి. ఉదా॥ మీకు ఎవరైనా సహస్రగాయత్రీ రోజు చేస్తుంటే మంచిది అని చెప్పారనుకోండి. మీరది వెంటనే మొదలెట్టెయ్యాలి. అందులో గురువు చెప్పిన పనిని తక్షణమే చేయండి.

ఒకసారి ఒకావిడ 'తనకు సంతానము లేదని, తాను సంతానంకోసం అనేక ప్రయత్నాలు చేశా నని, ఆ ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయని' వేదనతో గురువుగారికి ఉత్తరం వ్రాసింది. గురువుగారు జవాబుగా 'ఎన్నిరకాలుగా తరచిచూసినా నీ తలరాతలో కొన్ని తరాలవఱకు సంతానవంతురాలివయ్యే యోగ్యత లేదు. అయినా నువ్వు ప్రతిదినము గాయత్రీ చాలీసా పారాయణ చెయ్యి. అంతేకాదు ఫలానాచోటున, ఫలానా తేదీన జ్ఞానయజ్ఞము కొనసాగుతుంది. అక్కడి కార్యక్రమంలో పాలుపంచుకో. నువ్వు సంతానవతివౌతావు' అని వ్రాశారు.

సమూహంగా సాధన చేస్తే వచ్చే ఫలితము అర్థమయ్యిందా? కొన్నితరాలవఱకు సంతానవంతురాలయ్యే అవకాశం లేని ఆమె జ్ఞానయజ్ఞంలో పాలుపంచుకుని, సంతానవంతురాలయ్యింది. భారతభూమిలో ప్రాచీనకాలంలో సాధనలు కల్సిచేసేవారు. ఒక క్రొవ్వొత్తి వెలుగుకన్నా, నాలుగు క్రొవ్వొత్తుల వెలుగు యెక్కువ కదా? అలాగే వ్యక్తిగత సాధనకన్నా, సామూహిక సాధన అధిక ఫలవంతము. ముఖ్యంగా కలికాలంలో అది యింకా తీవ్రతరంగా వుంటుంది.

మనిషి ఎంత అద్భుతమైన చేతనత్వస్థితిలో వున్నా - కాలవ్యాలముఖగ్రాస- మృత్యువును వరిస్తాడు. అవతారపురుషులుసైతం మృత్యువుకు తలవంచారు. శ్రీకృష్ణుడు, అంతకుముందు శ్రీరాముడు, శ్రీరామకృష్ణపరమహంస ఎవరైనాసరే అందఱూ కాలుడికి బలైపోతుంటారు. కాలము అనేది ఒక పాములాగ మెల్లగ కదులుతుంటుంది. సమయ మాసన్నమైనప్పుడు మనిషిని కబళిస్తుంది. అయితే భాగవతం మృత్యుముఖంనుండి తప్పించే శక్తి గలది. ఆ విద్యలోనే ఆ మహత్తున్నది. మనిషి మృత్యువును దాటటానికి తగిన మానసికస్థితిలో వుండాలి. లేకుండా భగవంతుడుకూడ యేమి చెయ్యలేడు. మృత్యువును దాటాలని కోరుకునే వ్యక్తి ఎలాంటి మానసికస్థితిలో వుండాలో భాగవతం చెబుతుంది. అంతేకాదు సప్తాహవిధివిధానం ద్వారా మృత్యువును అధిగమించాలి అనే మానసికస్థితిలో శ్రవణం చేస్తే కచ్చితంగా మనిషి అమరత్వమును పొందుతాడు. పరీక్షిత్తు అమరత్వమును పొందాడుకదా!!

గ్రాసం - అంటే ఆహారము. ఆహారము మారితే చేతనత్వము మారుతుంది. చేతనత్వము మారితే మనిషి అమరుడవ్వవచ్చు. అలా మారటానికి మీరే స్థితిలో వున్నా పఱ్వాలేదు. ఆఖరికి శరీరం వదిలేసే స్థితిలో తులసి మిశ్రమంలో స్వచ్ఛమైన గంగాజలం కలిపి సేవిస్తే మృత్యువును దాటవచ్చు. కానీ ఆ పాళ్ళు తెలియాలి. షోడశోపచారపూజలో

'మధ్యేమధ్యే పానీయం సమర్పయామి' అని జలమును సమర్పిస్తాము. ఎవరికి? మీరు పూజించే దేవత/దేవుడికి. కాళ్ళు కడుగుకోవడానికి ఎన్ని నీళ్ళు కావాలి? చెంబునీళ్ళు కావాలి. కదా! మఱి మనము పూజలో చెంచా నీరు సమర్పిస్తాము. అలాగే హస్తౌప్రక్షాళయామి అని ఒక చెంచా నీరు పోస్తాము. పాదౌ ప్రక్షాళయామి అని ఒక చెంచా నీరు పోస్తాము. త్రాగటానికి ఎన్ని నీళ్ళు కావాలి? ఆ పూజలోని ఒక అంతరార్థము యేమిటంటే - నిత్యజీవితంలో నీ ఇంటికి అతిథి వస్తే ఎలా ఆదరించాలో చెప్పడం.

సరే ఆహారము మారింది. మారిన తర్వాత భాగవతమును వినాలి. వృద్ధాశ్రమాలలో ఆహారమును మార్చడము, తర్వాత భాగవతమును వినిపించడము అనే యీ విధానమును అమలుచేయవచ్చు. వారి ఆహారం మార్చి ప్రతిదినము నియమిత సమయాలలో భాగవతమును వినిపించవచ్చు. అయితే యిక్కడ ఒక విషయమును తెల్సుకుని ముందుకు వెళ్ళడం అవసరము. మనము యేది నాటుకుంటామో అది కోసుకుంటాము. ఇది అందఱూ అంగీకరిస్తారు. మఱి మనము వృద్ధాశ్రమాలు పెట్టాము అంటే మనము యేమి నాటుకుంటున్నాము? భవిష్యత్తులోకూడ వృద్ధాశ్రమాలు వుండాలనేకదా? అక్కడున్నవారు కూడ యేమి నాటుకుంటున్నారు? ఈనాడు వారికి సహాయం చేసినవారికి భవిష్యత్తులో వారు సంతానంగా జన్మించే కర్మను నాటుకుంటున్నారు. అప్పుడు వీళ్ళు వాళ్ళని ఆశ్రమంలో చేర్పిస్తారు. ఇస్తినమ్మ వాయినం, పుచ్చుకున్నా వాయనం. సరిపోతుంది. అప్పుడు పరిస్థితి దొందూదొందే.

నిత్యజీవితంలో మనిషికి అనేక సమస్యలు వస్తుంటాయి. వాటిని అధిగమించడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటాడు మనిషి. ముఖ్యంగా గురువును ఆశ్రయిస్తాడు. మనకొచ్చిన సమస్య గురువు దృష్టిలో చాలా చిన్నది. ఆయన తల్చుకుంటే దాన్ని తక్షణమే నివారణ చేయగలడు.

**ఆమయో యశ్చ భూతానాంజాయతే ఏన సువ్రత ।**

**తదేవ హ్యామయం ద్రవ్యం నపునాతి చికిత్సితమ్ ॥ (భా॥ 1-5-33)**

**భావము : ప్రాణులందఱికి యే పదార్థము తింటే రోగమొచ్చిందో అదే పదార్థమును చికిత్సావిధానముల ననుసరించి ప్రయోగిస్తే రోగనివారణ అవుతుందికదా!**

గురువుకి యీ జ్ఞానము వుంటుంది. ఏ పదార్థము ద్వారా రోగనివారణ చేయవచ్చో గురువుకి తెలుసు. ఆ విద్య నుపయోగించి రోగనివారణ చేస్తాడు. చేయడమే కాదు నీ పట్ల ప్రీతికలిగితే నీకు వైకుంఠమునుకూడ ప్రసాదిస్తాడు. గురువు అంటే అజ్ఞానమును పోగొట్టే జ్ఞానస్వరూపము. ఆయన మీకొచ్చిన సమస్యను తక్షణమే నివారణ చేస్తాడు. వైకుంఠం అంటే --- ఒకసారి బ్రహ్మ, విష్ణువులు శివలింగము అంతు కనుక్కుందామని లింగానికి చెరోవైపు ప్రయాణం సాగిస్తారు. యుగాలు గడిచినా దాని అంతు దొరకలేదు. ఆధ్యాత్మికతలో అనంతంయొక్క అంతు దొరకదు. దాన్నే వైకుంఠం అంటారు. ఆధ్యాత్మికతలో ఫలితాలుమటుకు అనంతంగా వుంటాయి. మృత్యుసంబంధమైన యే సమస్యనైనా భాగవతం తీరుస్తుంది. తుది, మొదలు వుంటే అది మృత్యువుకు సంకేతం. ఆద్యంతములు లేకుంటే అది మృత్యురహితము. మనము చెప్పుకునే బ్రహ్మకుకూడ మృత్యువున్నది. మన దృష్టిలో ఆయనకు చాలా వయస్సున్నది. కానీ ఆయనకూడ మృత్యుముఖంలోకి వెళతాడు. మీ సమస్యలుకూడ మృత్యుముఖంలోకి వెళతాయి. ఎందుచేతంటే మొదట్లో ఆ సమస్య లేదు. ఎప్పుడోఅప్పుడు ఆ సమస్య మొదలౌతుంది. అప్పుడు అంతంకూడ వుంటుందికదా! అలాగే పుట్టిన మనిషి కచ్చితంగా మరణిస్తాడు. పరీక్షిత్తుకుకూడ యీ సమస్య వచ్చింది. ఆయన వెంటనే భాగవత సప్తాహ

శ్రవణమును చేయాలనుకున్నాడు. తక్షణమే శుకుడువచ్చి విధివిధానమును ఆరంభించాడు. శుకుడు భాగవతమును మొదలెట్టగానే దేవతలు అక్కడకు వచ్చి 'పరీక్షిత్తుకు మృత్యుభయమున్నది. మేము అమృతము తెచ్చాము. అతనికి ఆ అమృతమును యిస్తే మృత్యువు రాదు. దానికిబదులుగా మాకు భాగవతామృతమును పంచండి' అని శుకుడిని వేడుకున్నారు. అంటే పరీక్షిత్తుకు భాగవతమును చెప్పకుండా మాకు చెప్పండి అనేకదా వారి భావము?

కృష్ణం నారాయణం వన్దే కృష్ణం వన్దే వ్రజప్రియం ।

కృష్ణం ద్వైపాయనం వన్దే కృష్ణం వన్దే పృథాసుతం ॥

**భావము ః నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణదేవునికి నమస్కారము. వ్రజప్రియుడైన శ్రీకృష్ణునికి నమస్కారము. ద్వైపాయనస్వరూపుడైన శ్రీకృష్ణభగవానునికి నమస్కారము. పృథ్వీపుత్రుడుగా జగద్గురు చేతనత్వ ప్రతీకయైన శ్రీకృష్ణునికి నమస్కారము.**

భాగవతమును పారాయణ చేస్తున్నప్పుడు ముందుగా మనకు యశోదానందనుడైన కృష్ణుడో, రుక్మిణీ ప్రాణవల్లభుడైన కృష్ణుడో, అర్జునుని ప్రియసఖుడైన కృష్ణుడో .......గుర్తుకురాకూడదు. మఱి యెవఱు గుర్తుకురావాలి? కృష్ణం నారాయణం వన్దే - అని ఆరంభించాడు శ్లోకమును. నారాయణతత్త్వమును కల్గిన శ్రీకృష్ణుడుని గమనించాలి ముందుగా. నారాయణతత్త్వమైన కృష్ణుడు గుర్తుకురావాలి. ముందుగా ఆ కృష్ణుడి గురించి చెబుతున్నానుతప్ప వ్రజవాసుల కిష్టమైన కృష్ణుడు, ద్వైపాయన స్వరూపుడైన కృష్ణుడుగూర్చి కాదు అని వ్యాసుడి భావము.

ఎందుకని అలా సంబోధించాడు? కృష్ణం వన్దే పృథాసుతం- పృథ్వీపుత్రులంటే యే స్థితిలో వున్నవారు? మామూలు మనిషి స్థాయిలో వున్నవారు అని. అంటే నిర్ణయించుకోలేని స్థితిలో వున్న చేతనత్వము. అతను ద్వంద్వముల చేతిలో చిక్కుకుని వుంటాడు. అర్జునుడు ఆ స్థితిలోనే వున్నాడు. అందుకే సేనయోరుభయోర్మధ్యే రథంస్థాపయమేచ్యుత- అన్నాడు కృష్ణుడు. ఇక్కడ ఒక విషయమును అర్థము చేసుకోవాలి. అర్జునుడు శ్రీకృష్ణుడిని సంబోధిస్తూ అచ్యుత అన్నాడుగాని కృష్ణా! అనో, యశోదాప్రియనందనా! అనో అనలేదు. అచ్యుత - అంటే చ్యుతి లేని స్థితి. పరమశాంత స్థితి. గురుస్థితి. మౌనస్థితి. మనము చ్యుతి చెందిన స్థితిలో వున్నాము. అశాంతిలో అలమటిస్తున్నాము. వారికి స్వాంతన కలిగిస్తాడు. ఆశ్రమాలలో గురువులు శిష్యులను మౌనంగా వుండమంటారు. ఎందుకు? మౌనంగా గనుక వుంటే అచ్యుతస్థితిలోకి మెల్లమెల్లగా ప్రవేశించవచ్చు.

అలాగే ఆశ్రమాలలోకి ప్రవేశించగానే స్థలప్రదక్షిణలు చేయమంటారు. ఎందుకు? భాగవతంలో దానికి చక్కని జవాబు 40వ శ్లోకంలో లభిస్తుంది.

దక్షదిక్షు నిరీక్షన్తీ రక్షితారం నిజం వపుః ।

వీజ్యమానా శతస్త్రీభిర్బోధ్యమానా ముహుర్ముహుః ॥ (శ్లో॥ 40)

**భావము ః ఆమె తన శరీరాన్ని రక్షించే పరమాత్మను దశదిశలలో చూస్తున్నది. ఆమె నలువైపులా వందలాది స్త్రీలు విసనకఱ్ఱలతో విసురుతూ ఆమెను పదేపదే సముదాయిస్తున్నారు.**

దశదిశలు - అంటే స్థలప్రదక్షిణను సూచిస్తున్నది ఆ మాట. భక్తియే ఆ స్థితిలో వున్నది. మఱి సామాన్యులమైన మనము స్థలప్రదక్షిణ చేయాలికదా?

అచ్యుతస్థితిలో వుంటే మీ రథాన్ని సరైనస్థితిలో పెడతాడు జగద్గురువు. రథము అంటే ఆధ్యాత్మికపరిభాషలో శరీరము అని అర్థము. మనిషికున్న రథము అతని శరీరమే. ఆత్మానం రథితం విద్ధి అని ఉపనిషత్తులలో చెబుతారు. మనిషి శరీరమనే రథాన్ని నడిపించేది ఆత్మ. అర్జునుడికి శ్రీకృష్ణుడు రథసారథి అయ్యాడు అంటే అతని ఆత్మస్వరూపమైన కృష్ణుడు సారథ్యము వహించాడు అని. మనము మన సారథ్యమును ఆత్మకు అప్పగించాలి. నేడు మనిషి కోరికల వలలో చిక్కుకుని ఆత్మసంగతి పూర్తిగా విస్మరించాడు. విచిత్రమేమిటంటే మనిషి కోరికలుకూడ బలహీనమైనవి. చాలామందికి తమ కోరిక తీరాలన్న తపనకూడ వుండదు. కోరికలు యౌవనములో వున్న భక్తి అనుకుంటే; ఆ కోరికలు తీరాలంటే వుండాల్సిన జ్ఞానవైరాగ్యములు ముసలితనములో వున్నాయి.

**వృద్ధౌ ద్వౌ పతితౌ పార్శ్వే నిఃశ్వసన్తావచేతనౌ।**

**శుశ్రూషన్తీ ప్రబోధన్తీ రుదతీ చ తయోః పురః ॥ (శ్లో॥ 39)**

**భావము ః అక్కడ దగ్గిరలో యిద్దఱు పురుషులు అచేతనావస్థలో దీర్ఘశ్వాస తీసుకుంటూ పడియున్నారు. ఈ తరుణి వారికి సేవచేస్తోంది. ఒకసారి వారికి చేతనత్వం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నది. ఒక్కొక్కసారి వారిముందు యేడుస్తున్నది.**

జ్ఞానవైరాగ్యములు అచేతనమైపోయాయి. జ్ఞానము మఱియు వైరాగ్యము లేని మనిషి జీవితంలో మిగతావాటిని వుపయోగించుకోడం కొంచెము కష్టము. విద్యార్థి చదువుకోవాలంటే స్నేహితులమీద, వ్యాపకాలమీద వైరాగ్యము వుండాలి. ఉద్యోగంలో మంచి పేరు తెచ్చుకోవాలంటే ముఠారాజకీయాలకు దూరంగా వుండాలి. అది వైరాగ్యము. వ్యాసుడి కాలం నాటికే జ్ఞానవైరాగ్యములు ముసలితనంలో వుంటే; కలియుగంలో వాటి పరిస్థితి ఎలా వుంటుందో వూహించవచ్చు. జ్ఞానవైరాగ్యములుంటే మనిషి జీవితంలో అనేక అద్భుతములు సాధించవచ్చు. ముఖ్యంగా ఆధ్యాత్మికజీవితంలో. ఆశ్రమాలలోకి ప్రవేశించిన సాధకుడు ముందుగా మౌనంగా వుండటము అలవాటు చేసుకోవాలి. తర్వాత ఆశ్రమంలో చేసే మొదటి సాధన స్థలప్రదక్షిణ అవ్వాలి. ఇలా చేస్తూచేస్తూ వుంటే మనిషిలో మార్పువస్తుంది. అతని చేతనత్వము యెదుగుతుంది. అతనిలో భక్తి అభివృద్ధిచెందుతుంది. ఈనాడు యెక్కడ చూసినా భక్తి పేరుతో చేసే మోసం కనిపిస్తోందితప్ప నిజమైన భక్తి కనిపించడంలేదు. అందుకే నారదుడు --------

**సత్యం నాస్తి తపః శౌచం దయా దానం న విద్యతే।**

**ఉదరమ్భరిణో జీవా వరాకాః కూటభాషిణః ॥ (శ్లో॥ 31)**

**భావము ః ఇప్పుడిక్కడ సత్యం లేదు, తపస్సు లేదు, దయ లేదు, దానం లేదు, జీవులందఱూ కడుపు నింపుకోవడానికే జీవిస్తున్నారు.**

మనిషికి సత్యంలేదు, దయలేదు, తపస్సులేదు, దానం లేదు అని నారదుడు వాపోతాడు. అందఱూ ఉదరపోషణార్థము భక్తి అనే ముసుగువేసుకుని జీవిస్తున్నారుట. రాజనీతిజ్ఞులకి ఆ పదవిమీద, కుర్చీమీద భక్తి వున్నదితప్ప ప్రజలకు సేవ చేసే అభిప్రాయము మచ్చుకుకూడ లేదు. వారికి బాధ్యతలు అక్కర్లేదు. పదవులు, వాటిద్వారా లభించే అధికారము కావాలి. అంతే. భక్తి అంటే నీకు యేది కావాలో దాన్ని పొందేంతవఱకునిద్రపోని మానసికస్థితి. గురువుల పనికూడ చెప్పిన సమయానికి ప్రాణమిచ్చైనాసరే చేయాలి. సత్యం అంటే ఒకమాటమీద కట్టుబడి వుండటమేకదా? అలాంటి మనస్తత్త్వమున్నవారు కలికాలంలో అరుదు.

దయ అనేది యెవరి కుండాలి? బలహీనులకా? బలవంతులకా? బలహీనుడికి దయతప్ప ఇంకేమి వుండదు. అతనికి చేతనైనది దయ. కనుక దయ యెవఱి కుండాలి? బలవంతుడికి. బలవంతుడికి దయ వుంటే తనను చుట్టుముట్టి వున్నవారి మంచిని అతనే చూసుకుంటాడు. వారిని కాపాడుకుంటాడు. అది తన సమూహంవఱకు పరిమితమైనా మనకంటే చాలా పెద్దస్థితిలోనే వున్నాడు. బలవంతుడిని చూసి యెవఱైనా సరే భయపడతారుకదా?

ఉదరం భరిణో జీవాః - నా కడుపు నిండితే చాలు అని అనుకోకుండా నాతాలూకువాళ్ళు పైకి రావాలని కోరుకునేవారు. అది భగవంతుని దృష్టిలో తప్పుకాదు. మనకి తప్పు అని అనిపించవచ్చు. ఎందుచేతంటే మనిషి శరీరంలో కాలేయం అనే భాగమున్నది. అది తనకు కావల్సిన పదార్థములను వుంచుకొని మిగిలినవాటిని బయటకు నెట్టివేస్తుంది. అలా చేయకపోతే క్యాన్సర్ అనే వ్యాధి వస్తుంది. కనుక ఆ వ్యాధి పోవాలంటే మన ఆలోచనావిధానం మారాలి.

కూటభాషిణః - బాగా ధనవంతుడు దానం చేస్తే యేదో పన్ను యెగ్గొట్టడానికి చేశాడు అని అంటారు. సామాన్యులు అది కూడ చెయ్యలేకపోతున్నారుగా? ఉంటేగా చేసేందుకు అని ఎదురుప్రశ్న వేస్తారు. దాన్నే కూటభాషణము అని అంటారు. దీనికి మఱో వుదాహరణ చెప్పుకోవచ్చు. గురువులు గాయత్రీమంత్ర జపమును చేయమంటే ఇంట్లోవాళ్ళు గాయత్రీమంత్రమును చేయడానికి ఒప్పుకోవడం లేదండి అని చాలామంది జవాబిస్తారు. అదే యింట్లోవాళ్ళు సినిమా చూడొద్దు అంటే చెప్పకుండాకూడ చూసివస్తున్నాము. మఱి గాయత్రీని కూడ అలానే ఎదిరించి చేసుకోవచ్చుగదా! కూటభాషిణః - అన్నీ వేషాలే. చెయ్యాలనివుంటే ఎవఱు వద్దన్నా చేస్తాము. ఇష్టంలేకపోతే చెప్పినా చెయ్యము. ఆ ఇష్టాన్నే భాగవతంలో భక్తి అని చెప్పాడు వ్యాసుడు. ఆ అర్థము తీసికోవడంలో తప్పు లేదు. ఎవఱికైనా ఏదైనా యిష్టముంటే ప్రపంచమును యెదిరించి అయినా చేసితీరుతారు. ఇష్టము లేక భక్తి వుంటే చెప్పకుండా అయినా చేసేస్తారు. అయితే భక్తి అనేది జ్ఞానవైరాగ్యములమీద ఆధారపడియున్నది.

నారదుడు యమునానది ఒడ్డున భక్తిని దర్శించేముందు అనేక తీర్థస్థలాలను, రాజ్యాలను, పరిపాలనను, ప్రజలను అవగాహ చేసుకున్నాడు. వారందఱూ తప్పుత్రోవలో వున్నారు అని అర్థమైంది. శ్రీకృష్ణుడు తన శ్రీపదములతో విరాజిల్లిన యమునానది ఒడ్డునమాత్రం భక్తి యౌవనంతో వుండగా; ఆమె కుమారులైన జ్ఞానవైరాగ్యములు నీరసించి ముసలితనంతో బాధపడుతూ శోషిల్లియున్నారు.

సామాన్యంగా మనకు జ్ఞానవైరాగ్యములు యెప్పుడొస్తాయి? మన కోరిక తీరనప్పుడు. మనం కోరింది అందని ద్రాక్షపండైనప్పుడు. కానీ భాగవతం చెప్పేదేమిటంటే పని జరిగితే జరుగుతుంది లేకపోతే లేదు. ఈ మానసికస్థితిని నిరంతరము వుంచుకోమని భాగవతవిద్య చెబుతోంది. ఏమి జరిగినా, ఫలితం యెలా వున్నాకూడ నీ బాధ్యతలన్నీ నువ్వు పూర్తిగా అంటే 100% నిర్వర్తించాలి అని. భక్తిచుట్టూ వందమంది స్త్రీలు చేరి ఆమెకు విసనకఱ్ఱతో విసురుతున్నారు. మన కోరికలే అక్కడ వర్ణించబడిన వందమంది స్త్రీలు. భక్తి అంటే ఇష్టము. ఇష్టము దేనిమీద వుంటుంది. మనము కోరుకునే కోరిక మీద. భక్తిని వందలాది కోరికలతో వీస్తుంటాము.

**బాల ఉవాచ : బాల చెప్పెను**

**భో భోః సాధో క్షణం తిష్ఠ మచ్చిన్తామపి నాశయః ।**

**దర్శనం తవ లోకస్య సర్వథాఘహరం పరమ్ ॥ (శ్లో॥ 42)**

**భావము : మహాత్మా! తమరు ఒక్కక్షణం ఇక్కడ నిలచి నా చింతులను దూరం చేయండి. మీయొక్క దర్శనభాగ్యం సంసారంలో గల అన్ని పాపాలను యెల్లవేళలా నశింపజేయగలదు.**

భగవంతునియొక్క, మహాత్ములయొక్క, గురువులయొక్క దర్శనము అనేక పాపాలను పోగొడుతుంది. వారి చిత్రపటములైనాసరే ఆ పని చేస్తాయి. అందుకని మూర్తిపూజను ప్రతిపాదించారు ఋషులు. ఇంట్లో యెక్కడో ఒకచోట భగవంతుని లేదా గురువుది లేదా మహాత్ముని చిత్రపటముంటే మన పాపాలు అలా మెల్లిగా పోతుంటాయి. అయితే యద్భావం తద్భవతి - మన భావననుబట్టే ఫలితాలుంటాయి. గురువుల చిత్రపటాలు పాపాలను నాశనము చేస్తాయి అనే నమ్మకము మనకు లేదు. ఉందని బుకాయిస్తాము. అంటే నటిస్తామన్నమాట. కూటభాషిణః - మన మాటలకు, చేతలకు యెంత తేడా వుంటుందో!! మన మనస్సు సంగతి నోరుచెప్పనక్కర్లేదు, ఆచరణ చెబుతుంది.

**బాల ఉవాచ : బాల చెప్పెను**

**భో భోః సాధో క్షణం తిష్ఠ మచ్చిన్తామపి నాశయః ।**

**దర్శనం తవ లోకస్య సర్వథాఘహరం పరమ్ ॥ (శ్లో॥ 42)**

**భావము : మహాత్మా! తమరు ఒక్కక్షణం ఇక్కడ నిలచి నా చింతులను దూరం చేయండి. మీయొక్క దర్శనభాగ్యం సంసారంలో గల అన్ని పాపాలను యెల్లవేళలా నశింపజేయగలదు.**

మనముకూడ యిలా ప్రవర్తించాలనే భాగవతం ఆదేశిస్తోంది. మన దగ్గఱలో యెవరైనా మహాత్ముడు విడిదిచేశాడు అని తెలిస్తే వెంటనే ఆయనను దర్శించుకోవాలి. ఆయన మనకు యిష్టమా? కాదా? అనేది అనవసరము. మహాత్ముల దర్శనము అనేక పాపాలను పోగొడుతుంది. వారియొక్క స్థాయినిమాత్రము మనము అంచనావేయకూడదు. వేస్తే అది మన స్థాయిలో వేస్తాముగనుక తప్పు నిర్ణయానికి వస్తాము. ఇటువంటి మానసికస్థితి వుంటే విద్యలకు పరాకాష్ఠ విద్య అయిన వేదవిద్య యెలా వస్తుంది? ఎలా అర్థమౌతుంది? నేర్చుకోవాలనే నిజమైన తపనతోబాటు మానసికస్థితికూడ సరిగా వుండాలి. ఉంటే మీరు ఆ విద్యను నేర్చుకోవటానికి ప్రపంచంలో యెవఱూ అడ్డుపడలేరు. కలియుగంలో మనుష్యులు భగవంతునిపై భక్తి వున్నట్లు నటిస్తున్నారు. ఉదరం భరిణోజీవాః పొట్టపోసుకోవడానికి అందఱూ నటిస్తున్నారు. తమతమ రంగాలలో భక్తి వున్నవారు జీవితంలో పైకి వస్తున్నారు. వ్యాపారస్తులకు డబ్బుమీద భక్తి వున్నది. వారు డబ్బు సంపాదిస్తున్నారు. రాజకీయనాయకులకు అధికారంమీద భక్తి వున్నది. వారు అధికారమును పొందుతూనేవున్నారు. సాహితీవేత్తలు ప్రజలకు కావల్సిన సాహిత్యమును అందిస్తూనేవున్నారు. గాంధీ, నెహ్రూ మొదలగువారు మానవునియొక్క ఆలోచనావిధానమును మార్చడంమీద భక్తి కలిగివున్నారు. వారి జీవితాలను గమనిస్తే వారు యెలా పైకి వచ్చారో తెలుస్తుంది. మహాత్ములను కలిసినపుడు మీ మానసికస్థితిని గమనించుకోండి. మన ఆలోచనలతో ఒక నిర్ణయానికి వస్తాముతప్ప; మన బుద్ధిని వుపయోగించి నిర్ణయానికి రావడంలేదు. అందుకే పెద్దలు యెప్పుడు శాస్త్రప్రమాణం అన్నారు. శాస్త్రంలో అలా వున్నదా? లేదా? అని గమనించుకోవాలితప్ప మన బుద్ధిమీద ఆధారపడకూడదు.

మహాత్ములను దర్శించినప్పుడు వారిని ఒక్కక్షణము ఆగమంటాము. ఎక్కువసేపుంటే బహుశ మనము వారిని భరించలేమేమో? నరకం దగ్గఱ ధర్మరాజుని ఒక్కక్షణము ఆగమన్నారుట. ఎక్కువసేపువుంటే ఆయనతో చాలా ప్రమాదం. ఏదో నీతి, ధర్మం, న్యాయం అని చెబుతాడు. అది వినడం వారికి యిష్టంలేదు. అలాగని మహాత్ములు వచ్చినప్పుడు

కేవలం మన సమస్య లేక కష్టము తీరేవఱకుమాత్రమే వారిని వుండమనడం అనేది బహునీచమైన పని. అలా కాకుండా వారిని దర్శిస్తేనే సకలపాపాలు పోతాయి అనే భావంతోగనుక వారిని దర్శిస్తే పాపనాశనము జరిగితీరుతుంది.

బహుధా తవ వాక్యేన దుఃఖశాన్తిర్భవిష్యతి ।

యదా భాగ్యం భవేద్భూరి భవతో దర్శనం తదా ॥ (శ్లో॥ 43)

**భావము ః మీ వచనములు నా దుఃఖమును చాలావఱకు శాంతింపజేస్తాయి. మనుష్యుని భాగ్యోదయం జరిగినప్పుడు మాత్రమే మీలాంటి పుణ్యాత్ముల దర్శనం లభిస్తుంది.**

**నారద ఉవాచ ః నారదుడు చెప్పుచున్నాడు**

కాసి త్వం కావిమౌ చెమా నార్యః కాః పద్మలోచనాః ।

వద దేవి సవిస్తారం స్వస్య దుఃఖస్య కారణమ్ ॥ (శ్లో॥ 44)

**భావము ః అప్పుడు నేను ఆ స్త్రీని అడిగితిని. దేవీ! నీ వెవరివి? ఆ యిద్దఱి పురుషులకు, నీకు సంబంధము మధ్య గల సంబంధ యేమిటి? నీ దగ్గఱున్న యీ కమలనయనములు గల స్త్రీ లెవరు? నీవు నీ దుఃఖమునకు గల కారణమును వివరంగా చెప్పుము.**

ఇక్కడ చెప్పబడ్డ దేవతాస్త్రీలు మన కోరికలే. కోరికలు సరిగా వుండాలి. ఉన్నతర్వాత వాటిని తీర్చుకునే శ్రమ చేయాలి. పట్టుదలా వుండాలి. కానీ కలియుగంలో మనిషి మానసికస్థితి యెలా వున్నదంటే చదవకుండా పరీక్షల్లో మార్కులు రావాలి. కష్టపడకుండా వుద్యోగం రావాలి. తపస్సు చేయకుండా భగవంతుని దర్శనము లభించాలి. .....కోరికలన్నీ భక్తిని చుట్టిముట్టివుంటాయి. వారిని చూసిన నారదుడు భక్తితో -వీరెవరు? ఎందుకిలా వున్నారు? అని ప్రశ్నిస్తాడు.

**బాల ఉవాచ ః బాల చెప్పెను.**

అహం భక్తిరితి ఖ్యాతా ఇమౌ మే తనయౌ మితౌ ।

జ్ఞానవైరాగ్యనామానౌ కాలయోగేన జర్జరౌ ॥ (శ్లో॥ 45)

**భావము ః యువతి అన్నది. 'నా నామము భక్తి. జ్ఞానవైరాగ్యము లనే పేరు గల వీరిరువురు నా పుత్రులు. సమయానికిఱముందే వీరిద్దఱు జర్జరులైనారు.**

భాగవతం మనిషి తననుతాను విశ్లేషణ చేసుకుని తనలోని తప్పులను దిద్దుకోమని చెబుతోంది. రక్తవిశ్లేషణ చేస్తే మనలోని శరీరగత దోషాలు ఎలా తెలుస్తాయో; భాగవతం చదివితే మనలోని లోపాలు తెలుస్తాయి. లోపాలు తెలిస్తే మందువేసుకోవచ్చుగదా? పరీక్ష చేయకుండా, విశ్లేషణ చేయకుండా వైద్యుడుకూడ మందియ్యలేడు. అందుచేత నారదుడుకూడ భక్తిని విశ్లేషణ అడిగాడు. ఆమె జ్ఞానవైరాగ్యములు నా పుత్రులు. వారు ముసలితనంలో బాధపడి శోషిస్తున్నారు అని చెబుతుంది.

ఏదైనా ఒక పనిచేయాలంటే మనిషికి జ్ఞానము వుండాలి. వైరాగ్యమూ వుండాలి. ఒక చలనచిత్రమును చూడాలి. అది కోరిక. ఏ సినిమా చూడాలి? ఏ నటుడు నా కిష్టము? ఆయన సినిమా ఏదైనా ఆడుతున్నాదా? ఇన్ని ప్రశ్నలు

వస్తాయి. ఇదంతా జ్ఞానవిభాగము. ఏ చలనచిత్రమును చూడాలో నిర్ణయించుకున్నాక దానికి కొంత ధనమును, సమయమును వెచ్చించాలి. అలా వెచ్చిస్తే అది వైరాగ్యము. కోరికయొక్క తీవ్రతనుబట్టి జ్ఞానవైరాగ్యములు వుంటాయి.

గఙ్గాద్యాః సరితశ్చేమా మత్సేవార్థం సమాగతాః ।

తథాపి న చ మే శ్రేయః సేవితాయాః సురైరపి ॥ (శ్లో॥ 46)

**భావము : ఈ దేవతలు గంగాది. నదులు వీరందరూ నా సేవకొఱకే వచ్చినారు. ఈవిధంగా యిలా సాక్షాత్తు దేవతలతో నేను సేవింపబడుతున్నప్పటికి నాకు యేవిధమైన శాంతి లేదు.**

ఇదానీం శ్రుణు మద్వార్తాం సచిత్తస్త్వం తపోధన ।

వార్తామే వితతాప్యస్తి తాం శ్రుత్వా సుఖమావహ ॥ (శ్లో॥ 47)

**భావము : ఓ తపోధనా! సావధానచిత్తులై తమరు నా వృత్తాంతమును వినుడు. నా కథ చాలా ప్రసిద్ధిచెందినదైనప్పటికి, దానిని మీరు విని నా బాధలను పోగొట్టి శాంతిని ప్రసాదించండి.**

గంగాది నదులను మనము 'తల్లీ' అని సంబోధిస్తున్నాము. కానీ వాటిలో నానాచెత్తాచెదారం వేసి కలుషితం చేస్తున్నాము. ఇది కూటభాషణం కాదా? మన బుద్ధి భ్రష్టుపట్టింది అని యీ సంఘటన ఋజువు చేయడంలేదా? భాగవతంలో మనలోని లోపాలను యెత్తి చూపిస్తున్నాడు ఋషి. రోగం ఏంటో తెలిస్తేనేగదా మందియ్యగలము? లోపం తెలిస్తేనేగదా దిద్దుకునేది. మన కోరికకూడ మనకు స్పష్టంగా తెలియాలి. దానికి కావల్సిన జ్ఞానవైరాగ్యములు మన దగ్గఱుండాలి. ఉదా॥ మంచి ఆహారం తినాలనిపించింది. వెంటనే ఫలహారశాలకు వెళతాము. డబ్బుంటేనే యిలాంటి నిర్ణయము తీసుకుంటాము. డబ్బు లేదంటే యింట్లో కుండలోని చల్లనినీరు త్రాగి హాయిగా పడుకుంటాము. అంటే కోరికైతే వున్నదిగాని దానికి తగిన జ్ఞానవైరాగ్యములు లేవు. జ్ఞానవైరాగ్యములు లేని యే కోరికా తీరదు. గురువుకూడ మనకు జ్ఞానవైరాగ్యములు వున్నాయా? మనకు కోరిక తీవ్రంగా వున్నదా? లేదా? అని పరీక్షిస్తాడు.

అయితే మన కోరికలు తీరాలంటే నదులను ఆశ్రయించమని భాగవతం సూచిస్తోంది. కోరికలు తీరడానికి, నదులకి మధ్య సంబంధమును చెప్పకనే చెబుతోంది భాగవతం. కోరికలుకూడ నదులవలె ప్రవహిస్తువుంటాయి. నది యెక్కడైనా ఒకచోట స్థిరంగా వుంటుందా? ఉండదు. నిరంతరము ప్రవహిస్తువుంటుంది. అలాగే మన కోరికలుకూడ స్థిరంగా వుండవు. కోరికలు తీరాలంటే నదీతీరాలను వుపయోగించుకోమనే మన ఋషులు తీర్థస్థలాలను నదీతీరాలలో వుండేట్లు యేర్పాటుచేశారు. అంతేకాదు నదులు మన పాపాలను పోగొడతాయి. ప్రాయశ్చిత్తము చేసుకుంటే పాపాలు సమసిపోతాయి. నదీపుష్కరాల్లో ఒక రహస్యం దాగియున్నది. రాశిచక్రంలో 12 రాశులున్నాయి. ఈ 12 రాశులు 12 సంవత్సరాలలో 12 నదులకు వస్తాయి. ఈ 12 సంవత్సరాలలో నదులు ఒక్కొక్క రాశిలో తిరుగుతూ అనంతశక్తితో వుంటాయి. కాబట్టి ఆరోజులలో నదీ స్నానము చాలా మంచిదని యీ నదులే చెబుతున్నాయి.

నదులన్నీకూడ దేవతా రూపంలో కోరిక దగ్గఱకు వచ్చి సేవచేస్తున్నాయి. కోరికలు తీర్చడానికైనా కూడ వాళ్ళ సేవలు నాకు వుపయోగపడటంలేదు అని భక్తి బాధపడుతుంది. కోరిక తీరాలంటే నదుల దగ్గఱకుకూడ జ్ఞానవైరాగ్యములు లేకుండా వెడితే అవికూడ యేమి చేయలేవు.

ఉత్పన్నా ద్రవిడే సాహం వృద్ధిం కర్ణాటకే గతా ।

క్వచిత్క్వచిన్మహారాష్ట్రే గుర్జరే జీర్ణతాం గతా ॥ (శ్లో॥ 48)

**భావము : నేను ద్రవిడదేశంలో పుట్టి, కర్ణాటకలో పెరిగి, మహారాష్ట్రలో అక్కడక్కడ సన్మానింపబడ్డాను. కానీ గుజరాత్‌లో నాకు ముసలితనము వచ్చింది.**

కోరిక యెక్కడ పుట్టింది? ద్రవిడదేశంలో. ఎక్కడ పెరిగింది? కర్ణాటకలో పెరిగిందిట. మహారాష్ట్రలో సన్మానాలు పొందింది. కానీ గుజరాత్‌లో ముసలితనానికి లోనయ్యింది. కోరికలు యెలా అభివృద్ధి చెందుతాయో యీ శ్లోకంలో వ్యాసమహర్షి తెలియజేశాడు. వ్యాసుడిలాంటి భాగవతోత్తముడు, భూత, భవిష్య, వర్తమానాలు తెలిసిన వ్యక్తి వ్రాసిన భాగవతమునకు సంకల్పము చెప్పుకోవాలి. సంకల్పము అనేది కోరిక తీరడానికి అత్యంత అవసర విషయము.

తత్ర ఘోరకలేర్యోగాత్పాఖణ్డైః ఖణ్డితాఙ్గకా ।

దుర్బలాహం చిరం యాతా పుత్రాభ్యాం సహ మన్దతామ్ ॥ (శ్లో॥ 49)

**భావము : అక్కడ కలియుగ ప్రభావం వల్ల పాఖండు లందఱు నా అంగములను భంగం చేశారు. చాలాకాలంపాటు నేనిదే అవస్థలో వుండటంవల్ల నేనుకూడ నా పుత్రులతో పాటు దుర్బలనైతిని. నిస్తేజురాలనైతిని.**

ఒక వ్యక్తికి ఒకసారి యేదో ప్రమాదం వలన ఒక ఎముక విరిగింది అనుకుందాము. దాన్ని అతికించారు వైద్యులు. మఱల విరిగింది. ఈసారికూడ అతికించారు. అయితే ఎముకలో ఇదివఱకటి బలము వుండదుకదా? మళ్ళీ విరిగిందిట ఎముక. ఈసారి అసలు బలము వుండదు. అతుక్కున్నాకూడ బలము తగ్గుతూవస్తుంది. చివరకు దుర్బలంగా తయారౌతుంది. భక్తికూడ అలాగే అయ్యిందిట. పోని ఆవిడ కొడుకులు ఆవిడకు సహాయం చేస్తారా అంటే వారు ఆవిడకంటే నీరసించి ముసలితనం వల్ల శోషిస్తున్నారు.

వృన్దావనం పునః ప్రాప్య నవీనేవ సురూపిణీ ।

జాతాహం యువతీ సమ్యక్ప్రేష్ఠరూపా తు సామ్ప్రతమ్ ॥ (శ్లో॥ 50)

**భావము : ఇప్పుడు బృందావనాని కొచ్చిన దగ్గఱనుండి నేను మఱల పరమసుందరిని, సరూపవతిని, నవయువతిని అయ్యాను.**

మీయొక్క కోరిక యెప్పుడు యువతిగా రూపుదాలుస్తుంది? బృందావనానికి వెళితే. అక్కడికి వెళితే సుందరమైన యువతిగా రూపుదాలుస్తుంది.

ఇమౌ తు శయితావత్ర సుతౌ మే క్లిశ్యతః శ్రమాత్ ।

ఇదం స్థానం పరిత్యజ్య విదేశం గమ్యతే మయా ॥ (శ్లో॥ 51)

**భావము : నాముందే అలసిపోయిన నా యిద్దఱు పుత్రులు దుఃఖితు లౌతున్నారు. అందుచేత నేనీ స్థానమును విడిచి వేఱొకచోటుకి వెళ్ళదలచాను.**

భక్తి వేఱొక స్థలమునకు వెళ్ళాలనుకుంటోంది. అంటే కోరిక తీరాలంటే అందుకు అనువైన స్థలమునకు వెళ్ళాలి.

జరఠత్వం సమాయాతౌ తేన దుఃఖేన దుఃఖితా ।

సాహం తు తరుణీ కస్మాత్సుతౌ వృద్ధావిమౌ కుతః ॥ (శ్లో॥ 52)

**భావము : వీరిరువురూ ముసలివారైపోయారు. నేను దీనికి యెంతో దుఃఖిస్తున్నాను. నేను యువతిగా, తరుణిగా వుండగానే యెందుచేత నా యిరువురు పుత్రులు ముసలివారయ్యారు?**

తల్లేమో యువతిగా వున్నది. సంతానము ముసలివారయ్యారు. ఇది యెవరికైనా బాధను కలిగించే విషయమే. తల్లికి ఇంతకంటే బాధాకరమైన విషయము యింకేముంటుంది? కోరికలు మాత్రం తీవ్రంగా వున్నాయి. ఆ కోరికలు తీర్చుకునే మార్గాలుమాత్రము చతికిలపడ్డాయి. సాధారణంగా ముసలివారయ్యాక కోరికలు పెరుగుతాయి. కానీ ఆ కోరికలు తీర్చుకునే సాధనమాత్రము నీర్సంగా వుంటుంది. అప్పుడు ఆ కోరిక తీరుతుందా? తీరదు. మఱి భక్తి, జ్ఞానవైరాగ్యములు ఆరోగ్యంగా వుండాలంటే యేమి చేయాలి? ముఖ్యంగా కలియుగంలో దీనికి పరిష్కారము యేమిటి? శరీరమును, మనస్సును ఆరోగ్యంగా వుంచుకోవాలి. మనశ్శరీరాలు ఆరోగ్యంగా వుండాలంటే ఆసన ప్రాణాయామాలు అభ్యసించాలి.

ప్రకృతియొక్క శక్తులకు ఇంద్రుడు అధిపతి. ఆ ఇంద్రుడిని యెదిరించడానికి శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తాడు. అదే పర్వతాసనము. పర్వతాసనం వేసి భాగవతమును శ్రవణము చేస్తే మీలో వున్న గోవర్ధనగిరికూడ పైకి లేస్తుంది. పర్వతాసనమును అలా అభ్యసిస్తూవుంటే యెప్పుడో అప్పుడు ఆ సంఘటన జరుగుతుంది. గో అనగా ఆధ్యాత్మికపరిభాషలో 'వాక్కు' అని; 'ఇంద్రియాలు' అని రెండు అర్థాలు చెప్పారు. మనిషి శరీరము శబ్దబ్రహ్మచే నిర్మిత మైనది అని పురాణాలు ప్రవచిస్తున్నాయి. మనశ్శరీరాలలో యేవిధమైన బాధవున్నాకూడ అది శబ్దబ్రహ్మవల్ల నయం చేసుకోవచ్చు అని పెద్దలు, మహాత్ములు చెబుతారు. గిరి అన్నాకూడ వాక్కు అని అర్థమున్నది. గో అన్నాకూడ వాక్కు అనే అర్థమున్నది.

పర్వతాసనము వేస్తే పర్వతము యేవిధంగా అయితే కదలకుండా వుంటుందో, పర్వతం యేవిధంగా అయితే తనచుట్టుప్రక్కలున్న ప్రదేశంకంటే యెత్తుగా వుంటుందో, చుట్టుప్రక్కల వాటిని శాశిస్తుందో అలాగే మీరు మీ జీవిత పరిస్థితులను, మనుష్యులను శాశించగలుగుతారు.

మనిషి చేతనత్వము 3 స్థితులలో వుంటుంది. అవి 1. జాగ్రత, 2. స్వప్న, 3. సుషుప్తి(నిద్రావస్థ) అవస్థలు. ప్రస్తుతము మనిషి జాగ్రదావస్థలో చేయగలిగే పనులన్నీ చేయగలుగుతున్నాడు. చలాకీగా వున్న మనిషి తాను చేయదలచుకున్న పనిని నిరంతరము అలా చేసుకుంటూపోతున్నాడు. అయితే అలా చేసుకుంటూ వెళుతున్నప్పుడు మనిషి అలసట మఱియు ఒత్తిడికి గురౌతాడు. ఈ రెండిటివల్ల అనేక రోగాలు మనిషిని ఆక్రమిస్తాయి. పనిచేయాలనే కోరిక అయితే తీవ్రంగా వున్నది. కోరిక అంటే భక్తి అనే అర్థం వస్తుంది అని చెప్పుకున్నాముగదా! కోరిక వున్నది కానీ ఆ కోరిక తీరాలంటే శరీరము సహకరించదు. పనిచేసి చేసి శరీరము అలసిపోయివుంటుంది. ఎంతలాగ అలసిపోతుంది అని చెబుతున్నాడు వ్యాసుడు? వృద్ధౌతౌ పతితౌ పార్శ్వౌ - జ్ఞానవైరాగ్యములు రెండూ భక్తియొక్క రెండుప్రక్కలా పడిపోయియున్నాయిట. మనము నిరంతరము కోమాలోనే వున్నవాళ్ళము. నిజంగా కష్టపడి పనిచేసేవారు అలసిపోతారు అని చెబుతున్నాడు వ్యాసుడు. పెద్దపెద్ద వ్యాపారస్తులు, రాజకీయనాయకులు మొదలగువారు రోజుకు 18 గంటలు కష్టపడతారు. వారిగురించి చెబుతున్నాడు వ్యాసమహర్షి. అంత పనిచేస్తారుకాబట్టి శరీరము అలసిపోతుంది. పడిపోతుంది. వారు జీవితంలో విజయమును చవిచూస్తారు. అలాంటి పరిస్థితినే వ్యాసుడు భక్తి యౌవనవతిగా వుండటము, జ్ఞానవైరాగ్యములు అలసిపడిపోయాయి అని వర్ణించాడు. బాగా పనిచేస్తున్నవారు శరీరానికి యెంత ఒత్తిడినిస్తారంటే

శరీరము అలసి దుర్బలమౌతుంది. ఉదా॥ ఒక విద్యార్థి ఆగకుండా 5 గంటలపాటు చదివితే అతని శరీరమునకు, మస్తిష్కమునకు విశ్రాంతి కావాలి. వ్యాసుడు ఆనాడు జరిగిన సంఘటననే కనుక చెప్పివుంటే భాగవతమును మనము యీనాడు చెప్పుకునేవారంకాదు. ఆ చెప్పబడిన సంఘటన అన్ని దేశకాలాలకు వర్తిస్తుంది.

బలహీనులు, పనిదొంగలు, నిర్వీర్యులు యీ లోకంలో చాలామంది వున్నారు. వారు పనిచేయలేకపోవడానికి కారణము యేమిచెబుతారంటే పరిస్థితులు అని. పరిస్థితులెప్పుడూ పనిచేయలేకపోవడానికి కారణము గాదు. ఏ వనరులూ లేని శ్రీరాముడు -రావణుడితో యుద్ధము చేయగలిగినప్పుడు, కోతులు వారథిని నిర్మించగలిగినప్పుడు సాధారణ పనులు చేయలేమంటే దానర్థ మేమిటి? పనిదొంగలనేగా, బలహీనులనేగా? రాముడుకాబట్టి యుద్ధము చేశాడండీ...... వనరులు లేని పరిస్థితులలోకూడ యుద్ధము చేశాడు గనుక శ్రీరాముడయ్యాడు. తన చేతనత్వమును వున్నతంగా తీర్చిదిద్దుకున్నాడు. భార్యను పోగొట్టుకున్న బాధ ఒకవైపు, వనరులు లేవు అనే ఆలోచన ఒకవైపు వున్నా ధైర్యంగా నిలబడ్డాడుకాబట్టి రాముడయ్యాడు.

చిన్నచిన్న కోరికలు వున్నాయి మనకు. అవి చెడ్డ కోరికలు. వాటిని వదలలేని స్థితిలో వున్నాము మనము. ఎందుకంటే మనలో జ్ఞానవైరాగ్యములు రెండూ నిద్రపోతున్నాయి. కోరిక లేక భక్తి యౌవనవతిగా వున్నది. ఆ కోరికను తీర్చుకునేందుకు కావల్సిన జ్ఞానవైరాగ్యములు ముసలితనంతో శోషిస్తున్నాయి. వైరాగ్యము అంటే మళ్ళీ ఒకసారి అర్థము చేసుకుని ముందుకు సాగుదాము.

విద్యార్థికి పరీక్షలు దగ్గఱపడుతున్నాయి. చదువుకోవాలి. చదువుకోకపోతే మార్కులు రావు. చదవకపోతే మార్కులు రావు అన్న జ్ఞానమైతే వున్నది. కానీ అదే సమయంలో మంచి చలనచిత్రమును చూడాలనిపించింది. ఆ పనిచేయడము తప్పవునా? కాదా? తప్పే. కానీ చూడకుండా వుండే వైరాగ్యము లేదు. చదువుకోవడం మానేసి చలనచిత్రమును చూస్తాడు. మార్కులు తగ్గుతాయి.

సన్యాసులు యెందుకు గొప్పవాళ్ళంటే వారికి భగవద్దర్శనము పొందాలనే తీవ్రమైన కోరిక వున్నది. వారు భగవంతునికోసం మిగతావన్నీ త్యజిస్తారు. త్యజించాలి అన్న జ్ఞానము వున్నది. త్యజించే ఆచరణాత్మకమైన వైరాగ్యము వున్నది. భక్తి, జ్ఞానవైరాగ్యములు- మూడు వారిలో వున్నాయి గనుక వారిని భారతీయులు సనాతనంగా ఆదరిస్తున్నారు. నారదుడు మంచి సన్యాసి. నారదుడు దేవతల దగ్గఱకు వెళ్ళాడు, రాక్షసుల దగ్గఱకు వెళ్ళాడు. మనుష్యుల దగ్గఱకు, ఋషులు దగ్గఱకు వెళ్ళాడు. అందఱి మధ్య సమన్వయము సాధింపజూశాడు. సన్యాసి - యేది మంచిదికాదో దాన్ని తొలగించడానికి ప్రయత్నము చేస్తాడు. నారదుడు నిరంతరము ఆ పనిచేస్తున్నాడు.

మనిషికి యే కోరిక వుండాలి? ఏ కోరిక వుండకూడదు? అన్న యుక్తాయుక్తవిచక్షణాజ్ఞానము వుండాలి. లేకపోతే అనేక సమస్యలు రావడమేకాదు, అనారోగ్యమునకుకూడ గురౌతాడు. అనేక మొండివ్యాధులు అతనిని ఆక్రమిస్తాయి. కోరికలు వుంటే అవి తీరకపోతే శరీరంలో యేమి జరుగుతుందంటే ఆ కోరికకు సంబంధించిన అణువులు శరీరంలో వుంటాయి. కోరిక హెచ్చుతున్నకొద్ది ఆ అణువుల సంఖ్యకూడ హెచ్చుతుంది. ఉండవల్సినవాటికన్నా యెక్కువ కణాలుంటే శరీరము అనారోగ్యం పాలౌతుంది. చివఱికి అది దీర్ఘవ్యాధిగా పరిణమించి మనిషి అంతమౌతాడు. ఉదా॥ క్యాన్సర్ ఇలా వచ్చే ప్రమాదకరమైన వ్యాధియే.

తల్లిదండ్రులుపిల్లలకు యీ జీవించేవిద్యను నేర్పించాలి. వారిలోని అలసటను మఱియు ఒత్తిడిని దూరం చేసే ఆలోచనలను వారిలో రేకెత్తించాలి. జీవితమును ఆనందంగా జీవించడము నేర్పించాలి. నేర్పించకపోతే మీ పిల్లలుకూడ ముసలితనంతో బాధపడుతూ శోషిస్తారు.

ఈనాటి సమాజంలో తల్లిదండ్రులకంటే పిల్లలు వృద్ధావస్థలో వుంటున్నారు. తల్లిదండ్రులు యౌవనంలో వుంటారు. పిల్లలను యెలా పెంచాలో కూడ చెబుతున్నాడు వ్యాసుడు. వారిని మీకంటే బలవంతులుగా, ధైర్యవంతులుగా, సంకల్పవంతులుగా అయ్యేట్లు పెంచుతున్నారా? లేదా? అన్నది గమనించుకోండి అని చెబుతున్నాడు. పిల్లలలో తాము కోరుకున్న కోరిక తీరలేదనుకోండి నిర్వీర్యంగా, దుర్బలంగా కాకుండా ఆ కోరిక తీర్చుకునేందుకు కావల్సిన ఆచరణ చేస్తున్నామా? లేదా? అనే జ్ఞానము వారిలో కలిగించాలి. తల్లిదండ్రుల బాధ్యత యిది. తాము అనుకున్న కోరిక నెరవేరకపోతే పిఱికివారులాగ ప్రవర్తించకుండా ధైర్యంగా సంకల్పవంతులై ముందుకు సాగే వ్యక్తిత్వమును పిల్లలలో కలుగజేయాలి. అలాకాకుంటే వారు నిర్వీర్యులైపోతారు. దుర్బలురైపోతారు. సమాజం అలాంటివారిని గౌరవించదు.

ఈనాడున్న వాతావరణకాలుష్యమునకు కారణము బాహ్యపరిస్థితులకన్నా అంతరంగపరిస్థితులే యెక్కువ కారణము. బయటి పరిస్థితులు మన అంతరంగ పరిస్థితిని సూచిస్తాయి అన్నది ఆధ్యాత్మికజగత్తులోని ఒక సూత్రము. ప్రహ్లాదుడికి పాము విషమే ఎక్కలేదు. పాము విషము ప్రహ్లాదుడిని యేమిచేయలేకపోయింది. దానితో పోలిస్తే కాలుష్యమెంత?

భారతీయులలో వుండే ఆ స్థిరత్వమును అవగాహన చేసుకోండి. వారు దేనికి చలించరు. పర్వతంలాగ వున్నతంగా వుంటారు. స్థిరంగా వుంటారు.

ఈనాటి మనిషిలో యీ స్థిరత్వము లేదు. అంతా అలజడి, గందరగోళము. మానసికజగత్తులోని అలజడే బయటా కనిపిస్తున్నది. ఎవరూ ఎవరి మాటా వినరు. పిల్లలు తల్లిదండ్రుల మాట వినరు. ఎందుకు వినరు అంటే ఎవరికైనా యేదైనా సూచన లేక సలహా యిచ్చేముందు మనము దాన్ని ఆచరించి అప్పుడు చెప్పాలి. లేకపోతే ఎదుటివారు మన మాటను ఖాతరుచేయరు.

ఓసారి శ్రీరామకృష్ణపరమహంస దగ్గఱకు వచ్చి ఒక తల్లి ఇలా అన్నది. 'తన బిడ్డ అధికంగా మిఠాయిలు తింటున్నాడని, గురుదేవులు చెబితే ఆ పిల్లవాడు ఆ అలవాటును మానుకుంటాడ' ని చెప్పింది. గురుదేవులు శ్రీరామకృష్ణపరమహంస మూడువారాలు ఆవిడను త్రిప్పించుకుని అప్పుడు ఆ పిల్లవాడితో నువ్వు మిఠాయిలు తినడం మానెయ్యి' అని చెప్పారు. ఆ పిల్లవాడు వెంటనే మిఠాయిలు తినడం మానేశాడు. గురుదేవులు ఎందుకు మూడువారాలు త్రిప్పించుకున్నారు అంటే ఆయనకుకూడ మిఠాయిలు తినే అలవాటుంది. 3 వారాలపాటు మిఠాయిలు తినే అలవాటును ప్రయత్నము మీద మానుకుని అప్పుడు పిల్లవాడికి తినవద్దు అనే సలహాయిచ్చాడు. ఫలితము వెంటనే కనిపించింది. ఇతరులకు సలహాయిచ్చేముందు మనము దాన్ని ఆచరించి అప్పుడు చెప్పాలితప్ప ఉత్తినే సలహా యిస్తే ఆ వాక్కు ఫలించదు.

మీరు ఆచరించని సూత్రమును ఇతరులకు ఆచరించమని చెబితే వారిలో కోరికను పెంచినవారౌతారుతప్ప ఫలితము రాదు. కోరికలు హెచ్చితే అది రోగములకు దారితీస్తుంది అని పైన చెప్పుకున్నాముగదా! తీవ్రమైన కోరిక రోగములను ప్రోదిచేస్తుంది. భాగవతము యీ విషయమును స్పష్టంగా చెబుతున్నది.

జ్ఞానవైరాగ్యములతో కూడి యున్న కోరిక యే స్థాయిలో వుండాలంటే .....

ఒకసారి శ్రీరామకృష్ణపరమహంస దగ్గఱకు వివేకానంద వచ్చి 'మీరు భగవంతుడిని దర్శించారా? దర్శిస్తే నాక్కూడా భగవంతుని దర్శించాలనుంది, ఎలా దర్శించాలో మీరు చెప్పగలరా?' అని అడిగాడు. తప్పకుండా చెబుతాను అని వివేకానందను గంగానదిలోకి తీసికెళ్ళి నీటిలో ముంచాడు. నీటిలో ముంచబడుతున్న వివేకానంద గాలి కోసం తపించాడు. కొద్ది క్షణాలు వివేకానందను నీళ్ళలో ముంచిపెట్టి తర్వాత బయటకుతీశాడు పరమహంసగురుదేవులు. నీళ్ళలో ముంచినప్పుడు నీ కేమనిపించింది? అని ప్రశ్నించాడు. గాలి కావాలి, అది లేకపోతే చచ్చిపోతాను అని అనిపించింది అన్నాడు వివేకానంద. అప్పుడు శ్రీరామకృష్ణపరమహంస 'నీకు భగవద్దర్శనము కావాలనే కోరిక అంతలాగ వుంటేకచ్చితంగా భగవంతుడు నీకు కనిపిస్తాడు' అని అన్నారు.

భక్తి వుంటే, కోరిక వుంటే అది ఆ స్థాయిలో వుండాలి. దానితోపాటు జ్ఞానవైరాగ్యములు వుండాలి. అప్పుడు ఆ కోరిక ఫలించితీరుతుంది. ఏదైనా ఒక కోరిక వుంటే ఆ కోరిక తీరే ఆచరణ తక్షణమే మొదలెట్టాలితప్ప ఎప్పుడో కాదు. పరీక్షలలో మంచి మార్కులు రావాలంటే కేవలం పరీక్షరోజున చదివితే వస్తాయా? రావు. సంవత్సరం మొదటినుండి చదివి, పరీక్షరోజున ఇంకా యెక్కువ చదివితే అప్పుడు మంచి మార్కులొస్తాయి. ఈ విషయము అందఱికి తెల్సినదేకదా! నారదుడిని భక్తి యిలా అడిగిందిట. 'నేను యువతిగానే వున్నాను. నాపుత్రులు ముసలివారయ్యారు. దీనికి పరిష్కారమేమిటి?'

త్రయాణాం సహచారిత్వాద్వైపరీత్యం కుతః స్థితమ్ ।

ఘటతే జరతా మాతా తరుణౌ తనయావితి ॥ (శ్లో॥ 53)

**భావము : మేము ముగ్గురం ఎప్పుడూ కల్సివుండేవారము. అయినా ఈ వైపరీత్యమేమి? అసలేమి జరగవలె? సహజంగా తల్లిముసలిదై పుత్రులు తరుణవయస్కులుగా వుండవలె.**

అతః శోచామి చాత్మానం విస్మయావిష్టమానసా ।

వదయోగనిధే ధీమన్కారణం చాత్ర కిం భవేత్ ॥ (శ్లో॥ 54)

**భావము : దీనివల్లనే ఆశ్చర్యచికితమైన చిత్తంతో నాకు వచ్చిన యీ దురవస్థకు శోకిస్తున్నాను. మీరు పరమబుద్ధిమంతులు. యోగనిధులు. ఈ పరిస్థితికి కారణము యేమిటో దయచేసి తెలపండి.**

**నారద ఉవాచ : నారదుడు చెప్పెను**

జ్ఞానేనాత్మని పశ్యామి సర్వమేతత్తవానఘే ।

న విషాదస్త్వయా కార్యో హరిః శం తే కరిష్యతి ॥ (శ్లో॥ 55)

**భావము : సాధ్వీ! నా హృదయంలో జ్ఞానదృష్టితో నీకు వచ్చిన సంపూర్ణదుఃఖములకు కారణము చూస్తున్నాను. నువ్వు బాధపడకు. శ్రీహరి నీకు శుభమే చేస్తాడు.**

**సూత ఉవాచ : సూతు డిలా చెప్పెను**

క్షణమాత్రేణ తజ్జాత్వా వాక్యమూచె మునీశ్వరః । (శ్లో॥ 56)

**భావము : నారదముని ఒక్కక్షణం మౌనంగావుండి కారణము తెల్సుకుని ఆమెకు తెలిపెను.**

ఒక్కక్షణంలోనే సమస్యకు నివారణ తెలుసని నారదముని చెప్పాడు. అంటే యిక్కడ భాగవతము మనకు యేమని చెబుతోంది? మీకు భాగవతము అర్థము కావాలంటే ఒక్కక్షణము చాలు అని. ఏ కోరికకైనా క్షణంలో పరిష్కారము దొరుకుతుంది అని చెబుతోంది భాగవతము. మీయొక్క ప్రతీకోరిక క్షణంలో తీరుతుంది అని కూడ చెబుతోంది. అయితే కోరిక తీరడానికి కావల్సిన జ్ఞానవైరాగ్యములు వుండాలి. లేకుంటే యే కోరికా తీరదు. కోరిక తీవ్రంగా వుంటే అసంభవాలు సంభవమౌతాయి. 5 తలలున్న సింహం కావాలనే కోరికుంటే అదీ తీరుతుంది. జ్ఞానేశ్వర్ అనే గురువు గోడను నడిపించాడు. కోరిక తీర్చుకునే మార్గము తెలిస్తే అసంభవాలు సంభవమౌతాయి. భాగవతము కోరికను తీర్చుకునే సూత్రమును చెప్పింది. ఆచరణ అన్నది మనిషి చేతిలో వున్నది. అయితే కోరికలు వెఱ్ఱితలలెయ్యకూడదు. ఈనాడు అభివృద్ధిని సాధించిన మానవజాతి కోరికలు వికృతరూపం ధరిస్తున్నాయి అన్నది వాస్తవము.

**నారద ఉవాచ ః నారదుడు పలికెను**

**శృణుష్వావహితా బాలె యుగోஉయం దారుణః కలిః ।**

**తేన లుప్తః సదాచారో యోగమార్గస్తపాంసి చ ॥ (శ్లో॥ 57)**

**భావము ః దేవీ! సావధానంగా వినుము. ఇది దారుణ కలియుగము. అందువలన ఈకాలంలో సదాచారము, యోగమార్గము, తపము లుప్తమైపోయినవి.**

నారదుడుకూడ కలియుగమునకు 'దారుణ' అనే విశేషణమును తగిలించాడు. సదాచారము, యోగమార్గము, తపము ఈ మూడిటిని అర్థము చేసుకుందాము. సదాచారమన్నా - యమనియమాలన్నా రెండూ ఒక్కటే. అహింస, సత్యం, అస్తేయం, అపరిగ్రహం, బ్రహ్మచర్యం, శౌచం, సంతోషం, స్వాధ్యాయం, తపస్సు, ఈశ్వరప్రణిధానము అనే యమనియమాలే సదాచారము. ఇవి ఆచరించడంతప్ప ఇంకే సదాచారాలు లేవు మనిషికి.

యోగమార్గము - అష్టాంగయోగమార్గమే యోగమార్గము. అష్టాంగయోగమార్గంలో యమనియమాలు మొదటవస్తాయి. అంటే సదాచరమును పాటించుట అంటే అష్టాంగయోగంలోని యమనియమాలను పాటించుట అని అర్థము. యమనియమాల తర్వాత ఆసనప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులు వస్తాయి.

ఆసనప్రాణాయామాల గొప్పదన మేమిటంటే ........ శ్రీకృష్ణుడు 64 రోజులలో 64 విద్యలు నేర్చుకున్నాడు. అందులో దొంగతనముకూడ వున్నది. శ్రీకృష్ణుడు వెన్నదొంగ. అంటే యే ఆసనంలో కూర్చుని, ఏ ప్రాణాయామము చేస్తే మీరు దొంగతనము చేస్తే మిమ్మల్ని దొంగ అనకుండా దేవుడు అని పూజిస్తారో ఆ విద్యను శ్రీకృష్ణుడు నేర్చుకున్నాడు. ఉదా॥ పర్వతాసనం వేస్తే మీకున్న సమస్యలు తొలగిపోతాయి. పర్వతము యెలాగైతే భూమట్టానికి పైన వున్నతంగా వుంటుందో మీరుకూడ సమాజంలో అలాగ వున్నతంగా వుంటారు. పర్వతాసనం సిద్ధిస్తే భూత, భవిష్య, వర్తమానాలు తెలుస్తాయి. భారతీయులు పర్వతాలను పూజించడంలో గల ఒక అంతరార్థమిదే. ఒకప్పుడు భారతభూమిలో పర్వతారాధన వుండేది. అందుకే ఆనాటి ప్రజ ప్రపంచమునకు మార్గదర్శనము చేసి జగద్గురువులుగా నిలిచారు.

యోగమార్గంలో ఆసన, ప్రాణాయామాలు, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము వస్తాయి.

సమాధి - తపస్సులోకి వస్తుంది. యమనియమాలుకూడ తపస్సులో ఒక భాగమే. అయితే అవి ఆధ్యాత్మికజగత్తులోని యోగమార్గంలోని మొదటి అడుగులుమాత్రమే. సమాధి అనేది తుది స్థాయి.

సదాచారము, యోగమార్గము, తపస్సు వున్నచోట కష్టాలుండవు అని భాగవతము చెబుతోంది.

**జనా అఘాసురాయన్తే శాఠ్యదుష్కర్మకారిణః ।**

**ఇహ సన్తో విషీదన్తి ప్రహృష్యన్తి హ్యసాధవః ॥**

**దత్తే ధైర్యం తు యో ధీమాన్ స ధీరః పణ్డితోఽథవా ॥ (శ్లో॥ 58)**

**భావము : మూర్ఖులు దుష్కర్మలు చేస్తూ మనుష్యులు అఘాసురులౌతున్నారు. ప్రపంచంలో ఎక్కడ చూసినా సత్పురుషులు దుఃఖిస్తున్నారు. దుష్టులు సుఖంగా వున్నారు. ఈ సమయంలో ధైర్యం కోల్పోని బుద్ధిమంతుడే జ్ఞాని లేక పండితుడు.**

అఘాసురులు : అఘము అంటే పాపము. కలియుగంలో చాలామంది అఘాసురులున్నారు. కలియుగంలోని మానవుడు పుణ్యకర్మలనుకూడ పాపకర్మలుగానే ఆచరిస్తున్నాడు. ఎందుకంటే పాపకర్మయొక్క అసలుసిసలైన అర్థమేమిటంటే ఆ పాపపుపని చేయడానికి మీరు సిగ్గుపడతారు. కానీ కలియుగంలో పరిస్థితి వ్యతిరేకమయ్యింది. భగవంతుడికి పదిమందిలో వుండగా దణ్ణంపెట్టుకోవడానికి కూడ సిగ్గుపడుతున్నాము. రామరామ అని బిగ్గరగా అనాలంటే సిగ్గు. మఱి పుణ్యకార్యాలనుకూడ పాపకార్యాలుగా చేస్తున్నాడా లేదా కలియుగంలోని మానవుడు. పాపకర్మ చేయడానికి ఎలాంటి మానసికస్థితి వున్నదో; పుణ్యకర్మ చేయడానికికూడ అలాంటి మానసికస్థితే వున్నది నేటి సమాజంలో. ఒక సినిమాపాటను నడివీథిలో పాడుకుంటూ వెళ్ళగలము. సమాజం దాన్ని హర్షిస్తుందికూడ. అదే భగవన్నామమును వుచ్చరిస్తూ భజన చేసుకుంటూ నగరసంచారము చేయమంటే సిగ్గుపడుతున్నారు మనుష్యులు. పాపకర్మకు సిగ్గుపడకుండా, పుణ్యకర్మకు సిగ్గుపడే దురవస్థలో నేటి సమాజం మనుగడసాగిస్తున్నది. చెడ్డపనులు చేయడానికి సిగ్గుపడకుండా హాయిగా చేస్తూ, మంచిపనిచేయడానికి సిగ్గుపడటమేకాదు భయపడుతు జీవిస్తున్న అఘాసరులు నేటి మనుష్యులు.

లంచం తీసుకోవడం నేరము. కానీ సమాజం యేమంటోంది? లంచమును మామూలు అంటోంది. అంటే అది తప్పుకాదు, మామూలుగా చేసే పనే అని హర్షిస్తోంది. పైగా లంచం యివ్వకుంటే పనెలా అవుతుంది? అని ప్రశ్నిస్తున్నది.

సత్పురుషులు : భాగవతోత్తములు మంచిమార్గంలో నడుద్దామంటే బాధలు యెదురౌతున్నాయి. వారు కష్టములను అనుభవిస్తున్నారు.

దుష్టులు : వీరు సుఖంగా వున్నారు. అయితే యిక్కడ ఒక విషయమును అర్థము చేసుకోవాల్సివున్నది. మంచివారు బాధ అనుభవిస్తున్నా వారు హృదయంలోమాత్రము ఆనందంగానే వుంటారు. ఎందుకంటే మంచిపని వారికా ఆనందమునిస్తుంది. దుష్టులు సుఖంగా వున్నట్లు కనిపించిన లోలోపల వారికి బాధ వుంటుంది. భయముంటుంది. ఉదా॥ ఒక దొంగ వున్నాడు. దొంగతనం చేసి చాలా డబ్బు సంపాదించాడు. అనేక సుఖాలు అనుభవిస్తున్నాడు. కానీ మనస్సో? భయంతో కుంచించుకుపోతువుంటుంది. ఎప్పుడు రక్షకభటులొచ్చి బంధిస్తారో తెలియదు. కాబట్టి ఎలాంటి సుఖమును కోరుకుంటున్నాము అన్నది ప్రశ్న.

పండితుడు : కష్టకాలం వచ్చినప్పుడు ధైర్యంగ వుండేవాడే పండితుడు.

**అస్పృశ్యానవలోక్యేయం శేషభారకరీ ధరా ।**

**వర్షే వర్షే క్రమాజ్జాతా మఙ్గళమ్ నాపి దృశ్యతే ॥ ((శ్లో॥ 59)**

**భావము : పృథ్వి ప్రతిసంవత్సరము క్రమక్రమంగా ఆదిశేషునికి భారమౌతున్నది. ఇప్పుడిది ముట్టుకోవడానికేమిటి కనీసము చూడటానికి తగనిదిగా అయినది. ఎక్కడా శుభకరమైన వాతావరణము లేదు.**

**న త్వామపి సుతైః సాకం కో௨పి పశ్యతి సామ్ప్రతమ్ ।**

**ఉపేక్షితానురాగాన్ధైర్జర్జరత్వేన సంస్థితా ॥ (శ్లో॥ 60)**

**భావము : ఇప్పుడు నీకు నీ పుత్రులతోపాటు దర్శనము కావటంలేదు. విషయానురాగంవల్ల అంధులైన జీవులద్వారా వుపేక్షింపబడిన నీవు జర్జరమైపోయావు.**

ఒకప్పుడు కోరికలైనా వుండేవి. ఇప్పుడు ఆ కోరికలుకూడ మనుష్యులలో తగ్గిపోతున్నాయి. ఉన్న ఆ కోరికల తీవ్రతకూడ తగ్గిపోతున్నది. మనిషిలోని కోరికలుకూడ జర్జరమైపోతున్నాయి. గట్టిగా నీకున్న కోరిక యేమిటి అని ఈనాటి మనిసిని నిలదీస్తే సరియైన జవాబు చెప్పగలిగేవారు బహు అరుదు.

**వృన్దావనస్య సంయోగాత్పునస్త్వం తరుణీ నవా ।**

**ధన్యం వృన్దావనం తేన భక్తిర్నృత్యతి యత్ర చ ॥ (శ్లో॥ 61)**

**భావము : బృందావనంయొక్క సంయోగంతో నీవు మళ్ళీ తరుణావస్థ పొందావు. ఇక్కడ భక్తి సర్వత్రా నృత్యము చేయుచున్నది. అందువల్ల ఈ బృందావనధామం ధన్యము.**

బృందావన మంటే? గురువు లందఱి సమాధులను బృందావనం అంటారు. ఉదా॥ రాఘవేంద్రస్వామి బృందావనం. శిరడిసాయి బృందావనం. బృందావనం అంటే సమూహము అని. సమూహం జీవిస్తున్నచోటమాత్రమే కోరికలు త్వరగా తీరుతాయి. కోరిక తీరడానికి సామూహిక ప్రయత్నము వుండాలి.

కనుక కోరిక తీరాలంటే బృందావనంలో వుండాలి. అంటే సామూహిక ప్రయత్నము చేయాలి. కోరిక తీరడానికి ఇక్కడ సూత్రమును చెప్పాడు వ్యాసమహర్షి. కోరిక యౌవనంలో వుండాలంటే బృందావనంలో వుండాలి. విద్యార్థులంతా కలిసి చదువుకునేది ఒక బృందావనం. సైనికులుండేది ఒక బృందావనం. బృందావనంగా వుంటే ప్రభుత్వం చేయలేని పనులు అనేకము మనకు మనమే చేసుకోవచ్చు.

సామూహిక ప్రయత్నము లేకపోతే భక్తి యువతిగా మారదు అని చెబుతున్నాడు వ్యాసుడు. అందుకనే ధన్యం బృందావనం అన్నాడు. ఎక్కడ సమూహం వుంటుందో అక్కడివారి కోరికలు తీరుతాయి.

**అత్రేమౌ గ్రాహకాభావాన్న జరామపి ముఞ్చతః ।**

**కిఞ్చిదాత్మసుఖేనేహ ప్రసుప్తిర్మన్యతే௨నయోః ॥ (శ్లో॥ 62)**

**భావము : కానీ యిక్కడ నీ పుత్రులిరువురికీ గ్రాహకులు లేరు. అందువల్ల వారి ముసలితనము పోవడంలేదు. ఇక్కడ వారికి కొద్దిగా ఆత్మసుఖం ప్రాప్తించడం వల్ల వారు నిద్రపోయినట్లు కనిపిస్తున్నారు.**

సామూహిక ప్రయత్నంతోపాటు జ్ఞానవైరాగ్యములుకూడ వుండాలి. లేకపోతే కావల్సిన ఫలితాలు రావు.

**భర్తి రువాచ : భక్తి అనెను**

**కథం పరీక్షితా రాజ్ఞా స్థాపితో హ్యశుచిః కలిః ।**

**ప్రవృత్తే తు కలౌ సర్వసారః కుత్ర గతో మహాన్ ॥ (శ్లో॥ 63)**

**భావము : పరీక్షిన్మహారాజు యీ పాపపు కలియుగమును యెందుకు వుండనిచ్చెను? ఇది రాగానే అన్ని వస్తువుల సారం అణగారిపోయింది లేక యెక్కడికి పోయిందో తెలియడంలేదు.**

కరుణాపరేణ హరిణాప్యధర్మః కథమీక్ష్యతే ।

ఇమం మే సంశయం చిన్ధి త్వద్వాచా సుఖితాస్మ్యహమ్ ॥ (శ్లో॥ 64)

**భావము : మునీశ్వరా! కరుణామయుడైన శ్రీహరి ఈ అధర్మమును యెలా ఒప్పుకొనినాడు? నా యీ సందేహమును దూరము చేయుము. మీ వచనములతో నాకు శాంతి లభించినది.**

పరీక్షిన్మహారాజు కలిని చంపడానికి కావల్సిన పరిస్థితులున్నప్పటికి యెందుకు చంపలేదు? ఒక అద్భుతమైన, శక్తిసంపన్నుడైన రాజు, జగద్గురువైన శ్రీకృష్ణుని ఆశీర్వచనంతో పుట్టిన రాజు కలిని యెందుకు ఆపలేదు? అని భక్తి ఆవేదన చెందింది.

పుట్టినదగ్గఱ్నుంచి తనను రక్షించినదెవఱా అని అందఱి ముఖాలవంకా చూసినది ఒక్క పరీక్షిత్తేనా? పరీక్షిత్తుకు యెందుకు ఆ పేరొచ్చింది? తల్లిగర్భంలో వున్నప్పుడు ఆశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రము అతడిని కబళించెయ్యబోతే శ్రీకృష్ణుడు ఉత్తర గర్భంలోకి ప్రవేశించి ప్రళయాగ్నిజ్వాలల్లాంటి ఆ అగ్నిజ్వాలలనుండి ఆ శిశువును రక్షిస్తాడు. సుదర్శనచక్రంతో బాహ్య ఆపదలు బిడ్డమీద పడకుండా కాపాడుతాడు. ఎవరు అంగుష్ఠమాత్రదేహుడై నన్ను రక్షిస్తున్నది అని పరీక్షిత్తు ఆలోచన. శ్రీకృష్ణుడు ఒక్క పరీక్షిత్తునేనా రక్షించింది? ఈ సృష్టిలోని ప్రతీజీవిని ఆ కృష్ణుడే దశదిశలనుండి రక్షిస్తున్నాడు. కనుక అందఱూ పరీక్షిత్తులే! భాగవత కథ ప్రతీ మనిషి జీవితకథ. మనుష్యులందఱూ పరీక్షిత్తువలె భగవంతుని రక్షణానుగ్రహములతోనే పుడతారు.

మనిషిలోని ఆజ్ఞాచక్రం గురుపాదుకల నిలయము. దేవాలయాలలో పెట్టే శఠగోపముమీద గురుపాదుక లుంటాయి. ఆ పాదుకలు నీ సమస్యలను తీరుస్తాయి. నీకు ఆధ్యాత్మికవిద్యను ప్రసాదిస్తాయి. నీకు రక్షణ నిస్తాయి.

భాగవతంలో చెప్పబడిన సూత్రములను, నియమాలను నిత్యజీవితంలో ఆచరణలోపెడితే అనుకున్న కోరికలు తీరుతాయి. సమస్యలు తీరుతాయి. ఆరోగ్యం చేకూరుతుంది.

**నారద ఉవాచ : నారదు డిలా అనెను**

యదిపృష్టస్త్వయా బాలే ప్రేమతః శ్రవణం కురు ।

సర్వం వక్ష్యామి తే భద్రే కశ్మలం న్తే గమిష్యతి ॥ (శ్లో॥ 65)

**భావము : కళ్యాణీ! నీవడిగావుకనుక ప్రేమతో నీకు అన్నీ తెలిపెదను వినుము. నేను నీకు అన్ని విషయములను వివరించెదను. దానితో నీ దుఃఖము దూరమౌతుంది.**

యదా ముకున్దో భగవాన్ క్ష్మాం త్యక్త్వా స్వపదం గతః ।

తద్దినాత్కలిరాయాతః సర్వసాధనబాధకః ॥ (శ్లో॥ 66)

**భావము : ఏరోజు శ్రీకృష్ణభగవానుడు భూలోకం వదిలి తన పరంధామమునకు చేరెనో, ఆరోజునుంచే సంపూర్ణసాధనలకు అడ్డుతగిలే కలియుగం ప్రవేశించింది.**

ఈ శ్లోకం అర్థ మేమిటంటే మనిషికి యెప్పుడైతే ఆజ్ఞాచక్రంలో వున్న గురుపాదుకలతో సంబంధము త్రెగిపోయిందో అప్పుడు అంతటా ఆవరించియున్న ఆ భగవంతుని దర్శించలేడు. శరీరంలో భగవంతునికి చెందిన ప్రకంపనలు లుప్తమైపోతాయి. పురుషసూక్తంలో

**' ఓం సహస్ర శీర్ షాపురుషః । సహస్రాక్ష స్సహస్రపాత్ । సభూమింవిశ్వతో వృత్వా । అత్యతిష్ఠ ద్దశాఙ్గులమ్ ॥ పురుష ఏవేదగ్ంసర్వమ్ ' ॥ 1**

**తాత్పర్యము ః- మనకు కనుపించు యీ ప్రపంచమంతయు పరమాత్మయొక్క విరాడ్రూపము. కాన ఆ పరమాత్మ ప్రపంచమందలి సమస్తజీవులలో నున్నాడు.**

గురుపాదుకలనుండి వచ్చే శక్తితో యీ సమస్త విశ్వము సంచాలితమౌతోంది. మనిషిలోని ఆజ్ఞాచక్రంలోంచి వచ్చే హార్మోనులే మనిషి శరీరమును నియంత్రిస్తాయి. అన్నం తింటే దానంతట అదే అరుగుతుందికానీ నువ్వు అన్నం తిన్నాక ప్రత్యేకంగా కాలేయంతో అన్నమును అరిగించు అని యేమి చెప్పవుకదా? గుండె తన పని తానుచేసుకుంటూ పోతుంది. మనిషి శరీరంలో జరిగే పనులు అతని ప్రమేయం లేకుండానే జరుగుతాయి. మనిషి శరీరంలో జరిగే కార్యక్రమాలకు, అతనికి సంబంధము లేదు. ఇవన్నీ ఆజ్ఞాచక్రంలోని హార్మోన్స్ వల్ల నియంత్రించబడతాయి. కానీ హార్మోన్స్‌ను యెలా నియంత్రించుకోవాలో ఈనాటి సామాన్యమానవుడికి తెలియడంలేదు. ఆసనప్రాణాయామాలు ఆజ్ఞాచక్రంమీద సూటిగ తమ ప్రభావమును చూపిస్తాయి.

శరీరంలో జరిగే రక్తప్రసరణకు - బాహ్యప్రపంచంలో ప్రవహించే నదులకు మధ్య సంబంధమున్నది. కలి ప్రవేశించగానే ఆ సంబంధము త్రెగిపోయింది. సంబంధ ముంటే ఈనాడుకూడ నదులను ఋషుల వలె పూజించేవారముగదా! సరయూనది మనిషిలోని మస్తిష్కమును రెండు భాగాలుగా విభజిస్తుంది. గంగానది వెన్నుపూసమీద వుంటుంది. ఇడ - పింగళ - సుషుమ్నలకు; కృష్ణ - కావేరి - సరస్వతీనదులు సంకేతము. భారతభూమిలో వున్న ముఖ్యమైన 7 నదులు మనిషి శరీరంలోని 7 ప్రజ్ఞలకు సంకేతంగా నిలుస్తాయి. వాటినే మన ఋషులు ఇలా వర్ణించారు.

**గంగేచ యమునేచైవ గోదావరీ సరస్వతీ । నర్మదా సిన్ధు కావేరీ జలేస్మిన్ సన్నిధం కురు ॥**

నదులకు మన శరీరంలోని రక్తప్రసరణవ్యవస్థకు మధ్యగల సంబంధము త్రెగిపోవడంతో నదులను మర్చిపోయాము. మనము మర్చిపోయామని సృష్టి తల్లక్రిందులవదుగా? నదులు మన శరీరంలో తమ పని తాము చేసుకుంటుపోతున్నాయి. భవిష్యత్తులోను చేస్తాయి. కలి ప్రవేశము అనేక కష్టములను కొనితెచ్చింది. బాహ్యజగత్తులోలాగే అంతర్జగత్తులోకూడ కలి ప్రవేశం జరుగుతుంది. ఆ కలిని నిరోధించాలంటే గురుపాదుకలను ఆశ్రయించాలి. ఆయన శరణువేడాలి. గురువును యెలా శరణువేడాలో గీతలో స్పష్టంగా చెప్పాడు శ్రీకృష్ణుడు.

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ॥**

**యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ (గీత అ॥ 2, శ్లో॥ 7)**

**తాత్పర్యము ః కృష్ణా! శోకముచే వ్యాకులపాటు నొందుచున్న నా మనస్సు ధర్మాధర్మ విచక్షణ చేయు సామర్థ్యము లేక మూఢత్వము నొందినది. కావున నిన్నడుగుచున్నాను. నాకేది శ్రేయస్కరమో నిర్ణయించి చెప్పుము. నేను నీకు శిష్యుడను, నీవు నాకు గురుడవు.**

గురువు శరణులోకి, నియంత్రణలోకి వెళ్ళిపోవాలి శిష్యుడు. గురుఆజ్ఞానుసారం జీవిస్తే కలి వుండదు. నీ కోరికల అనుసారం జీవిస్తే నీలో కలి వుంటుంది. మనిషి యే పనిచేసినా ఆ పని సవ్యంగా యెప్పుడు జరుగుతుందంటే నిరంతరము మౌనస్థితిలో వుంటే.

దృష్ట్వో దిగ్విజయే రాజ్ఞా దీనవచ్ఛరణం గతః ।

న మయా మారణీయోఽయం సారఙ్గ ఇవ సారభుక్ ॥ (శ్లో॥ 67)

**భావము : దిగ్విజయసమయంలో పరీక్షిన్మహారాజుయొక్క దృష్టిపడినప్పుడు కలియుగం దీనుడివలె ఆయనను శరణుజొచ్చెను. మధువును గ్రోలే భ్రమరంవంటి వాడైన పరీక్షిత్తు యీ కలిని నేను చంపకూడదని నిశ్చయించుకొనెను.**

యత్ఫలం నాస్తి తపసా నయోగేన సమాధినా ।

తత్ఫలం లభతే సమ్యక్కలౌ కేశవకీర్తనాత్ ॥ (శ్లో॥ 68)

**భావము : ఈ కలియుగంలో తపస్సు, యోగము, సమాధులవలన యే ఫలిత మైతే లభించదో; కలియుగంలో అది శ్రీహరి నామస్మరణ చేసినవారికి తప్పనిసరిగా లభిస్తుంది.**

సత్య, త్రేతా, ద్వాపర యుగాలలో తపస్సు, యోగ, సమాధి సాధనలుచేసిన వారు యే స్థితిని పొందలేరో యీ కలియుగంలోనివారు కేవలం నామసంకీర్తనవల్లనే ఆ స్థితిని పొందగలరు. కనుక పరీక్షిత్తు కలిని ప్రవేశించనిచ్చెను. కలియుగంలో తపస్సు, యోగ సాధనలు యేమి చేయనక్కర్లేదు. సమాధు లెలా వుంటాయో అభ్యాసం చేయనక్కర్లేదు. కలియుగమంటే గురుపాదాలనుండి చ్యుతి చెందిన స్థితి. ఆ స్థితిలో వున్న మానవులు తరించేందుకు నామసంకీర్తనమే దారి. మనిషి యెప్పుడు గురుపాదుకల వద్ద జీవించాలి. అలా జీవిస్తే అచ్యుతస్థితిలో వున్నట్లే. అప్పుడే అచ్యుత అనే మాటకు అర్థ మొస్తుంది. కీర్తించడ మంటే అదీ అర్థము.

పూజాది కార్యక్రమాలలోను, సంధ్యావందనంలోను ఆచమనము చేస్తాము. అందులో కేశవనామాలు 24 వస్తాయి. మొదటి నామాలైన ఓం కేశవాయ స్వాహా, ఓం నారాయణాయ స్వాహా, ఓం మాధవాయ స్వాహా అనే మూడు నామాల ద్వారా మీరు అచ్యుతస్థితిలోకి వెళ్ళవచ్చు. సు+ఆహా= స్వాహా అనగా బాగా చెప్పమని. ఏమని బాగా చెప్పాలి? కేశవ, మాధవ, నారాయణ అనే నామాలను బాగ చెప్పాలి అని. అదీ కీర్తనభక్తి.

ఏకాకారం కలిం దృష్ట్వా సారవత్సారనీరసమ్ ।

విష్ణురాతః స్థాపితవాన్ కలిజానాం సుఖాయ చ ॥ (శ్లో॥ 69)

**భావము : ఈవిధంగా సారహీనమైపోయినప్పటికీ కలియుగంలో జన్మించే జీవుల సుఖంకొఱకు కలిని వుండనిచ్చెను.**

కలియుగంలో యెప్పుడైతే గురువుమీద భక్తిపోయి, గురువుకి దూరంగా పోయామో చాలా కష్టాలు వచ్చాయి. ఈ కష్ట సమయంలో కేవలం నామమును తల్చుకుంటే చాలు ఆ కష్టాలు సమసిపోతాయి. అది కలియుగం యొక్క గొప్పదనము. గుండె యెందుకు కొట్టుకుంటోందో, రక్తప్రసరణ యెలా జరుగుతోందో మనకు తెలియదు. మనకు దాహ మెప్పుడు వేస్తుంది? శరీరంలో నీరు తక్కువైనప్పుడు. ఆక లెప్పుడు వేస్తుంది? శక్తి కావల్సివచ్చినప్పుడు. శరీరమునకు కావల్సిన సమస్త అవసరములు గురువే తీరుస్తాడు. అంటే ఆజ్ఞాచక్రం నుండి శరీరమునకు కావల్సినవాటిని ఆయనే సమకూరుస్తాడు. ఎప్పుడేది కావాలో అది అప్పుడు సరఫరా చేస్తుంటాడు. అయితే కలియుగంలోని శరీరమునకు,

సత్య, త్రేతా, ద్వాపర యుగాలలోని శరీరములకు చాలా తేడా వున్నది. పృథ్వీమీద మనిషి శరీరము వాక్కుకి లొంగుతుంది. ఊర్ధ్వలోకాలలో శరీరము వాక్కుకి లొంగదు. శరీరము శబ్దమునకు లొంగాలంటే వారు తపస్సు చేయాలి. మనిషి అయితే విద్య లేక జ్ఞానమును వాక్కుద్వారా గ్రహిస్తాడు. విద్యార్థి జ్ఞానమును ఉపాధ్యాయుడి వాక్కుద్వారా గ్రహించగలడు. కనుక మనిషి శరీరమును వాక్కుద్వారా నిర్మించడమేగాదు, వాక్కు ద్వారా దాన్ని తనకు నచ్చినట్లు మార్చుకోవచ్చు.

ఒక వ్యక్తి తన పై అధికారితో మాట్లాడుతున్నప్పుడు ఒకలాగ, తన పిల్లలతో మాట్లాడుతున్నప్పుడు ఒకలాగ, స్నేహితులతో ఒకలాగ తన వాక్కుని వుపయోగించుకుంటాడు. అంటే మాటలు అనేవి మనిషి పనిని సానుకూలపఱ్చగలవు అని అర్థమౌతోందికదా? ఆధ్యాత్మికజగత్తులోని ఋషులేమి చెబుతున్నారంటే కేశవనామాలను సంధ్యావందనంలో తిరిగితిరిగి చెప్పడంవలన అవి మీ శరీరంలోని బాధలను తొలగిస్తాయి అని. ముఖ్యంగా కలియుగంలోనే అది సంభవము. బాధలు తొలగించుకోవడమేగాదు, వాక్కుద్వారా యుగమునుకూడ మార్చవచ్చు. నూతన యుగమును నిర్మించుకోవచ్చు. యుగం మారటమంటే అర్థ మేంటి? ఖనిజ, వృక్ష, జంతు జగత్తులుకూడ మనిషితోపాటు పరిణామక్రమంలో మార్పుచెందుతాయి. ఇవేకాక దేవలోకజగత్తుకూడ మారుతుంది.

కుకర్మాచ్చరణాత్సారః సర్వతో నిర్గతోఽధునా ।
పదార్థాః సంస్థితా భూమౌ బీజహీనాస్తుషా యథా ॥ (శ్లో॥ 70)

**భావము : ఈ సమయంలో ప్రజలు కుకర్మాచరణయందు ప్రవృత్తులైన కారణంగా సమస్త వస్తువుల సారము తొలగిపోయింది. భూమిమీది అన్ని పదార్థములు బీజంలేని ఊకతో సమానమయ్యాయి.**

విప్రైర్భాగవతీ వార్తా గేహే గేహే జనే జనే ।
కారితా కణలోభేన కథాసారస్తతో గతః ॥ (శ్లో॥ 71)

**భావము : బ్రాహ్మణులు కేవలం అన్నధనులై లోభవశమున ఇంటింటికి వెళ్ళి జనులందఱకు భాగవతం చెప్పడము మొదలిడిరి. అందువల్లనే కథయొక్క సారము పోయినది.**

అత్యుగ్రభూరికర్మాణో నాస్తికా రౌరవా జనాః ।
తేఽపి తిష్ఠన్తి తీర్థేషు తీర్థసారస్తతో గతః ॥ (శ్లో॥ 72)

**భావము : తీర్థములలో అన్నివిధములైన ఘోరకర్మలూ చేసేవారు, నాస్తికులు, నపుంసకులు వుండటము మొదలిడిరి. అందువల్ల తీర్థముల ప్రభావంకూడ మెల్లగా పోతున్నది.**

భారతభూమిలోని అనేక తీర్థాలు వాటి ప్రభావమును కోల్పోయాయి. కోల్పోవడానికి కారణము ఈనాటి మనిషే అన్నది వాస్తవము. వాటిలో శక్తి కేవలం అంతంతమాత్రంగానే వున్నది. అయోధ్యలో నేటికి మాంసం అమ్మరు. సారా దుకాణాలు లేవు. అక్కడ రామనామం యొక్క ప్రభావమున్నది. ప్రభావము పోవడానికి కారణము ఆ తీర్థస్థలంలో యేవిధమైన ఆచరణవుండాలో ఆవిధమైన ఆచరణ లేదు. తిరుపతిలో వేంకటేశ్వరుని సాధనతప్ప మఱింకేది జరుగకూడదు. శ్రీశైలంలో ఏ సాధన జరగాలి? భ్రమరాంబసహిత మల్లికార్జునస్వామి సాధన జరగాలి. తీర్థస్థలాలలో యిటువంటి వాతావరణము తిరిగి నెలకొంటేగాని వాటి వైభవము తిరిగి రాదు.

కామక్రోధమహాలోభతృష్ణావ్యాకులచేతసః ।

తేఽపి తిష్ఠన్తి తపసీ తపఃసారస్తతో గతః ॥ (శ్లో॥ 73)

**భావము : ఎవరి చిత్తమైతే కామక్రోధమదలోభతృష్ణలతో కొట్టుకుంటోందో వారుకూడ తపస్సు అనే నటన చేయుచున్నారు. దానితో తపస్సుయొక్క సారంకూడ పోయినది.**

తపస్సు చేస్తున్నామని అనుకునేవారి మానసికస్థితి యెలా వున్నది? సాధనకు, తపస్సు తగిన మానసికస్థితి లేదు. వారి మనస్సులలో కామక్రోధాది అరిషడ్వర్గాలున్నాయి. లోభము మరీ యెక్కువగా వున్నదిట. అందుకే వ్యాసుడు మహాలోభము అని అన్నాడు. బాహ్యజగత్తులో ఒక విద్యార్థి చదువుకోవాలంటే చాలా ధనమును వెచ్చించాల్సివస్తుంది. కొంత సమయమును అందుకు కేటాయించాలివస్తుంది. అవన్నీ చాలా ఆనందంగా చేసే మనిషి ఆధ్యాత్మికజగత్తులో సమయ, అంశ దానాలియ్యమంటే మొండికేస్తాడు. కేవలం కళ్ళుమూస్కుని చెట్టు క్రింద కూర్చుంటే భగవంతుడు సమస్త కోరికలను తీర్చాలనే తప్పు ఆలోచనావిధానంలో కొట్టుమిట్టాడుతున్నాడు మనిషి. నిత్యజీవితంలోనే కష్టపడకుండా, కొంత సమయమును, ధనమును వెచ్చించకుండా యే పనీ జరుగదు. మఱి అష్టసిద్ధులు, నవనిధులు వచ్చే ఆత్మవిద్యకు మాత్రం డబ్బు ఇవ్వాలన్నా, సమయాన్ని వెచ్చించాలన్నా బాధ. అయితే భాగవతమును శ్రవణము చేస్తే అన్నీ జరుగుతాయి అనే ఆశ్వాసన యిస్తున్నాడు వ్యాసుడు. అయితే మనస్సును ఆనందంతో నింపండి చాలు. కొంచెము దాన్ని అదుపులో పెట్టుకోండి అంటున్నాడు.

మనసశ్చాజయల్లోభాద్దమ్భాత్పాఖణ్డసంశ్రయాత్ ।

శాస్త్రానభ్యసనాచ్చైవ ధ్యానయోగఫలం గతమ్ ॥ (శ్లో॥ 74)

**భావము : మనస్సుపై నిగ్రహం లేకుండా లోభ-దంభ-పాఖండములను ఆశ్రయించుట వలన మఱియు శాస్త్రములను అభ్యసింపకపోవడంవలన ధ్యానయోగ ఫలంకూడ నశించినది.**

పణ్డితాస్తు కళత్రేణ రమన్తే మహిషా ఇవ ।

పుత్రస్యోత్పాదనే దక్షా అదక్షా ముక్తిసాధనే ॥ (శ్లో॥ 75)

**భావము : పండితులు గేదెలవలె వారి స్త్రీలతో రమిస్తున్నారు. వారిలో సంతానం కలిగించే కుశలత్వం తప్ప ముక్తి సాధనలో కుశలత లేదు.**

మహిషా ఇవ - మహిషాసురుడు ఎవఱి చేతిలో చనిపోతాడు. దుర్గాదేవి చేతిలో అసువులుబాస్తాడు. కదా! అలాగే మనలో వున్న మహిషుడుకూడ శక్తిచేతిలో మరణించాలి.

న హి వైష్ణవతా కుత్ర సమ్ప్రదాయపురఃసరా ।

ఏవం ప్రళయతాం ప్రాప్తో వస్తుసారః స్థలే స్థలే ॥ (శ్లో॥ 76)

**భావము : సంప్రదాయానుసారం ప్రాప్తించిన వైష్ణవత్వం మచ్చుకైనా యెక్కడా లేదు. ఈవిధంగా అన్నిచోట్లా అన్ని వస్తువులు సారము కోల్పోయినవి.**అయన్తు యుగ ధర్మోహి వర్తతే కస్యదూషణమ్ ।

అయం తు యుగధర్మో హి వర్తతే కస్య దూషణమ్ ।

అతస్తు పుణ్డరీకాక్షః సహతే నికటే స్థితః ॥ (శ్లో॥ 77)

**భావము : ఇది యీ కలియుగంయొక్క స్వభావము. దీనిలో యెవటి దోషమూ లేదు. అందువల్ల భగవంతుడు పుండరీకాక్షుడు అతి సమీపంలో వుంటూకూడ దీనిని సహిస్తున్నాడు.**

పుండరీకాక్ష అంటే విశ్వపరిణామము తెలిసున్న స్థితి. మనుషులందఱూ కచ్చితంగా విశ్వపరిణామక్రమమును తెల్సుకునేందుకే ఒకచోటున కలుపబడ్డారు. సమాజము యేర్పడటానికి కారణము మనిషి కేవలం తిండి సంపాదనకు, ఉండటానికి ఇల్లు సమకూర్చుకునేందుకు, మానసంరక్షణకు బట్టలను సమకూర్చుకునేందుకుమాత్రమే యేర్పడలేదు. విశ్వపరిణామక్రమమునకు ఒక రూపునివ్వడానికి మానవ సమాజము యేర్పడింది. ప్రతీమనిషిలోను పుండరీకాక్షస్థితి వుంటుంది. కనుక మనిషి పరిణామక్రమమును తెల్సుకునేందుకు ప్రయత్నించాలి. విశ్వపరిణామక్రమంలో మనిషి పాలుపంచుకోవడం మొదలెడితే అతనికి కావల్సినవన్నీ ప్రకృతినుండి సమకూరుతుంటాయి. గురువులు యీ విషయమును యెన్నిసార్లు చెప్పినా మనిషికి యీ విషయము అర్థము కావడంలేదు. కలియుగంయొక్క గొప్పదనమదే. భౌతికసుఖాల వెంటబడకుండా పరిణామక్రమమునకు అనుగుణ్యంగా జీవించడము మొదలెడితే అటు భౌతికసుఖాలు, ఇటు ఆధ్యాత్మికానుభూతులు కూడ మనిషికి కరతలామలకమౌతాయి. అయితే మనిషి పురుషార్థము చేయాలి. చేయకుండా భగవంతుడుకూడ సహాయం చేయలేడు. కనుక కలియుగంలో పుండరీకాక్షుడుకూడ మౌనంగా వున్నాడు అని అంటున్నాడు నారదుడు.

**సూత ఉవాచ : సూతు డిలా అన్నాడు**

**ఇతి తద్వచనం శ్రుత్వా విస్మయం పరమం గతా ।**

**భక్తిరూచే వచో భూయః శ్రూయతాం తచ్చ శౌనక ॥ (శ్లో॥ 78)**

**భావము : శౌనకా! ఈవిధంగా చెప్పిన నారదుని వచనాలను విన్న భక్తి చాలా చకితురాల్లైంది. ఇంకా నారదమహర్షి ఆమెకు యేమి చెప్పాడో వినండి.**

**భక్తి రువాచ : భక్తి అన్నాది**

**సురర్షే త్వం హి ధన్యోఽసి మద్భాగ్యేన సమాగతః ।**

**సాధూనాం దర్శనం లోకే సర్వసిద్ధికరం పరమ్ ॥ (శ్లో॥ 79)**

**భావము : దేవర్షీ! తమరు ధన్యులు. నా సౌభాగ్యవశాన మిమ్ములను కలిశాను. సంసారజీవులకు సాధు దర్శనమే సమస్త సిద్ధులకు కారణము.**

వీలైనన్నిసార్లు మహాత్ములను దర్శించండి. వారికి పూజలు చేయండి, గౌరవించండి, ఆరతులివ్వండి. భగవంతునికి ఆరతిస్తుంటాము కానీ యెందుకిస్తామో తెలియదు. కేవలం కర్మకాండమాత్రము జరుగుతున్నది. ఆరతిస్తున్నప్పుడు కర్పూరజ్వాలలు ప్రజ్జ్వరిల్లుతాయి. ఆ జ్వాలలు భగవత్స్వరూపము. అగ్నిలో యే వస్తువునైనా వేస్తే అది అగ్నిస్వరూపంగా మారుతుంది అన్న విషయము మనకు తెలుసు. మఱి ఆరతి సమయంలో కర్పూరజ్వాలల్లో మన మనస్సును లయం చేస్తే మనము భగవత్స్వరూపంగా మారుతాముకదా!!

జయతి జయతి మాయాం యస్య కాయాధవస్తే

వచనరచనమేకం కేవలం చాకలయ్య ।

ధ్రువపదమపి యాతో యత్కృపాతో ధ్రువోఽయం

సకలకుశలపాత్రం బ్రహ్మపుత్రం నతాస్మి ॥ (శ్లో॥ 80)

భావము : కేవలం మీరు ఒకసారి వుపదేశించినది ధారణ చేసిన ప్రహ్లాదుడు మాయమీద విజయము సాధించాడు. ధృవుడుకూడ మీయొక్క కృపతోనే ధృవత్వము పొందాడు. మీరు మంగళరూపులు. మఱియు సాక్షాత్తు బ్రహ్మయొక్క పుత్రులు. నేను మీకు నమస్కరిస్తున్నాను.

**ఇది పద్మపురాణ ఉత్తరార్ధములో శ్రీమద్భాగవతమహత్యంలో భక్తి - నారద సమాగయోగము అనే**

**ప్రథమోఽధ్యాయము.**